ఎడిటర్ : దేవరకొండ కాళిదాస్

# మెట్రో ఈవినింగ్స్

Estd : 1998, RNI No.68319/98

గోల్కొండ TV

హైదరాబాద్,ఆదివారం,
జూన్ 14, 2026
పేజీలు : 8+4
సంపుటి: 29,సంచిక:05

రూ.6 /-

Published from Hyderabad | http://epaper.metroevenings.com | Metro Evenings Telugu Daily

ఆదివారం, తేది:14-06-2026 శ్రీ పరాభవ నామ సంవత్సరం,అధిక జ్యేష్ఠ మాసం,ఉత్తరాయణం-గ్రీష్మరుతువు,బహుళ పక్షం,చతుర్దశి,రోహిణి,వర్జ్యం,ప.3.20 ల 4.50

## యుద్ధాన్ని ముగించేందుకు సమయం ఆసన్నమైంది మిత్రమా!



ఇంటర్నెట్ డెస్క్: ఇరాన్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతలకు త్వరలోనే తెరపడే అవకాశం కనిపిస్తోంది. ఈ మేరకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో ఫోన్‌లో మాట్లాడినట్లు తెలుస్తోంది. ఇరాన్‌తో శాంతి ఒప్పందం కేవలం మరికొన్ని రోజుల్లోనే కుదిరే అవకాశముందని ఆయనకు తెలిపినట్లు యాక్సియోస్ కథనం వెల్లడించింది. "ఇది మంచి ఒప్పందం.. యుద్ధాన్ని ముగించే సమయం వచ్చేసింది" అని నెతన్యాహుకు ట్రంప్ చెప్పినట్లు సమాచారం.

# అధికారులు అలెర్ట్‌గా ఉండాలి



## వర్షాలపై సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్ (మెట్రో న్యూస్): భారీ వర్షాల నేపథ్యంలో అధికారులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోని ఉన్నతాధికారులు హై అలర్ట్ ఉండాలని ఆదేశించారు. పోలీస్, ట్రాఫిక్ పోలీస్, మున్సిపల్, హైడ్రా, విద్యుత్, వాటర్ బోర్డ్, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. చీఫ్ సెక్రటరీ, డీజీపీ, క్యూర్ పరిధి స్పెషల్ సీఎస్ సహా సీనియర్ అధికారులందరితో యుద్ధ ప్రాతిపదికన సమీక్షించి చర్యలు చేపట్టాలన్నారు. నగరవాసులకు ఇబ్బందులు తలెత్తకుండా సత్వర చర్యలు చేపట్టాలన్నారు. రెయిన్ ఫోర్ కాస్టింగ్ ఆధారంగా రోడ్లపై నీరు నిలిచే ప్రాంతాలు, సమస్యాత్మక ప్రాంతాల్లో ముందస్తుగా టీమ్స్ మోహరించాలన్నారు.



# కోవర్ట్‌ల సంగతి తేలుస్తాం

**మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ**
**ఆమెకు సంబంధించిన వివరాలను లీక్ చేసిన తెలంగాణ కాంగ్రెస్ నేత**
**అంతర్గత విచారణ ప్రారంభమైందన్న మహేశ్ గౌడ్**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): మధ్యప్రదేశ్ రాజ్యసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ తెలంగాణ కాంగ్రెస్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. మీనాక్షిపై ఒక కేసు ఉన్నట్టు తెలంగాణ కాంగ్రెస్ నేతే లీక్ ఇచ్చాడని బీజేపీ నేత ఒకరు వెల్లడించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఈ వ్యవహారంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.
ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర నాయకత్వం అత్యంత సీరియస్‌గా తీసుకున్నట్లు వెల్లడించారు. నామినేషన్ తిరస్కరణకు దారితీసిన పరిస్థితులు ఏమిటి, ఎక్కడ పొరపాటు జరిగింది, దీనికి బాధ్యులు ఎవరు అనే విషయాలపై ఇప్పటికే అంతర్గత విచారణ ప్రారంభమైనట్లు తెలిపారు. ఈ వ్యవహారాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, ఎక్కడ లోపం జరిగిందో, ఎవరి పాత్ర ఉందో సమగ్రంగా సమీక్షిస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్‌లో ఉండి ప్రత్యర్థి పార్టీలకు లాభం చేకూర్చే కోవర్ట్‌లను త్వరలోనే గుర్తిస్తామని మహేశ్ గౌడ్ హెచ్చరించారు. "లీక్ వీరులు ఎవరో, గ్రీక్ వీరులు ఎవరో త్వరలో అందరికీ తెలుస్తుంది" అని అన్నారు. నామినేషన్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పార్టీ నాయకత్వం సంకేతాలు ఇచ్చింది. అంతర్గత విచారణ వేగం పుంజుకోవడంతో లీకుల వెనుక ఉన్న అసలు వ్యక్తులు త్వరలోనే బయటపడే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి.

## ఉపాధి హామీ కొత్త స్కీంపై

**కేంద్రానికి మంత్రి సీతక్క లేఖ!**



# తెలంగాణ నిరసన

హైదరాబాద్ (మెట్రో న్యూస్): కేంద్ర ప్రభుత్వం జూలై 1 నుంచి అమలు చేయాలని ప్రతిపాదించిన వీ బీ జీ రాంజీ స్కీంపై తెలంగాణ ప్రభుత్వం తన నిరసనను అధికారికంగా తెలియజేయాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా.దనసరి అనసూయ సీతక్క తెలిపారు. నివీబీజీ రాంజీ స్కీంను వ్యతిరేకిస్తూ తెలంగాణ శాసనసభ ఇప్పటికే తీర్మానం చేసిన విషయం తెలిసిందే. జూలై 1 నుంచి కొత్త విధానాన్ని అమలు చేయాలంటూ కేంద్రం రా(ష్టాలపై ఒత్తిడి తీసుకొస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయాలను, అభ్యంతరాలను కేంద్రానికి తెలియజేయాలని నిర్ణయించారు. లేఖలో పొందుపరచాల్సిన అంశాలపై జ్యోతి రావు పూలే ప్రజాభవన్‌లో మంత్రి సీతక్క శని వారం నాడు సమీక్ష సమావేశం నిర్వహించారు. నినిఉపాధి హామీ పథకానికి అవసరమైన నిధుల్లో కనీసం 60 శాతం కేంద్రం నుంచి అందాలంటే కొత్త విధానాన్ని అమలు చేయక తప్పదని అధికారులు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, డిమాండ్ ఆధారంగా కాకుండా నార్మేటివ్ విధానంలో పనిదినాల కేటాయింపును ప్రతిపాదించడం సరికాదన్నారు.

## అక్రమాలపై విచారణ జరపాలి!

**రేవంత్‌కు కిషన్ రెడ్డి లేఖ**

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఇటీవల కొన్ని మీడియా కథనాల్లో..సింగరేణిలో అవకతవకలు, అనైతిక కార్యకలాపాలు జరుగుతున్నాయంటూ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ఇలాంటి వార్తల్లోని నిజానిజాలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకోకపోతే సింగరేణి ప్రయోజనాలకు విఘాతం కలిగే అవకాశం ఉందని కేంద్ర బొగ్గు, గనుల మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. దాదాపు రూ.1,600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు అదృశ్యమైందని కథనాలు రావడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. వాస్తవాలను పరిశీలించి, ఆరోపణల్లోని నిజానిజాలపై సమగ్ర విచారణ జరపాలని కోరుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తెలంగాణ ప్రభుత్వం, భారత ప్రభుత్వం సంయుక్త భాగస్వామ్యం ఉన్న సింగరేణి సంస్థలో 40,000 మంది ఉద్యోగులు, వారి కుటుంబాలు జీవనోపాధి పొందుతున్నారు.



# రేపటి నుంచి విద్యార్థులకు అల్పాహారం

హైదరాబాద్ (మెట్రో న్యూస్): విద్యార్థుల్లో పోషకాహార లోపాన్ని నివారించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అల్పాహార పథకాన్ని తీసుకొచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా 1269 పాఠశాలలు, 33 ఇంటర్ కళాశాలల్లో సోమవారం నుంచి ఈ పథకం ప్రారంభంకానుంది. తొలుత కొన్ని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో అల్పాహార కార్యక్రమం ప్రారంభించనున్నారు. ఆ తర్వాత అన్ని బడులు, కళాశాలలకూ విస్తరించనున్నారు. అల్పాహారంతో పాటు పాలు, రాగిజావ అందించనున్నారు.



## ఫోన్ ట్యాపింగ్ కేసులో

# మంత్రి తుమ్మల స్టేట్‌మెంట్ రికార్డు

హైదరాబాద్ (మెట్రో న్యూస్): ఫోన్ ట్యాపింగ్ కేసులో దర్యాప్తులో భాగంగా శనివారం వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు స్టేట్‌మెంట్‌ను సిట్ పోలీసులు రికార్డు చేశారు.2023 ఎన్నికల సమయంలో తుమ్మల ఫోన్ ట్యాప్ అయినట్లు భావిస్తున్న నేపథ్యంలో సిట్ బృందం మంత్రి నివాసానికి వెళ్లి వివరణ తీసుకుంది. ఈ కేసులో జర్నలిస్టులనూ విచారిస్తున్న పోలీసులు... తాజాగా కొందరు రాజకీయ నేతలను విచారించడం... వివరణ తీసుకోవడంపై దృష్టి సారించినట్టు తెలుస్తోంది.త్వరలో ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, అతని తండ్రి మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ లకు కూడా నోటీసులు పంపించారని సమాచారం.

# అన్ని రంగాల్లో రేవంత్ వైఫల్యం

**కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం**

వేములవాడ (మెట్రో న్యూస్): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజకీయ తీరుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. హిట్లర్ తనకు స్ఫూర్తి అని చెప్పుకున్న సీఎం నుంచి ప్రజలు ఇంకేం ఆశించలేరని, ఆయనకు డైలాగులు ఎక్కువ-పని తక్కువ అని ఎద్దేవా చేశారు. మీనాక్షి నటరాజన్‌కు అవమానం జరిగేలా వ్యవహరించిన వ్యక్తి రేవంత్ రెడ్డేనని ఆరోపించారు. ప్రజలు పాలు ఇచ్చే బర్రెను వదిలి, తన్నే దున్నపోతును తెచ్చుకున్నట్లుగా కాంగ్రెస్‌ను ఎన్నుకున్నారని వ్యాఖ్యానించారు.



# సింగరేణిని నిర్వీర్యం చేసింది బీఆర్ఎస్సే

**డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ధ్వజం**

మంచిర్యాల (మెట్రో న్యూస్): సింగరేణి సంస్థను బతికించుకుంటామని కార్మికులను రక్షించుకుంటామని ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శనివారం నాడు మంచిర్యాలలో సింగరేణి సంస్థలో 335 మందికి కారుణ్య నియామక పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి- బిఆర్ఎస్ పార్టీలపైన నిప్పులు చరిగారు. రెండు పార్టీలు బయటకి కొట్లాడుతున్నట్టు నటిస్తూ లోలోపల ఇద్దరు ఒకటిగా మారిపోయి ప్రజలను మోసం చేస్తుందని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఇంకా ఎంతో మంది కారుణ్య నియామకాల కోసం ఎదురుచూస్తున్నారు. వారి దరఖాస్తులను త్వరలోనే పరిశీలించి, అర్హులైన వారందరికీ ఇదే విధంగా బహిరంగ సభ ఏర్పాటు చేసి నియామక పత్రాలు అందిస్తామని ప్రకటించారు.

# ప్రజల వద్దకు ప్రభుత్వం
## వినూత్న కార్యక్రమాలతో సాగిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక




హైదరాబాద్ (మెట్రో న్యూస్): రేవంత్ సర్కారు 99 రోజుల పాటు నిర్వహించిన ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఆశించిన ఫలితాలు సాధించడంపై ప్రజాప్రతినిధులు, అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. 15 వినూత్న కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లడం సత్ఫలితాలను ఇచ్చిందని అంటున్నారు. అన్ని శాఖల ప్రత్యక్ష ప్రమేయంతా ఈ కార్యక్రమం రూపొందించడమే సక్సెస్‌కు కారణం అయ్యిందని చెబుతున్నారు. చూడటానికి కొన్ని చిన్నచిన్న పనులే అయినా... స్థానికంగా గొప్ప మార్పులకు శ్రీకారం చుట్టారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొందరి జీవితాల్లో కొత్త వెలుగులు విరజిమ్మడం విశేషం. బాలల భద్రత, మాదకద్రవ్యాల నిరోధంపై 600 మందికిపైగా పోలీస్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. పోక్సో, సైబర్ సేఫ్టీ, బాల్య వివాహాల నివారణ, డ్రగ్స్ నిరోధం వంటి అంశాలను బలోపేతం చేశారు. రోడ్డు భద్రతలో టెక్నాలజీ వినియోగానికి ప్రాధాన్యం ఇచ్చారు. నాగర్‌కర్నూల్ జిల్లా తర్ణికల్ గ్రామంలో 32 సీసీ కెమెరాలు ప్రారంభించారు. మహబూబ్‌నగర్ జిల్లా పంచవటి విద్యాలయంలో చిల్డ్రన్స్ ట్రాఫిక్ అవేర్‌నెస్ పార్క్ ప్రారంభించారు. పిల్లలు తమ సమస్యలు చెప్పుకునే వేదికగా పలు జిల్లాల్లో బాల్ పంచాయతీలు ఏర్పాటు చేశారు. స్థానిక సమస్యలపై పిల్లలు మాట్లాడే అవకాశం కల్పించడం ఈ కార్యక్రమంలోని ప్రత్యేక అంశం. రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడే గోల్డెన్ అవర్‌పై ప్రత్యేక దృష్టి పెట్టారు. సీపీఆర్ శిక్షణలో 48,227 మంది పాల్గొన్నారు. వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతికతను రైతుల వద్దకు తీసుకెళ్లారు. మహిళా సాధికారతను గ్రీన్ ఎనర్జీతో అనుసంధానించేలా సోలార్ పవర్ ప్లాంట్లు ప్రారంభించారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం వెంకటాపురం గ్రామంలో సోలార్ పవర్ ప్లాంట్లు ప్రారంభమయ్యాయి. జనగాంలో 2, నిజామాబాద్‌లో 8, వనపర్తిలో 1 సోలార్ పవర్ ప్లాంట్ ప్రారంభించారు. మహిళలు, పిల్లల పోషణలో తండ్రుల భాగస్వామ్యాన్ని పెంచేలా ప్రత్యేక ప్రచారం నిర్వహించారు. 38,144 మంది తండ్రుల భాగస్వామ్యం తో ఫాదర్ పార్టిసిపేషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. 19,367 మంది గర్భిణులకు అనీమియా స్క్రీనింగ్ నిర్వహించారు. న్యూట్రిషన్ ఎగ్జిబిషన్ , వంటల పోటీలు, డైటరీ డైవర్సిటీ కార్యక్రమాలు చేపట్టారు. ఉన్నత విద్యలో ఇన్నోవేషన్ సదుపాయాలు బలోపేతం చేశారు. పర్యావరణ థీమ్ కింద 200 మోటరైజ్డ్ ట్రైసైకిళ్లు దివ్యాంగులకు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ ఫ్రీ క్యాంపెయిన్‌లో భాగంగా జూట్ బ్యాగులు కమ్యూనిటీ సభ్యులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు డిజిటల్ సపోర్ట్ అందించారు. విద్యార్థులకు 100 ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు. సామాజిక కార్యక్రమాల్లో యువతను భాగస్వాములను చేశారు. క్రీడలతో పాటు స్వచ్ఛత కార్యక్రమాల్లోనూ యువత పాలుపంచుకున్నారు.

# 12 ఏళ్ల ప్రధాని మోదీ పాలన చారిత్రాత్మకం
### - 2047 నాటికి వికసిత్ భారత్ సాధనే లక్ష్యం
### - బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ ప్రభా గౌడ్



హైద్రాబాద్ (మెట్రో న్యూస్ ): గడిచిన 12 ఏళ్ల ప్రధాని నరేంద్ర మోదీ సుపరిపాలనలో భారతదేశం అంతర్జాతీయ వేదికలపై తిరుగులేని గౌరవాన్ని, శక్తివంతమైన గుర్తింపును సాధించిందని బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ ప్రభా గౌడ్ అన్నారు భాగ్యనగర్ జిల్లా మలక్‌పేట్‌లో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సంక్షేమ పథకాలు, మౌలిక సదుపాయాల విస్తరణ మరియు భారతదేశ ప్రగతికి తీసుకున్న కీలక నిర్ణయాల పై ఆమె మీడియా సమావేశం లో వివరించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పలు ప్రజాహిత కార్యక్రమాల వల్ల దేశవ్యాప్తంగా ప్రజలకు కలిగిన ప్రయోజనాలను వెల్లడించారు. గతంలో అంతర్జాతీయ వేదికలపై భారత్ మాటలకు ప్రాధాన్యత ఉండేది కాదని నేడు ప్రపంచ దేశాలన్నీ భారత్ వైపు చూస్తున్నాయన్నారు.. పీఎం ఆవాస్ యోజన ద్వారా కోట్లాది ఇళ్లను మహిళల పేరిట రిజిస్ట్రేషన్ చేశామని, ఉజ్వల యోజన ద్వారా పొగ నుండి విముక్తి కల్పించామని, ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ. 5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తున్నామని వివరించారు. రాజులమని భావించే కాంగ్రెస్ నాయకులకు పేదరికం, గ్రామీణ బాధలు ఎప్పటికీ అర్థం కావని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా అధ్యక్షులు నిరంజన్ యాదవ్ పార్టీ అధికార ప్రతినిధి చికోటి ప్రవీణ్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మధుకర్ రెడ్డి , సురేందర్ రెడ్డి , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరేందర్ యాదవ్ , కార్యక్రమ సమన్వయకర్త నరసింహ పాల్గొన్నారు.

# హెల్త్ కేర్ కేంద్రంగా హైదరాబాద్
### - ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాదు
### - మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు




హైదరాబాద్ (మెట్రో న్యూస్): హెల్త్ కేర్ ఇన్నోవేషన్స్ కేంద్రంగా హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలపాలన్నదే తమ లక్ష్యమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. హైటెక్ సిటీలోని యశోదా ఆసుపత్రిలో రెండ్రోజుల పాటు నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సును ఆయన శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఏఐ ఏదో ఒక రంగానికి మాత్రమే పరిమితం కాలేదని, అన్నింటికి విస్తరించి మానవ జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ముఖ్యంగా కేవలం వ్యాధి నిర్ధారణ దశకే పరిమితం కాకుండా... రాబోయే ము ప్పును ముందే అంచనా వేసే స్థాయికి వైద్య రంగాన్ని చేర్చిందన్నారు. అలాగే... ప్రతి రోగికి ప్రత్యేక వ్యక్తిగత వైద్య సంరక్షణను అందించే సాధనంగా మారిందన్నారు. ఏఐ ఎప్పటికీ వైద్యుడికి ప్రత్యామ్నాయం కాలేదని స్పష్టం చేశారు. సాంకేతికతకు మానవీయ విలువల్ని జోడించినప్పుడే సమాజానికి మేలు జరుగుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా వృద్ధుల జనాభా పెరుగుతున్న తరుణంలో... క్యాన్సర్, గుండెజబ్బులు వంటి క్లిష్టమైన ఆరోగ్య సవాళ్లకు సరికొత్త పరిష్కారాలు, ఆవిష్కరణలు రావాల్సిన అవసరముందని మంత్రి పేర్కొన్నారు. పరిశోధనలకు ఊత మిచ్చేలా దేశంలోనే తొలిసారిగా ఏఐ ఆధారిత డేటా ఎక్స్ ఛేంజ్‌ను ప్రారంభించామన్నారు. లైఫ్ సైన్సెస్‌లో నూతన ఆవిష్కరణలను ప్రోత్స హించేందుకు 'వన్ బయో' పేరిట ప్రత్యేక వ్యవస్థను అందుబాటులోకి తెచ్చామన్నారు. స్టార్టప్స్‌కు అండగా నిలిచేందుకు 'ఫండ్స్ ఆఫ్ ఫండ్స్'ను ఏర్పాటు చేశామని మంత్రి శ్రీధర్ బాబు వివరించారు. హైదరాబాద్ వేదికగా గ్లోబల్ హెల్త్ టెక్ విప్లవంలో భాగస్వామ్యం కావాలని నిపుణులు, ఆవిష్కర్తలు, కంపెనీలు, స్టార్టప్స్‌ను సాదరంగా ఆహ్వానించారు.

# దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యం

- రెండున్నర ఏండ్లలో రూ. 2216 కోట్లు
- రూ. 802 కోట్లతో బాసర టు భద్రాచలం

### ఆధ్యాత్మిక కారిడార్



మంచిర్యాల (మెట్రో న్యూస్):ఆధ్యాత్మికతతో పాటు విద్య, వైద్య రంగాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. మంచిర్యాల నియోజకవర్గ పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గూడెంగుట్ట శ్రీ సత్యనారాయణ స్వామి దేవాలయ అభివృద్ధి పనులకు శనివారం ఆయన భూమిపూజ చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యేలు ప్రేమ్‌సాగర్ రావు, రాజ్ ఠాకూర్, గండ్ర సత్యనారాయణ రావు, ఎంపీ గడ్డం వంశీ కృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. దాదాపు రూ. 70 కోట్ల భారీ నిధులతో గూడెంగుట్ట సత్యనారాయణ స్వామి ఆలయాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయబోతున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. ఈ రెండున్నర ఏళ్ల కాలంలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ. 2,216 కోట్లు మంజూరు చేసిందని ఆయన ప్రకటించారు. రాబోయే గోదావరి పుష్కరాలను పురస్కరించుకుని భక్తులకు అవసరమైన వసతులు, ఘాట్ల నిర్మాణం కోసం ప్రభుత్వం మరో రూ. 1,000 కోట్లను మంజూరు చేసిందన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు ఉన్న పుణ్యక్షేత్రాల అభివృద్ధి, సుందరీకరణ కోసం రూ. 802 కోట్లు కేటాయించి పనులను ముందుకు తీసుకెళ్తున్నట్లు చెప్పారు.

# బీఆర్ఎస్ నేతల పాదయాత్రలు వృధా
### - ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



హైదరాబాద్ (మెట్రో న్యూస్ ): బస్సు యాత్ర, పాదయాత్ర అని బీఆర్ఎస్ పార్టీ నాయకులు తిరగడం వృధా ప్రయాస అని తెలిపారు. క్యాడర్‌ను కాపాడుకోవడానికి వారు ప్రయత్నాలు చేస్తున్నారని తెలిపారు. శనివారం సీఎల్పి లో మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ బస్సు యాత్ర చేసినా, కేటీఆర్ పాదయాత్ర , హరీష్ రావు మోకాళ్ల యాత్ర చేసినా ఉపయోగం లేద న్నారు. అధికారం ఉన్నప్పుడు ప్రగతి భవన్ దాటలేదని ఫామ్ హౌస్ ను వదిలిపెట్టలేదని ఆయన తెలిపారు. అధికారం పోయాక బస్సు యాత్ర చేస్తే కేసీఆర్ ను ఎవరు నమ్ముతారన్నారు. అధికారంలో ఉన్నప్పుడు బస్సు యాత్ర తో జిల్లాల పర్యటనలు చేస్తానని కేసీఆర్ అనేక సార్లు గప్పాలు కొట్టాడు.. ఏ ఒక్క రోజు ప్రజలను కలిసింది లేదు.. పార్లమెంట్ ఎన్నికలు,ఉప ఎన్నికలు,పంచాయతీ ఎన్నికల్లో మీ పార్టీ పరిస్థితి ఏంటో తెలిసిందన్నారు. పార్టీ గుర్తు పైన ఎన్నికలు పెట్టండి చూపిస్తాం అని బీఆర్ ఎస్ అంటే మునిసిపల్ ఎన్నికల్లో 90 శాతం గెలిచి చేయి గుర్తు దెబ్బ చూపించామని ఆది శ్రీనివాస్ తెలిపారు. భవిష్యత్తులో బీ ఆర్ ఎస్ పార్టీకి పోటీ చేయడానికి అభ్యర్థులు ఉండరన్నారు వంద స్థానాల్లో డిపాజిట్ రాని బీజేపీ కి తమతో పోటీ ఉంటుందని కేటీఆర్ అంటున్నాడని ఏద్దేవా చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కుమ్మక్కు రాజకీయాలు అర్థమౌతున్నాయని తెలిపారు. కట్టకట్టుకుని వచ్చినా, విడివిడిగా వచ్చినా మిమ్మల్ని ఈ తెలంగాణ నుంచి ప్రజలు పారదోలడం ఖాయమన్నారు. మరో సారి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రజలు పట్టం కట్టడం ఖాయమన్నారు. ఫ్యూచర్ సిటీని చూసి కేటీఆర్ గుండెల్లో దడ పుడుతోందన్నారు.

# పాస్‌పోర్ట్ సేవల్లో పోలీసులకు జాతీయ స్థాయి గుర్తింపు
### - 19న అవార్డ్‌ను అందుకోనున్న డీజీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ (మెట్రో న్యూస్ ): పాస్‌పోర్ట్ దరఖాస్తుల పరిశీలన, పోలీసు ధృవీకరణ ప్రక్రియలో అత్యుత్తమ పనితీరు కనబరిచినందుకు తెలంగాణ పోలీస్ శాఖకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ జాతీయ స్థాయిలో ప్రతిష్ఠాత్మక గుర్తింపు లభించింది. 2025-26 సంవత్సరంలో పాస్‌పోర్ట్ దరఖాస్తుల ధృవీకరణలో విశిష్ట సేవలు అందించిన రాష్ట్ర పోలీసు సంస్థగా తెలంగాణ పోలీస్ శాఖను ఎంపిక చేస్తూ ఇన్‌స్టిట్యూషనల్ పెర్ఫార్మెన్స్ అవార్డు అవార్డును ప్రకటించింది. ఈ మేరకు విదేశాంగ మంత్రిత్వ శాఖలో జాయింట్ సెక్రటరీ,చీఫ్ పాస్‌పోర్ట్ ఆఫీసర్ బి.ఎస్. ముబారక్ రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, కు అధికారిక లేఖ పంపారు. ప్రతి సంవత్సరం జూన్ నెలలో నిర్వహించే పాస్ పోర్ట్ సేవ సందర్భంగా ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నారు. ఈ ఏడాది పాస్‌పోర్ట్ సేవా దివస్ మరియు పాస్‌పోర్ట్ అధికారుల సదస్సు జూన్ 18, 19 తేదీల్లో న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ భవన్‌లో నిర్వహించనున్నారు. న్యూ ఢిల్లీ లో జూన్ 19న జరిగే కార్యక్రమంలో కేంద్ర విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్. జైశంకర్ చేతుల మీదుగా డిజిపి సి వి ఆనంద్ ఈ ప్రతిష్ఠాత్మక అవార్డు అందుకోనున్నారు. పాస్‌పోర్ట్ జారీ ప్రక్రియలో పోలీసు ధృవీకరణ అత్యంత కీలకమైన అంశమని, ఈ విభాగంలో తెలంగాణ పోలీసులు వేగవంతమైన, పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడం వల్లే ఈ గుర్తింపు దక్కిందని డిజిపి పేర్కొన్నారు. అలాగే పాస్‌పోర్ట్ సేవా దివస్‌లో భాగంగా నిర్వహించే హై-లెవల్ సెగ్మెంట్ కార్యక్రమానికి డీజీపీ సి.వి. ఆనంద్‌ను విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రత్యేకంగా ఆహ్వానించింది. ఆయన హాజరు కార్యక్రమ విజయానికి దోహదపడుతుందని పేర్కొంది. రాష్ట్ర పోలీసు శాఖ చేపట్టిన సాంకేతిక ఆధారిత పోలీసు ధృవీకరణ విధానం, వేగవంతమైన సేవలందింపు, ప్రజా కేంద్రిత దృక్పథం వల్లే ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించిందని డిజిపి తెలిపారు. ఈ అవార్డు తెలంగాణ పోలీసుల సేవా నిబద్ధతకు, వృత్తిపరమైన నైపుణ్యానికి మరో నిదర్శ నంగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ పురస్కారం ద్వారా దేశవ్యాప్తంగా తెలంగాణ పోలీస్ శాఖ ప్రతిష్ఠ మరింత పెరిగిందని, భవిష్యత్తులో కూడా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు ఇది ప్రేరణగా నిలుస్తుందని అధికారులు అభిప్రాయపడ్డారు.



# ఘనంగా స్టేట్ సిట్రస్ సెమినార్ నిర్వహణ




నల్గొండ (మెట్రో న్యూస్): నల్గొండలోని గుత్త సుఖేందర్ రెడ్డి ఆడిటోరియంలో స్టేట్ సిట్రస్ సెమినార్ 2026ను కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రాష్ట్రంలో బత్తాయి, నిమ్మ మరియు ఇతర సిట్రస్ పంటల సాగు అభివృద్ధి, రైతుల ఆదాయ పెంపు, మార్కెటింగ్ సదుపాయాలు, ఎగుమతి అవకాశాలు మరియు ఆధునిక సాగు విధానాలపై ఈ సెమినార్‌లో విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర రోడ్లు, భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ,రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి కమిషన్ సభ్యులు శ్రీమతి మరికంటి భవానీ రెడ్డి , రామిరెడ్డి గోపాల్ రెడ్డి ,చెవిటి వెంకన్న యాదవ్ విజయ డైరీ చైర్మన్ గుత్త అమిత్ రెడ్డి హార్టికల్చర్ డైరెక్టర్ శ్రీమతి షేక్ యష్మిన్ భాష హార్టికల్చర్ వైస్ చైర్మన్ రాజిరెడ్డి జాయింట్ డైరెక్టర్ బాబు , హార్టికల్చర్ శాఖ అధికారులు, శాస్త్రవేత్తలు మరియు పెద్ద సంఖ్యలో బత్తాయి సాగు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ, నల్గొండ జిల్లా బత్తాయి సాగుకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు ఉందని, సిట్రస్ రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరి ష్కారానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటోందన్నారు. రైతులకు నాణ్యమైన మొక్కలు, శాస్త్రీయ సాగు పద్ధతులు, మార్కెటింగ్ సౌక ర్యాలు మరియు నిల్వ సదుపాయాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమి షన్ చైర్మన్ కోదండ రెడ్డి మాట్లాడుతూ, సిట్రస్ పంటల సాగులో నాణ్యత పెంపు, దిగుబడుల వృద్ధి మరియు రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా కమిషన్ ప్రత్యేకంగా అధ్యయనం చేస్తోం దన్నారు. బత్తాయి రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కమిషన్ సభ్యురాలు శ్రీమతి మరికంటి భవానీ రెడ్డి మాట్లాడుతూ, సిట్రస్ రైతులు ఎదుర్కొంటున్న వ్యాధులు, మార్కెటింగ్ సమస్యలు, ఉత్పత్తి వ్యయాల పెరుగుదల వంటి అంశాలపై సమగ్ర కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. రైతులకు శిక్షణ, అవగాహన కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని సూ చించారు. హార్టికల్చర్ శాఖ అధికారులు సిట్రస్ పంటలలో ఆధునిక సాగు విధానాలు, నీటి యాజమాన్యం, సమగ్ర పురుగుల నివారణ, పంటల నాణ్యత ప్రమాణాలు మరియు ఎగుమతి అవకాశాలపై రైతులకు సాంకేతిక సూచనలు అందించారు. సెమినార్‌లో పాల్గొన్న రైతులు తమ సమస్యలు, సూచనలు మరియు అభిప్రాయాలను ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని సిట్రస్ రంగ అభివృద్ధికి తగిన చర్యలు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ కార్యక్రమం సిట్రస్ పంటల అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి మరియు వ్యవసాయ రంగంలో నూతన అవకాశాలపై అవగాహన కల్పించడంలో ఉపయోగకరంగా నిలిచింది.

# నాడు విధ్వంసం.. నేడు వికాసం
### ఏపీ టీడీపీ అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్




హైదరాబాద్ (మెట్రో న్యూస్): వైఎస్‌జగన్ హయాంలో ఆంధ్రప్రదేశ్ లో పాలన అరాచకం తో పాటు విధ్వంసంలో సాగగా నేడు కూటమి ప్రభుత్వంలో పాలన వికాసంతో పాటు ప్రగతి పథంలో నడుస్తుందని ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి అప్పసాని రాజేష్ పేర్కొన్నారు. శనివారం ఎన్‌ఆర్ ట్రస్ట్ భవన్లో ఆయన మీడియా తో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లోని కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన లో రాష్ట్రంతో పాటు అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో ఓర్వలేని వైఎస్ఆర్ పార్టీ నాయకులు చిల్లర రాజకీయాలు చేస్తున్నారని తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ వైఫల్యాలు,కూటమి ప్రభుత్వ విజయాలపై ఆయన కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్రం ప్రగతి పథంలో దూసుకుపోతోందని పేర్కొన్నారు. అదే సమయంలో గత జగన్ మోహన్ రెడ్డి హయాంలో రాష్ట్రం అరాచకానికి, ఆర్థిక విధ్వంసానికి కేరాఫ్ అడ్రస్‌గా మారిందని తీవ్రంగా విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి కేవలం రాజకీయ పంతాల కోసమే చూస్తున్నారని, రాయలసీమకు కానీ, రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు కానీ ఆయన చేసిందేమీ లేదని విమర్శించారు. అమరావతి రైతుల ఉద్యమం, రాజధాని విషయంలో గత ప్రభుత్వం చేసిన తప్పులను ఎండగట్టారు మంత్రి నారా లోకేష్ పనితీరును ప్రశంసిస్తూ, యువతకు ఉపాధి కల్పనలో లోకేష్ విజన్‌కు. గత ముఖ్యమంత్రి జగన్ హయాంలోని నిరుద్యోగానికి ఉన్న వ్యత్యాసాన్ని ఆయన వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అందిస్తున్న సహకారాన్ని, కూటమి ప్రభుత్వంతో ఉన్న సమన్వయాన్ని ఆయన వెల్లడించారు. చంద్రబాబు నాయకత్వంలో ఎన్‌డిఏ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తయిందని రెండేళ్ల నమ్మకం, అభివృద్ధి, సంక్షేమం పేరిట శుక్రవారం తిరుపతిలో ఎన్‌డిఏకూటమి భారీ బహిరంగసభను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు ఇచ్చిన హామీలను నెరవేర్చి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం ఏపీలో ముందుకు సాగుతుంటే... రెండు సంవత్సరాల క్రితం ప్రజల ఆగ్రహం చేత ఎన్నికలలో ఘోరంగా ఓడిపోయిన వైసీపీ పార్టీ వెన్నుపోటు పేరుతో నిరసనలు చేపట్టడం విడ్డూరంగా ఉందన్నారు . వ్యక్తిగత ఆస్తులకు కూ డా జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో భద్రత లేకుండా చేశారని జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఒక్క క్షణం కూడా కొనసాగించకూడదని అన్ని వర్గాల ప్రజలు, అన్ని ప్రాంతాల ప్రజలు ఏకోన్ముఖంగా నిర్ణయించుకుని 2024 ఎన్నికలలో ఓడించారని తెలిపారు. అసలు సిసలు వెన్నుపో టుదారుడు జగన్‌మోహన్ రెడ్డి అని..ప్రజలకు స్పష్టత వచ్చిన తరువాత ఉత్తరాంధ్రతోపాటు అన్ని ప్రాంతాలలో ప్రజలు వైసీపీని తుడిచి పెట్టేశారని జగన్‌మోహన్‌రెడ్డి, వైసీపీ నాయకులు గుర్తిస్తే మంచిదని ఏపీ తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధిఅప్పసానిరాజేష్ సూచించారు.

మెట్రో 3
హైదరాబాద్,
ఆదివారం,
జూన్ 14, 2026

# టార్గెట్ కిషన్ జీ
# ఎందుకు?



## నిన్న కేసీఆర్ నేడు రేవంత్

హైదరాబాద్ (మెట్రో న్యూస్): వివాదాలకు దూరంగా సౌమ్యుడిగా పేరున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి నితెలంగాణ రాజకీయాల్లో విచిత్ర పరిస్థితి ని ఎదురుకుంటున్నారు. ఉరిమి ఉరిమి మంగళం మీద పడ్డట్టు ప్రభుత్వ అధినేతలకు ఆయనే టార్గెట్ అవుతున్నారు నాడు అధికారంలో ఉన్న కెసిఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రధాన ప్రత్యర్థిగా కిషన్ రెడ్డి మారారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన పదేళ్ల తరువాత కూడా అదే స్థాయిలో అధికార పార్టీ విమర్శలకు కేంద్ర బిందువుగా కూడా ఆయనే మారుతున్నారు. బీఆర్ఎస్ హయాంలో తెలంగాణలో బీజేపీ బలపడకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా కేసీఆర్ తరచూ బీజేపీపై, ముఖ్యంగా కిషన్ రెడ్డిపై విమర్శలు గుప్పించేవారు. రా(ష్టానికి కేంద్రం అన్యాయం చేస్తోందని, బీజేపీ నేతలు తెలంగాణ ప్రయోజనాలను కాపాడలేకపోతున్నారని బీఆర్ఎస్ తీవ్ర ఆరోపణలు చేసింది. ముఖ్యమంత్రి స్థాయి మర్చి కెసిఆర్ కిషన్ రెడ్డి పై అసంబంధ మాట వాడారు. ఆ సమయంలో రాష్ట్రంలో బీజేపీకి పెద్ద దిక్కుగా ఉన్న కిషన్ రెడ్డి ఆ విమర్శలన్నింటినీ ఎదుర్కొన్నారు. ప్రభుత్వం మారింది కదా ఆయన పై విమర్శలు, తగ్గుతాయానకుంటే అంతకు మించి ఆయన పై సీఎం రేవంత్ రెడ్డి తో పాటు కాంగ్రెస్ నాయకులు దుమ్మెత్తి పోస్తున్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా రాజకీయంగా బీజేపీని టార్గెట్ చేస్తూ, ముఖ్యంగా కిషన్ రెడ్డిపైనే విమర్శల దాడి కొనసాగిస్తోంది. కేంద్ర నిధులు, రాష్ట్ర అభివృద్ధి, హామీల అమలు వంటి అంశాలపై కాంగ్రెస్ నేతలు తరచూ కిషన్ రెడ్డిని ప్రశ్నిస్తున్నారు. తెలంగాణలో బీజేపీలో నాయకుడిగా ఆయన ఒక్కడే ఎదగడం వల్ల అధికారంలో ఉన్న ఏ పార్టీ అయినా ఆయనను ప్రధాన రాజకీయ ప్రత్యర్థిగా చూసి విమర్శలు చేస్తోంది. రాష్ట్రంలో బీజేపీ విస్తరణకు ఆయన చేసిన కృషి అంతగా లేదనే అభిప్రాయాలు పార్టీ నాయకులు, కార్యకర్తలు వ్యక్తం చేస్తున్నప్పటికి కేంద్ర పార్టీ పెద్దల దృష్టిలో ఆయన కీలక నేత, నగరంలో బలమైన విస్తరణ పార్టీకి ఉన్నప్పటికీ ప్రతి ఎన్నికల్లో ఆయన ఒక్కడే పార్టీ తరపున గెలువడం మిగతా చోట్ల పోటీలో ఉన్న బీజేపీ అభ్యర్థులకు కనీసం డిపాజిట్‌లు కూడా రాని పరిస్థితి ఉంది. అయినప్పటికీ అధికార పార్టీలు ఆయనను ప్రధాన లక్ష్యంగా చేసుకుంటున్నాయి. మొత్తంగా చూస్తే, నాడు కేసీఆర్ ప్రభుత్వానికి రాజకీయ టార్గెట్‌గా నిలిచిన కిషన్ రెడ్డి.. నేడు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికీ ప్రధాన ప్రత్యర్థిగానే మారారు.మంత్రులతో పాటు టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ కి చెందిన వివిధ స్థాయి నాయకులు స్థాయి మర్చి హద్దు,అదుపు లేకుండా ఆయన పై విమర్శలు చేస్తున్నారు. పంట కొనుగోలు తో పాటు తెలంగాణలో చేపట్టబోయే పలు అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అడ్డు పడుతున్నాడనే ఆరోపణలు కాంగ్రెస్ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. తుమ్మిడి హాట్టి వద్ద బ్యారేజి నిర్మాణం కోసం మహారాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తే అక్కడి సీఎం ఫడ్నవీస్ కు ఈ విషయం లో తెలంగాణ ప్రభుత్వానికి సహకారం అందించోద్దని చెప్పాడని సీఎం రేవంత్ రెడ్డి కిషన్ రెడ్డి పై బహిరంగ ఆరోపణలు చేశారు.లో ప్రస్తుతం అతి పెద్ద సమస్య గా మారిన పంట కొనుగోలు అంశం తో పాటు, రాష్ట్ర అభివృద్ధి కి సంబందించిన వాటి పై కిషన్ రెడ్డి విమర్శలను ఎదురుకుంటున్నారు. మూసి పునర్జీవం, హైడ్రా కూల్చి వేతలపై కిషన్ రెడ్డి గట్టిగా అడ్డుకునేలా ఆరోపణలు చేస్తున్నారు.కేటీ ఆర్ చెప్పినట్టుగానే కిషన్ రెడ్డి చేస్తున్నాడని ఆరోపించారు. కే టీఆర్, కిషన్ రెడ్డి లది విడదీయరాని చీకటి బంధమని కూడా సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ కు కిషన్ రెడ్డి అభివృద్ధి నిరోధకుడిగా మారాడని విమర్శలు చేస్తున్నారు. కెసిఆర్ వాడిన అసంబద్ధ మాటగా కాక రౌడీ అనే పదాన్ని రేవంత్ రెడ్డి ఉపయోగించాడు, పైగా కిషన్ రెడ్డి కి 15తరువాత తానేంటో చూపిస్తానని హెడ్ లైన్ విధించారు.

## ఇంటి తాళాలు పగులగొట్టి అర్ధరాత్రి అభిషేక్ బెనర్జి ఇంట్లో తనిఖీలు

ఇంటర్నెట్ డెస్క్: : టీఎంసీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మమతా బెనర్జీ (ట్ఖిఎ్ఖ ద్ఖిఅవతీయవవ) మేనల్లుడు అభిషేక్ బెనర్జీ నివాసంలో శుక్రవారం రాత్రి పోలీసులు తనిఖీలు చేపట్టారు. భూ కుంభకోణానికి సంబంధించిన కేసులో దర్యాప్తు నిమిత్తం కాళీఘాట్‌లోని ఆయన నివాసానికి వెళ్లిన పోలీసులు, కేంద్ర భద్రతా బలగాలు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించినట్లు పార్టీ వర్గాలు ఆరోపించాయి. ఈ తనిఖీల గురించి తెలుసుకున్న పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ హుటాహుటిన అభిషేక్ నివాసానికి చేరుకున్నారు.సల్బొని ప్రాంతంలోని ఓ భూమికి సంబంధించిన కేసులో నిందితుడిగా ఉన్న అభిషేక్ బెనర్జీ అనుచరుడి కోసం తాము గాలిస్తున్నట్లు దర్యాప్తు అధికారులు పేర్కొన్నారు.

## రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో



## రాకపోకలకు అంతరాయం

హైదరాబాద్ (మెట్రోన్యూస్): భారీ వర్షాల కారణంగా శంషాబాద్ ఎయిర్పోర్టులో విమానాల రాకపోకలకు అంతరాయమేర్పడింది. ప్రతికూల వాతావరణం కారణంగా అధికారులు పలు విమానాలను దారి మళ్లించారు. ముంబయి, ఢిల్లీ, వారణాసి, బెంగళూరు, సింగపూర్ నుంచి వచ్చే విమానాలపై ప్రభావం పడింది. శంషాబాద్ విమానాశ్రయంలో ల్యాండింగ్కు పరిస్థితులు అనుకూలంగా లేవని అధికారులు చెబుతున్నారు. దీంతో కొన్ని విమానాలకు తాత్కాలికంగా అనుమతి నిరాకరించారు. విమానాల మళ్లింపుతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు.

## బాలిస్టిక్ క్షిపణి దాడులకు భారత్ చెక్
# డీఆర్డీఓ పరీక్ష సక్సెస్



ఢిల్లీ (మెట్రోన్యూస్): భారత రక్షణ పరిశోధనా అభివృద్ధి సంస్థ కీలక పరీక్షలు చేపట్టింది. అత్యాధునిక డిఫెన్స్ సిస్టమ్‌ను పరీక్షించింది. బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కొనే రక్షణ వ్యవస్థలతో పాటు యాంటీ షిప్ మిస్సైళ్లను ఎదుర్కొనే టెక్నాలజీని పరీక్షించినట్లు ఇవాళ డీఆర్డీవో వెల్లడించింది. ఈ ట్రయల్ పరీక్షలు జూన్ 10,11వ తేదీల్లో నిర్వహించారు.



# అస్సాంలో కుప్పకూలిన
## ఏఎన్-32 విమానం:ఐదుగురి మృతి

ఇంటర్నెట్ డెస్క్: అసోంలోని జోర్హాట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో శనివారం భారత వాయుసేనకు చెందిన ఏఎన్-32 రవాణా విమానం ప్రమాదానికి గురైంది. ల్యాండింగ్ కోసం ప్రయత్నిస్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రమాదం జరిగిన వెంటనే సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. వాయుసేనకు చెందిన ఈ కార్గో విమానం జోర్హాట్‌లోని వ్యూహాత్మక ప్రాధాన్యం కలిగిన రౌరియా ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ పరిధిలోనే కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదంలో పైలట్ మృతి చెందినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై అధికారిక నిర్ధారణ ఇంకా వెలువడలేదు. విమానంలో మొత్తం ఎంతమంది సిబ్బంది ఉన్నారన్న వివరాలు కూడా తెలియరాలేదు.

ఈ ఘటనపై భారత వాయుసేన స్పందించింది. సరుకుల రవాణాకు ఉపయోగించే ఏఎన్-32 విమానం ల్యాండింగ్ సమయంలో ప్రమాదానికి గురైందని వెల్లడించింది. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ప్రమాదానికి గల కారణాలను గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించినట్లు తెలిపింది. ఈశాన్య భారత్‌లో కీలక వాయుసేన స్థావరంగా ఉన్న జోర్హాట్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్ ప్రాంతీయ వైమానిక కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తోంది.

## కర్రెగుట్టలో నాడు తుపాకుల మోత నేడు అభివృద్ధి బాట

### మావోయిస్టుల కంచుకోట నుండి టూరిస్ట్ హబ్‌గా కర్రెగుట్ట!



హైదరాబాద్ (మెట్రోన్యూస్): తుపాకీ తూటాలు, బాంబు పేలుళ్లతో దద్దరిల్లిన కర్రెగుట్టల దండకారణ్యంలో నేడు ప్రశాంత వాతావరణం సంతరించుకుంది. గతేడాది వరకు మావోయిస్టుల కంచుకోట అయిన అడవులు, కొండలు, లోయలు నేడు పర్యటక ప్రాంతాలుగా మారే దిశగా అడుగులు పడుతున్నాయి. కర్రెగుట్టల్లో రూ.40 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఈ పనులు చురుగ్గా సాగుతున్నాయి.

## వారం రోజుల విదేశీ పర్యటనకు బయల్దేరిన ప్రధాని

ఇంటర్నెట్ డెస్క్: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. ఫ్రాన్స్, స్లోవేకియాల వారం రోజుల పర్యటనకు శనివారం బయలు దేరారు. అక్కడ ఆయన జీ7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడం సహా పలువురు ప్రపంచ నాయకులతో ద్వైపాక్షిక సమావేశాలూ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. భారతదేశ వ్యూహాత్మక దార్శనికతలో ఫ్రాన్స్‌ను ఓ కీలక భాగస్వామిగా అభివర్ణించారు. ఈ ఏడాది ఆరంభంలో ఇరు దేశాల మధ్య సంబంధాలను ప్రత్యేక ప్రపంచ వ్యూహాత్మక భాగస్వామ్యంగా ఉన్నతీకరించినప్పటి నుంచి సాధించిన పురోగతిని సమీక్షించడంపై.. తాను ఇమ్మానుయేల్ మెక్రాన్‌తో సమావేశం కానున్నట్టు తెలిపారు.

# షబ్బీర్ అలీకి ఏఐసీసీ షోకాజ్ నోటీసులు?



హైదరాబాద్ (మెట్రోన్యూస్): కాంగ్రెస్ పార్టీలో అంతర్గత వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత షబ్బీర్ అలీపై ఏఐసీసీ సీరియస్‌గా స్పందించింది. మహిళలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసినట్లు ఆయనపై ఆరోపణలు వచ్చిన ఆడియో క్లిప్ వైరల్ కావడంతో పార్టీ హై కమాండ్ చర్యలకు దిగింది.ఈ వైరల్ అయిన ఆడియోలో షబ్బీర్ అలీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చీఫ్ బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు మహిళలపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ ఆడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో కాంగ్రెస్ పెద్దలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ క్రమశిక్షణ కమిటీ షబ్బీర్ అలీకి షోకాజ్ నోటీసులు జారీ చేసింది. పార్టీ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంపై వివరణ ఇవ్వాలని హుకుం జారీ చేసింది. పార్టీ అంతర్గత వ్యవహారాలను పబ్లిక్‌లో చర్చకు తీసుకురావడంపై కూడా ఏఐసీసీ అసంతృప్తి వ్యక్తం చేసింది.

### కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గపోరు..

మరోవైపు.. కామారెడ్డి కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదురుతున్నట్లు తెలుస్తోంది. షబ్బీర్ అలీ వర్గం, చంద్రశేఖర్ రెడ్డి వర్గం మధ్య విభేదాలు తీవ్రస్థాయికి చేరుకున్నాయి. అదే సమయంలో సొంత పార్టీ నేతలపై విమర్శలు, దుష్ప్రచారం జరుగుతోందని ఆరోపిస్తూ మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తనపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు.

ఈ పరిణామాలతో కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. పార్టీ క్రమశిక్షణ చర్యలు, వర్గపోరు, పరస్పర ఆరోపణలతో స్థానిక కాంగ్రెస్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.



# తిరుమల గిరులు కిటకిట
## దర్శనానికి 24 గంటలు

తిరుమల(మెట్రోన్యూస్) : వేసవి సెలవులు ముగిస్తుండటంతో శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. తిరుమల గిరులన్నీ భక్తులతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠ క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి షెడ్లు పూర్తిగా భక్తులతో నిండాయి. స్వామివారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. ప్రస్తుతం సర్వదర్శన భక్తులను బాట గంగమ్మ ఆలయం నుంచి సర్వదర్శన క్యూలైన్లోకి అనుమతిస్తున్నారు. కూలైన్లలో భక్తులకు అల్పాహారం, తాగు నీరు, పాలు వంటివి శ్రీవారి సేవకుల ద్వారా అధికారులు అందజేస్తున్నారు. సీఆర్వో వద్ద వసతి గదుల కోసం, కళ్యాణకట్ట కేంద్రాల వద్ద భక్తులు బారులు తీరారు.

కృషితోనాస్తి దుర్భిక్షం

మెట్రో ఈవినింగ్

4, హైదరాబాద్ ఆదివారం జూన్ 14, 2026

# కొత్త ఫార్ములాతో డీలిమిటేషన్... తెలుగు రాష్ట్రాల్లో పెరిగే సీట్లు ?

వచ్చే ఎన్నికల్లో డీలిమిటేషన్ చేసిన పార్లమెంట్ నియోజకవర్గాల తోనే ముందుకు సాగాలని కేంద్రంలో బీజేపీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం గట్టిగా నిర్ణయించుకుంది. దాని కోసం మరోసారి ప్రయత్నం చేస్తోంది. ఏప్రిల్ 16న పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలను నిర్వహించి మరీ డీలిమిటేషన్ బిల్లుని నెగ్గించుకోవడానికి బీజేపీ చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయి. అంతే కాదు ఏకంగా 54 ఓట్ల తేడాతో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బిల్లు అయితే వీగిపోయింది. అయినా పట్టువదలని విక్రమార్కుడు మాదిరిగా బీజేపీ మరో ప్రయత్నం చేస్తోంది అని ప్రచారం హస్తిన వర్గాలలో జోరుగా సాగుతోంది. తాజా ప్రతిపాదనతో : ఇదిలా ఉంటే లోక్ సభ నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించి తాజాగా మరో ప్రతిపాదన కేంద్రం పరిశీలిస్తోంది అని అంటున్నారు. ఈ ప్రతిపాదన ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి చేసినట్లుగా తెలుస్తోంది. దీని వివరాలు ప్రచారం కావడంతో మీద దేశ వ్యాప్తంగా కొత్త మొదలైంది. ఈ తాజా ప్రతిపాదనలు చూస్తే కనుక లోక్ సభ నియోజకవర్గాలను ప్రస్తుతం ఉన్న 543 నుంచి 824కి పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సూచించినట్లుగా చెబుతున్నారు. అంటే గుత్తమొత్తంగా ప్రతీ రాష్ట్రంలో మొత్తం ఉన్న సీట్లలో మరో యాభై శాతం పెంచే బదులుగా మరో కొత్త ఫార్ములాతో ఈ మండలి ప్రతిపాదనలు ఉండడం ఆసక్తిని పెంచుతోంద్. మూడవ వంతు మాత్రమే : ఇక ఈ కొత్త ప్రతిపాదన ప్రకారం మూడవ వంతు పార్లమెంట్ సీట్లను మాత్రమే పెంచాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సిఫార్సు చేసినట్లుగా తెలుస్తోంది. అంటే 170 పార్లమెంట్ నియోజకవర్గాలలోనే పునర్ విభజన ఉంటుంది అన్న మాట. మరి ఈ లెక్క ఏమిటి అంటే ఈ సీట్లలోనే అధిక జనాభా ఉంది. అంతే కాదు ఇవి పెద్ద నియోజకవర్గాలుగా కూడా ఉన్నాయని మండలి గుర్తించింది అని చెబుతున్నారు. ఇక ఇందులో కూడా ఒక 59 పార్లమెంట్

## //ఎడిటోరియల్//

నియోజకవర్గాలను రెండుగా విభజించాలని మరో 111 సీట్లను మూడుగా చేయాలని కూడా మండలి సూచించింది అని అంటున్నారు. ఇక ఈ నియోజకవర్గాల పునర్విభజనను చేసేటపుడు గత ఎన్నికలలో అక్కడ నమోదు అయిన ఓటింగ్ శాతం, అలాగే అక్కడ షెడ్యూల్డ్ కులాలు యు షెడ్యూల్డ్ తెగల జనాభా, మహిళా జనాభా వంటి ఇతర కీలకమైన అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సూచించినట్లుగా చెబుతున్నారు. ఇక ఈ కొత్త ఫార్ములా ప్రకారం ఏపీలో మొత్తం ఉన్న 25 ఎంపీ సీట్లలో విశాఖపట్నం, రాజంపేట, కడప, అనంతపురం, కర్నూలు నంద్యాల పార్లమెంటరీ నియోజకవర్గాలను ఒక్కొక్క దానినీ మూడు నియోజకవర్గాలుగా విభజించాలని సిఫార్సు చేసినట్లుగా చెబుతున్నారు. అలాగే మచిలీపట్నాన్ని రెండుగా విభజించాలని కూడా మండలి ప్రతిపాదించింది అంటున్నారు. తెలంగాణాలో సైతం : అదే విధంగా తెలంగాణ రాష్ట్రంలో చూస్తే కనుక హైదరాబాద్, సికింద్రాబాద్, మల్కాజిగిరి మెదక్ పార్లమెంట్ నియోజకవర్గాలను మూడు భాగాలుగా విభజించాలని చూస్తున్నారు. అదే విధంగా చెవెళ్ళను రెండు నియోజకవర్గాలుగా విభజించాలని ప్రతిపాదించారు. ఇలా కొత్త ఫార్ములా ప్రకారం 170 లోక్ సభ సీట్లలోనే విభజన జరిగి సీట్లు అదనంగా పెరిగింతే కనుక జాతీయ స్థాయిలో ఓటింగ్ శాతం 2.32 కి కొత్తగా పెరుగుతుందని అంటున్నారు. అలాగే అదనంగా 22.3 మిలియన్ల ఓట్లు కూడా లభించే అవకాశం ఉందని లెక్క వేస్తున్నారు. ఇక ఏపీలో ఓటింగ్ శాతం 3.52 శాతానికి తెలంగాణలో 6.55 శాతానికి పెరగవచ్చని కూడా చెబుతున్నారు. ఏపీలో ఎన్ని సీట్లు : ఇక ఈ ఫార్ములా ప్రకారం కనుక సీట్లు పెరిగితే ఏపీలో ప్రస్తుతం ఉనన్ లోక్‌సభ స్థానాలు 25 నుండి 38 కి చేరుకుంటాయని అంటున్నారు. అలాగే తెలంగాణలో 17 నుండి 26 పెరుగుదల ఉంటుందని, కర్ణాటకలో 28 నుండి 42కి, తమిళనాడులో 39 నుండి 59కి కేరళలో 20 నుండి 30కి ఎంపీ సీట్లు పెరుగుతాయని అంటున్నారు దీని వల్ల దక్షిణాది రా(ష్టాలకు నష్టం ఉండదని కూడా అంటున్నారు.

## సహవాస దోషం

మెట్రో డైలీ

శవాన్ని తన భుజాన మోయడం..
ఓ పుణ్యకార్యం అంటున్న నరుడు
ప్రాణమున్న వ్యక్తికి చేయూత ఇవ్వడం
మహా పాపం అన్నట్లు ప్రవర్తిస్తాడు
మట్టిలో కలిసే మనిషి దోస్తూనే ఉంటాడు !
లేని దానికోసం దురాశ పడుతూ..
చేతులో ఉన్న దాన్ని చేజార్చుకోకు
ఉన్నదాంట్లో ఆనందం వెతకడం..
పేరాశతో దుఃఖాన్ని కొనితెచ్చు కోవడం..
జీవితాన్ని నరక సమానం చేస్తుంది !
మంచి బట్టలతో మంచి పేరు రాదు..
సత్కర్మలతోనే సమాజ గుర్తింపు
జీవన గమనాన్ని నిర్దేశించేవి కర్మలు
కర్మలను వదిలి పూజలు చేయకు..
అవినీతి సొమ్ముతో హూండీలు నింపకు !
నిజమైన ప్రేమను గెలవడానికి..
అవసరమైతే తల వంచ వచ్చు
వెన్నెల రేడు చంద్రుడి రాక కోసం..
సూర్యుడు తలవంచి అస్తమిస్తాడు !
వంశపారంపర్యంగా ఆస్తి వస్తుంది
సద్బుద్ధి మాత్రం కర్మ ఫలంగా వస్తుంది
ఖాళీ చేతులతో వచ్చిన మనిషి..
మానవీయ విలువలతో ఖ్యాతి ఆర్జిస్తాడు
విలువలు లేని వ్యక్తి ప్రాణమున్న శవమే !
కర్ణుడు దానగుణ సంపన్నుడే..
చెడు సహవాసమే విలన్ చేస్తుంది
విషం చుక్క కలిసిన పాలు..
ఎన్నటికీ అమృతాహారం కాలేవు
మనం ఏమిటో మన స్నేహం చెబుతుంది !

–మధుపాళీ, 9949700037

# రక్త దానంతో ప్రాణదానం : ఐక్యతతో జీవితాలకు సురక్ష



ప్రాణాలు కాపాడే గొప్ప పని రక్తదానం

## మెట్రో తెలంగాణ చావడి




కృత్రిమంగా ప్రయోగశాలలో యతయారు చేయలేని అమూల్య జీవన పదార్థం రక్తం. రక్తానికి ప్రత్యామ్నాయం లేదు. రక్త విధులకు సత్సమానం లేదు. అనుక్షణం జీవ కణజాలానికి అవసరమైన ఆక్సీజన్‌ను ఒసరఫరా చేస్తూ, వ్యర్థ పదార్థాలను విసర్జించే అమూల్య విధులను నిర్వహిస్తున్న రక్తం జీవితాలకే ఆధారం అవుతున్నది. ఒక వ్యక్తి ప్రమాదాలు, తీవ్ర వ్యాధులు, ప్రసవాలు, రక్తహీనత కలిగిన వ్యక్తులు, ఎముకల మజ్జ లోపాలు, శస్త్రచికిత్సలు, ఇతర అత్యవసర సందర్భాల్లో రక్తం అందించాల్సి వచ్చినపుడు ఏమీ ఆశించకుండా స్వచ్ఛందం రక్త దాతలు దేవుళ్ల రూపంలో కలిపిస్తారు. రక్తం దానం చేయడంతో ప్రాణాలు నిలబడతాయి, కుటుంబాలు నిలుస్తాయి. సమయానికి రోగికి సురక్షిత రక్త దాత భగవంతుడి ప్రతిరూపంగా దొరకడం ఓ అదృష్టం. రక్తం దొరక్క ప్రాణం పోవడం పౌర సమాజానికి అవమానకరం, ఆక్షేపణీయం. ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల రోగులు రక్త దాతల అమూల్య సేవలతో ప్రాణాలను నిలుపుకుంటున్నారు. నినిఐక్యతతో రక్తదానం – ప్రాణదాన నినాదం : ప్రాణ దాతలుగా విశేష కృషి చేస్తున్న స్వచ్ఛంద రక్త దాతలకు కృతజ్ఞతలు సమర్పించడం, నూతన రక్త దాతలను ప్రోత్సహించడం, రక్తదానం పట్ల అవగాహన కల్పించడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రతి ఏట 14 జూన్ రోజున ఐరాస – ప్రపంచ ఆరోగ్య సంస్థ – రెడ్ క్రాస్ సొసైటీల సమైక్య చొరవతో 2004 నుంచి ప్రపంచవ్యాప్తంగా "ప్రపంచ రక్త దాతల దినోత్సవం (వరల్డ్ బ్లడ్ డోనార్స్ డే)" నిర్వహించడం జరుగుతోంది. రక్త గ్రూపులు ఏ, బి, ఓ అను వర్గాలుగా ఉంటాయని కనుగొన్న నోబెల్ పురస్కార గ్రహీత "కార్ల్ ల్యాండ్‌స్టేయినర్" పుట్టిన రోజు 14 జూన్ రోజున ఈ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. 2026 ప్రపంచ రక్త దాతల దినం ఇతివృత్తంగా "ఒక బిందువు మానవత్వం : రక్త దానం చేద్దాం, ప్రాణాలు కాపాడుకుందాం" అనబడే అంశాన్ని తీసుకున్నారు. ప్రపంచ రక్తదాతల దినం వేదికగా రక్త దాన శిబిరాల నిర్వహణ, రక్త దాతల నిస్వార్థ సేవలను గుర్తించడం, విద్యాలయాల్లో సెమినార్లు లేదా కార్యశాలలు, అవగాహన ర్యాలీలు, సెలబ్రిటీలతో ప్రచారాలు, వీధి నాటికలు, ఫ్లాష్ మాబ్స్, సామాజిక మాధ్యమ ప్రచారాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రభుత్వాలు/ఎన్‌జీఓలు/పౌర సమాజం/ అంతర్జాతీయ సంస్థల సమ న్వయం లాంటి అంశాలను నిర్వహించాలి లేదా అవగాహన పరచాలి. నినిఎవరు, ఎప్పుడు రక్త దానం చేయవచ్చు : రక్తం, ప్లేట్‌లెట్స్ లాంటి ఇతర రక్త ఉత్పత్తుల దాతల కొరత భారత్‌ను పట్టి పీడిస్తున్నది. యువ జనాభా అధికంగా ఉన్న దేశంలో రక్త కొరత ఏర్పడడం సోచనీయం. 18 నుంచి 65 ఏండ్ల వయస్సు ఉన్న ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరు ఎప్పుడైనా రక్తదానం చేయవచ్చు. ప్రతి 3 నెలలకు ఒకసారి పురుషులు, ప్రతి నాలుగు నెలలకు ఒకసారి మహిళలు రక్తదానం చేయవచ్చు. రక్తదాత శరీర బరువు 45 కెజీలకు మించి ఉండాలి. రక్తంలో కనీస హిమోగ్లోబిన్ 12.5 గ్రా/డిఎల్ ఉండాలి. రక్తదానం వల్ల దాతకు పలు ప్రయోజనాలు కలుగుతాయి. దాత శరీరంలో రక్త రాళ్లు (బ్లడ్ స్టోన్స్) ఏర్పడకుండా అడ్డుకోవడం, దాత ఆరోగ్యానికి ఊతం లభించడం, దాత మానసిక సంతృప్తి పెరగడం, ప్రాణ దానం చేశాననే భావనతో సంతృప్తి లభించడం, గుండె ఆరోగ్యం మెరుగుపడడం, నూతన రక్త కణాలు ఉత్పత్తి కావడం లాంటి ప్రయోజనాలు రక్త దాతలకు కలుగుతాయి. నినియువభారతంలో రక్త దాతల కొరత : ప్రపంచవ్యాప్తంగా సాలీనా దాదాపు 120 మిలియన్ల రక్తదానాలు, భారత్‌లో 11.45 మిలియన్ల రక్త దానాలు జరుగుతున్నాయని తెలుస్తున్నది. భారత్‌లో 13 మిలియన్ల రక్త దానాల అవసరం ఉంది. అనగా, మన భారత్‌లో 12 లక్షల యూనిట్ల రక్త కొరత ఉన్నది. ప్రపంవ్యాప్తంగా 170 దేశాల్లో 12,700 బ్లడ్ బ్యాంకులు పని చేస్తున్నాయి. సాధారణంగా అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి 1000 మందిలో 33 రక్తదానం చేస్తుండగా, భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నలుగురు మాత్రమే రక్త దానానికి ముందుకు వస్తున్నారు. ప్రభుత్వాలు, బ్లడ్ బ్యాంకులు, ఆసుపత్రులు, స్వచ్ఛంద సేవకులు, ఉన్నత విద్యా సంస్థలు కలిసి ప్రపంచ రక్త దాతల దినోత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ అవగాహన కల్పించాలి. ఢిల్లీ లాంటి నగరాల్లో అవసరం కన్న అధికంగా రక్త దాతలు, బీహార్ లాంటి రా(ష్టాల్లో రక్తదాతల తీవ్ర కొరత కనిపిస్తున్నాయి.

డా: బుర్ర మధుసూదన్ రెడ్డి

## మెట్రో ఇలవేల్పు

# 84 వేల మంది ఋషులు తపస్సు చేసిన దేవభూమి ఇదే!



84 వేల మంది ఋషులు తపస్సు చేసిన తపోభూమి– అష్టాదశ పురాణాలు వెలుగులోకి వచ్చిన పుణ్యక్షేత్రంగా నైమిశారణ్యం ప్రసిద్ధి– ఉత్తరప్రదేశ్‌లో గోమతి నది తీరాన వెలసిన దివ్యక్షేత్రం– జీవితంలో ఒక్కసారైనా దర్శించాల్సిన పవిత్ర స్థలం హిందువుగా పుట్టిన ప్రతి ఒక్కరు జీవితంలో ఒక్కసారైనా దర్శించాలని ఎదురు చూసే పుణ్యక్షేత్రం నైమిశారణ్యం. ఎనభై నాలుగు వేలమంది ఋషులు తపస్సు చేసిన తపోభూమిగా, ముక్కోటి దేవతలు కొలువుదీరిన దేవభూమిగా నైమిశారణ్యం ప్రసిద్ధి చెందింది. అందమైన ప్రకృతి సౌందర్యాలు మధ్య, ప్రశాంతమైన వాతావరణంలో, ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఉండే ఆలయ సముదాయాలతో అలరారే పుణ్యక్షేత్రం నైమిశారణ్యం క్షేత్రం విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం.

పురాణాల పుట్టినిల్లు!

హిందూ సంప్రదాయం ప్రకారం ఏ వ్రతం చేసినా, ఏ పూజ చేసినా ఆ వ్రతానికి ఒక కథ ఉంటుంది. ప్రతి కథలోనూ ‹పూర్వం నైమిశారణ్యంలో సూత మహాముని శౌనకాది ఋషులకు› అంటూ కథ ప్రారంభం కావడం మనకు తెలిసిందే! ప్రత్యేకించి సత్యనారాయణ స్వామి వ్రత కథ, వినాయక చవితి వ్రత కథ వంటి వాటిల్లో ఈ ప్రస్తావన మనందరికీ సుపరిచితమే! అలాగే వ్యాసమహర్షి అష్టాదశ పురాణాలు ఇక్కడే రచించారని ఈ క్షేత్ర స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. అంతేకాదు శ్రీమద్ భాగవతం, పద్మ పురాణం, వాయు పురాణం, మార్కండేయ పురాణం వంటి అనేక పురాణాలు తొలిసారిగా ఋషులకు వివరించిన దివ్య ప్రదేశమే నైమిశారణ్యం. అందుకే ఈ క్షేత్రాన్ని పురాణాల పుట్టినిల్లుగా పిలుస్తారు.

నైమిశారణ్యం ఎక్కడుంది?

నైమిశారణ్యం ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సీతాపూర్ జిల్లాలో గోమతి నదీతీరంలో వెలసి ఉంది. సాత్తు శ్రీమన్నారాయణుడు స్వయంవ్యక్తమైన 8 తపోవనాల్లో నైమిశారణ్యం కూడా ఒకటి. భగవంతుడు తనంత తానే స్వయంగా ప్రకటితమైన ప్రదేశాలు దివ్యాలయాలుగా విరాజిల్లుతున్నాయి. అవే శ్రీరంగం, తిరుమల, ముక్తినాథ్, శ్రీముష్ణం, తోటాద్రి, పుష్కరం, బద్రీనాథ్, నైమిశారణ్యం. ప్రతి హిందువు తన జీవితకాలంలో ఈ 8 క్షేత్రాలు దర్శించాలని తపిస్తారు. ఇంతటి విశిష్టత కలిగిన నైమిశారణ్యం క్షేత్ర పురాణం గురించి తెలుసుకుందాం.

ద్వాపర యుగం అంతమై కలియుగ ఆరంభమైన సమయంలో తాము తపస్సు చేసుకోవడానికి ఓ పుణ్య ప్రదేశాన్ని చూపించమని మహర్షులు, ఋషులందరూ కలిసి బ్రహ్మదేవుని ప్రార్థించారం! అప్పుడు బ్రహ్మ ఓ పెద్ద చక్రాన్ని సృష్టించి, మహర్షులను దానివెంట వెళ్లమని, ఎక్కడైతే ఆ చక్రం ఆగి విరుగుతోందో ఆ ప్రదేశమే తపోభూమి అని, యజ్ఞార్హత కలిగిన ప్రదేశమని సూచించాడం! చక్రాన్ని అనుసరించిన మునులు బ్రహ్మదేవుని ఆదేశం మేరకు మునులంతా చక్రాన్ని అనుసరించి వెళ్తే ఆ చక్రానికి ఉండే అంచు అంటే నేమి ఈ అరణ్య ప్రాంతంలో పడింద! అలా ‹నేమి› పడిన అరణ్య ప్రాంతం కాబట్టి ఈ తపోవనానికి నైమిశారణ్యం అనే పేరు వచ్చింది. ఆ విధంగా నైమిశారణ్యం భగవంతుని స్వయంవ్యక్త క్షేత్రాల్లో ఒకటిగా నిలిచింది.

పురాణాలు బోధించిన పుణ్యభూమి

ఈ నైమిశారణ్యంలోనే వ్యాస మహర్షి చతుర్వేదాలను, అష్టాదశ పురాణాలను తన శిష్యులకు బోధించాడం! అలాగే సూత మహాముని, శౌనకాది మునులకు అష్టాదశ పురాణాలు ఇక్కడే వినిపించాడ! వైశంపాయనుడు కూడా ఇక్కడే భాగవత పారాయణ చేసాడం! అలాగే సూత ముని శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత విధానాన్ని, వ్రతకథను తొలిసారిగా నైమిశారణ్యంలోనే వివరించాడం! అలాగే శ్రీరాముడు నైమిశారణ్యంలోనే అశ్వమేధ యాగాన్ని చేసి, సీతాదేవి పేరిట ఓ గ్రామాన్ని దానం చేసినట్లుగా పురాణాలు చెబుతున్నాయి.



# శంభాల గ్రామంలో కల్కి జననం – తల్లిదండ్రులు హరిప్రియుడు–దేవప్రభ!

త్రేతాయుగంలో శ్రీరాముడిగా, ద్వాపర యుగంలో కృష్ణుడి అవతారమెత్తిన శ్రీమహావిష్ణువు కలియుగంలో కల్కి అవతారంలో జన్మిస్తాడని పురాణాలు చెప్తున్నాయి. విష్ణుపురాణం, పద్మపురాణాల్లో ఇదే విషయాన్ని వెల్లడించినా, ఈ భూగోళంపై కల్కి అవతారం ఎప్పుడు, ఎక్కడ ఉంటుంది? ఏ ప్రాంతంలో ఎవరికి జన్మిస్తాడు? అనే సందేహాలు అనేకం ఉన్నాయి. శ్రీరాముడి తల్లిదండ్రులు దశరథుడు కాగా తల్లి కౌసల్యాదేవి, అదే విధంగా శ్రీకృష్ణుడి తల్లి దేవకి కాగా, తండ్రి వసుదేవుడు అని తెలిసిందే. మరి కల్కి అవతార పురుషుడి తల్లిదండ్రులు ఎవరు? వారి పేర్లేమిటి? కల్కి అవతారం, జన్మ రహస్యాలపై కొందరు జ్యోతిష్యులు, పండితులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న ప్రకారం ఈ కథనం. శ్రీమహావిష్ణువును ప్రసన్నం చేసుకోవడానికి స్వాయంభువ మనువు అనే మహర్షి నైమిశారణ్యం, గోమతీనది తీరంలో కఠోర తపస్సు చేశాడట. అందుకు మెచ్చిన విష్ణుమూర్తి ప్రత్యక్షమై ఏదైనా వరం కోరుకొమ్మని అనగా, వరుసగా మరో మూడు జన్మల్లో తనకు పుత్రుడుగా పుట్టాలని కోరుకున్నాడట. మంచి వరమే కోరావు. తథాస్తు! ఇది నాకూ సంతోషమే అని దీవించాడట విష్ణుమూర్తి. ఆ ప్రకారం స్వాయంభువ మనువు మొదట త్రేతాయుగంలో ఇక్ష్వాకు వంశంలో దశరథుడిగా జన్మించగా, అతడి భార్య కౌసల్యగా జన్మించింది. వారి ఆ తర్వాత జన్మలో వారే మళ్లీ దేవకీ, వసుదేవులయ్యారు. అలా ప్రథమ జన్మలో దశరథమహారాజు – కౌసల్యలకు శ్రీరాముడిగా, రెండో జన్మలో దేవకీ వసుదేవులకు శ్రీకృష్ణుడిగా శ్రీమహావిష్ణువు అవతరించాడు.

శంభాల గ్రామంలోవిష్ణుమూర్తి తాను వరం ఇచ్చిన విధంగా స్వాయంభువ మనువుకు శ్రీరామ, శ్రీకృష్ణులుగా జన్మించి ధర్మ సంస్థాపనం చేశాడు. ఇక కలియుగంలో మూడో జన్మ ఇంకా మిగిలి ఉంది. ఈ యుగాంతానికి ముందు స్వాయంభువ మనువు శంభాల అనే గ్రామంలో జన్మిస్తాడని పురాణాల ద్వారా తెలుస్తోంది.

## కలెక్టరేట్ ను అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయండి..

### యుద్ధ ప్రాతిపదికన పనులన్నీ పూర్తి కావాలి..

### జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

### పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవనం పరిశీలన..



కరీంనగర్, బ్యూరో మెట్రో న్యూస్ : కరీంనగర్ నూతన కలెక్టరేట్ భవనాన్ని అన్ని హంగులతో ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో శనివారం పోలీస్ కమిషనర్ గౌష్ ఆలంతో కలిసి నూతన కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను ఆమె క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ ప్రధాన గేటు, కాంపౌండ్ వాల్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించిన కలెక్టర్, రోడ్లు-భవనాల శాఖ అధికారులకు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. మిగిలిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు ముందే అన్ని అభివృద్ధి, మౌలిక సదుపాయాల పనులు పూర్తవ్వాలని స్పష్టం చేశారు.
అనంతరం ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో ఏర్పాటు చేస్తున్న హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి, భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్లోని హెలిప్యాడ్ నుంచి అంబేద్కర్ స్టేడియం వరకు ఉండే రోడ్డు మార్గాన్ని పరిశీలించి, రాకపోకలు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ట్రాఫిక్ నిర్వహణ, ప్రోటోకాల్ ఏర్పాట్లు, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ అధికారులకు దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డి, ఆర్ అండ్ బి శాఖ ఈఈ నరసింహాచారి, కరీంనగర్ టౌన్ ఏసిపి వెంకటస్వామి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### మహిళా సమైక్య భవన్ అభివృద్ధి పనుల కొరకు నిధులు మంజూరు



జగిత్యాల జిల్లా/మల్లాపూర్, జూన్ 13 (మెట్రో న్యూస్) మహిళా సమైక్య భవన్ అభివృద్ధి పనుల కొరకు తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చేర్మెన్. కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు నిధులు మంజూరు చేయించారు. శనివారం మల్లాపూర్ మండలం సిరిపూర్ గ్రామంలో మహిళా సమైక్య భవన్ అభివృద్ధి పనుల కోసం ఎస్ డి ఎఫ్ నుండి నిధుల మంజూరు చేసి, ప్రొసీడింగ్ పేపర్ అందజేసిన అందజేశారు. వీరితో పాటు గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ లో వివిధ హోదాలో వున్న నాయకులు ఉన్నారు.

## సింగరేణిని నిలువునా ముంచిన బీఆర్ఎస్ పాలన: రియాజ్ అహ్మద్ సంచలన ఆరోపణలు



మెట్రో న్యూస్ గోదావరిఖని. సింగరేణి సంస్థను గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుని, తీవ్రంగా నష్టపరిచిందని హెచ్ఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రియాజ్ అహ్మద్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం గోదావరిఖనిలోని హెచ్ఎంఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఇప్పుడు అదే పార్టీకి చెందిన నాయకులు "బాయి బాట" పేరుతో కార్మికుల ముందుకు రావడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. హెచ్ఎంఎస్ గౌరవ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి సింగరేణి వ్యాప్తంగా చేపట్టనున్న "సింగరేణి బాయి బాట" కార్యక్రమం పట్ల బీఆర్ఎస్ నాయకులు ఉలిక్కిపడుతున్నారని అన్నారు. మాజీ మంత్రి హరీష్ రావు హయాంలోనే సింగరేణి ఆర్థికంగా దెబ్బతిన్నదని, విద్యుత్ మరియు బొగ్గు విక్రయాల్లో తీసుకున్న నిర్ణయాల వల్ల సంస్థకు సుమారు రూ.25 వేల కోట్ల నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు. కారుణ్య నియామకాల పేరుతో భారీగా అవినీతి జరిగిందని, ఆ ఉద్యోగాలు కాస్తా "కరప్షన్ నియామకాలు"గా మారాయని రియాజ్ ఆరోపించారు. ప్రభుత్వ మంత్రుల నివాసాలు, కార్యాలయాల కోసం సింగరేణి నిధులను విచ్చలవిడిగా ఖర్చు చేశారని, ఇది సంస్థ పట్ల వారికున్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్జీ-1 ఏరియా హెచ్ఎంఎస్ ఉపాధ్యక్షుడు పోశం మాట్లాడుతూ, సింగరేణిలో కార్మిక భద్రతా ప్రమాణాలు పూర్తిగా దిగజారాయని ఆరోపించారు. కార్మికులకు కనీస పనిముట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, నిబంధనలను పాటించాలని కోరిన వారిపై మెమోలు, ఛార్జ్‌షీట్లు జారీ చేస్తున్నారని తెలిపారు. సమ్మె విషయంలో యాజమాన్యం మరియు గుర్తింపు సంఘం అనుసరిస్తున్న తీరు కార్మిక వ్యతిరేకమని, సింగరేణిలో నెలకొన్న సమస్యలు, గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే "సింగరేణి బాయి బాట" నిర్వహిస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈ కార్యక్రమం నుండి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ పాఠశాల కార్యక్రమంలో చీపురు పట్టిన కేంద్ర మంత్రి బండి సంజయ్

### టెన్త్ విద్యార్థులకు ఉచిత సైకిళ్లు, పరీక్ష ఫీజు హామీ





రాజన్న సిరిసిల్ల, మెట్రో న్యూస్ :ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ ఆధ్వర్యంలో "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కుసుమ రామయ్య జెడ్పిహెచ్ఎస్ పాఠశాలను స్వయంగా సందర్శించిన బండి సంజయ్ చీపురు పట్టి తరగతి గదులను శుభ్రం చేశారు. పైపుతో నీళ్లు చల్లి, విద్యార్థులు కూర్చునే బెంచీలు, తరగతి గదుల మూలమూలలను పరిశుభ్రం చేశారు. కేంద్ర మంత్రి పిలుపుతో కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో బీజేపీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి స్వచ్ఛ పాఠశాల కార్యక్రమంలో పాల్గొన్నారు. చీపుర్లు, బకెట్లు, క్లాత్‌లు తీసుకువచ్చి పాఠశాల ప్రాంగణాలను శుభ్రపరిచారు.
ఈ సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వ 12 ఏళ్ల పాలన సందర్భంగా దేశవ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రంగా ఉంచే లక్ష్యంతో "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధే తన లక్ష్యమని పేర్కొన్న ఆయన, ఈ విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులందరికీ ఉచితంగా సైకిళ్లు అందజేస్తామని ప్రకటించారు.
అలాగే టెన్త్ విద్యార్థుల పరీక్ష ఫీజులను తన వేతనం నుంచి చెల్లిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాలల్లో ఉన్న సమస్యలను త్వరలో సమీక్షించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.
అదేవిధంగా, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంపు కోసం గ్రామాలు, మండలాల్లో ప్రత్యేక ర్యాలీలు నిర్వహించనున్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.

## మండల కేంద్రానికి వేపచెట్టే బస్టాండ్ దిక్కు తోచని స్థితిలో ప్రయాణికులు



శ్రీరాంపూర్ మండల కేంద్రానికి చెందిన వ్యాపారవేత్త

మెట్రో న్యూస్, శ్రీరాంపూర్: పెద్దపెల్లి జిల్లా శ్రీరాంపూర్ మండల కేంద్రం నుండి ప్రతినిత్యం ఆయా గ్రామాల నుండి గోదావరిఖని కరీంనగర్ జమ్మికుంట వంటి వివిధ పట్టణాలకు పలు అవసరాల నిమిత్తం ప్రయాణికులు ప్రతిరోజు ప్రయాణం చేస్తూ ఉంటారు కానీ శ్రీరాంపూర్ మండల కేంద్రానికి వేప చెట్లు దుకాణాలు బస్టాండ్లుగా మారాయని పలు గ్రామాల ప్రయాణికులుఅనుకుంటున్నారు. గత15సంవత్సరాలకాలంనుండిశ్రీరాంపూర్మండలకేంద్రానికి బస్టాండ్ దిక్కు లేక ఎండలో వానలో తడుస్తూ ప్రయాణాలు చేయాల్సి వస్తుందని ప్రయాణికులువాపోతున్నారు. గతంలో తన సొంత ఖర్చులతో బస్టాండ్ నిర్మిద్దామని ముందుకు వస్తే కొందరు నాయకులు వారిని అడ్డుకోవడంతో బస్టాండ్ అనేది ఇంతవరకు నిర్మాణం కాక ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఇప్పటికైనా ఎవరైనా ముందుకు వచ్చి శ్రీరాంపూర్మండలకేంద్రానికి స్వార్థ ప్రయోజనం కోసం కాకుండా నిస్వార్థంతో పనిచేసే శ్రీరాంపూర్ మండలంలోని ఆయా గ్రామాల ప్రయాణికులకు అండగా నిలుస్తారని పలువురు ప్రయాణికులు కోరుకుంటున్నారు.

## తెలంగాణ అడ్వకేట్స్ అసోసియేషన్ క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా రికార్డు మెజారిటీతో ఎన్నికైన అడ్వకేట్ బెజ్జంకి శ్రీకాంత్‌కు ఘన సన్మానం



మెట్రో న్యూస్ రాజన్న సిరిసిల్ల, జూన్ 13:తెలంగాణ అడ్వకేట్స్ అసోసియేషన్ ఎన్నికల్లో క్రీడా, సాంస్కృతిక కార్యదర్శిగా రికార్డు మెజారిటీతో విజయం సాధించిన ప్రముఖ న్యాయవాది అడ్వకేట్ బెజ్జంకి శ్రీకాంత్ గారిని పలువురు ప్రముఖులు, న్యాయవాదులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వ్యాపారవేత్త చెట్టి కళ్యాణ్, సీనియర్ కొల్లూరి శ్రీనివాస్ గుప్తా జర్నలిస్ట్ జుట్టు మల్లేశం, యువజన నాయకులు తోట సాగర్, జూపల్లి ధీరజ్, అడ్వకేట్ గట్టు సత్యం గౌడ్, ట్యాక్స్ కన్సల్టెంట్ కొమురెల్లి శివకృష్ణ, డాక్టర్ శ్రీనివాస్ గౌడ్ తదితరులు శ్రీకాంత్‌ను శాలువా కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందించారు. అదేవిధంగా పట్టణ స్వర్ణకార సంఘం అధ్యక్షులు రావుల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి కందుకూరి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు వేగ్గలం రామకృష్ణ, కోశాధికారి ముత్తోజు ప్రకాష్, హిందూ వాహిని సహ సంయోజక్ పెందోట రాజు, దుర్శేటి అర్జున్, కట్ట రాజేష్ తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ, న్యాయవాద వృత్తిలో విశేష సేవలందిస్తూ ఇప్పటివరకు వందలాది మంది ప్రజలకు న్యాయం అందించడంలో శ్రీకాంత్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. సామాన్య ప్రజలతో పాటు రాజకీయ నాయకులు, సీనియర్ జర్నలిస్టులు, న్యాయవాదులు, ట్యాక్స్ కన్సల్టెంట్లు, యువజన నాయకులకు న్యాయపరమైన సహాయం అందించి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని పేర్కొన్నారు. ప్రజా సేవ పట్ల ఆయనకున్న అంకితభావం, నిబద్ధత, అందరితో కలిసిమెలిసి పనిచేసే స్వభావం కారణంగానే న్యాయవాదులు ఆయనను రికార్డు మెజారిటీతో గెలిపించారని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా అడ్వకేట్ బెజ్జంకి శ్రీకాంత్ మాట్లాడుతూ, తనపై విశ్వాసం ఉంచి రికార్డు మెజారిటీతో గెలిపించిన న్యాయవాద సోదర సోదరీమణులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. న్యాయవాదుల సంక్షేమం, క్రీడా మరియు సాంస్కృతిక కార్యక్రమాల అభివృద్ధికి కృషి చేయడంతో పాటు ప్రజలకు మరింత మెరుగైన న్యాయసేవలు అందించేందుకు నిరంతరం శ్రమిస్తానని పేర్కొన్నారు.

## ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలి.

### తపస్ ఉద్యోగ సంఘం డిమాండ్.




రేగొండ,జూన్13(మెట్రో న్యూస్): రాష్ట్ర ప్రభుత్వంప్రత్యేక ఆర్డినేన్స్ ద్వారా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయింపు ఇవ్వాలని భూపాలపల్లి జిల్లా తపస్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షులు ములుకల్ల తిరుపతి, ప్రధాన కార్యదర్శిలు పత్తి వెంకటరామిరెడ్డి, రాష్ట్ర బాధ్యులు మారబోయిన మహేందర్,పరమరాధ్యుల సుధాకర్ లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తపాస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో టెట్ నిర్వహణపై వారు విపులంగా వివరించారు. ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు టీజుజు నిబంధనలకు అనుగుణంగా 2025 ,1సెప్టెంబర్ లో సుప్రీం కోర్ట్ తీర్పు వెలువడింది . దీనితో ఆందోళన చెందిన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు 65 రివ్యూ పిటిషన్ వేశారు నిబంధనల ఆధారంగానే సుప్రీం కోర్ట్ ఆ రివ్యూలను కొట్టివేస్తూ 2028 ఆగష్టు 31 లోపు ఇన్ సర్వీస్ టీచర్స్ కు చివరి అవకాశంగా తీర్పు ఇచ్చినది. దీని ప్రకారం సర్వీస్ రిమూవ్ చేసే అవకాశం ఉంది. తెలంగాణ లో 30000 మంది ఉపాధ్యాయులకు టెట్ పాస్ కావాల్సిన అవసరం ఉంది. ఇటీవల ప్రత్యేకంగా 2సార్లు టెట్ నిర్వహణ చేస్తామనే రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం కాస్త ఊరట మాత్రమే. విద్యా హక్కు చట్టం అమలు ద్వారా టెట్ అంశం ప్రస్తావన జరిగింది. ఏప్రిల్ 1/2010 పూర్వం న్యాయ బద్దంగా నోటిఫికేషన్ వచ్చి నియామకం అయిన ఉపాధ్యాయులకు ఆనాడు టెట్ అవసరం లేదు స్పష్టంగా పేర్కొనడం జరిగింది .తర్వాత ణూజ నోటిఫికేషన్ లో టెట్ అర్హత ఆధారంగానే నియామకాలు జరుగుతున్నాయి. ఏప్రిల్ 1/2010 =ఙు రూల్స్ అనుగుణంగా టీజుజు టెట్ నిబంధనలు చేర్చింది. ఈ నిబంధనల ఆధారంగానే సుప్రీం కోర్ట్ తీర్పు ఇచ్చింది. ఇది ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు అన్యాయం కల్గిస్తుంది. గత 30 సంవత్సరాలనుండి ఉపాధ్యాయులు ఎంపిక చేసుకున్న విషయం లో భోదిస్తున్నారు. టెట్ లో మాత్రం అన్ని విషయాలు కలిపి పరీక్షలు పెట్టడం జరుగుతుందాని నీవలన ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరుగుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. భాషా ఉపాధ్యాయులకు, ఇతర సబ్జెక్టు ఉపాధ్యాయులు కూడా తమ బోధన కు సంబంధం లేని సబ్జెక్టు చదవి పరీక్షలు రాయాల్సిన పరిస్థితి ఉంది. అలాంటిప్పుడు ప్రత్యేకంగా టెట్ ఎన్ని సార్లు పెట్టిన ప్రయోజనం లేదనే భావన ఉపాధ్యాయుల్లో ఉంది. పైగా టీజజు=ఙ, ౨జజు=ఙ ఆధ్వర్యంలో, దీక్ష నిష్ఠ,లాంటి అనేక ఆన్లైన్ వృత్యంతర శిక్షణ ఇస్తూనే ఉన్నారు. తద్వారా సమకాలిన పరిస్థితులకు అనుగుణంగా ఉపాధ్యాయులు నేర్చుకుంటున్నారు. ఇది అసంబద్ధ నిర్ణయంగా తపస్ అనేక మార్లు ప్రభుత్వాలకు నివేదించింది .తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం -ూఖూ ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆర్డినేన్స్ తెచ్చి ఏప్రిల్ 1, 2010 కన్న ముందు వేసిన నోటిఫికేషన్ ద్వారా నియమాలు అయినా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయింపు ను కోరుకుంటున్నాము.
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రంప్రభుత్వం ను ఒప్పించేలా తగు చర్యలు తీసుకోవాలని తపస్ జిల్లా కార్యనిర్వాహక వర్గ సమావేశంలో నాయకులు డిమాండ్ చేసారు. ఈసమావేశంలో తపస్ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ములుకల్ల తిరుపతి ,పత్తి వెంకటరామిరెడ్డి, రాష్ట్ర బాధ్యులు మారబోయిన మహేందర్, పరమరాధ్యుల సుధాకర్ గార్లు,జిల్లా మరియు మండల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి అండగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి

### రూ.10 లక్షల సహాయం అందించి, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి



జగిత్యాల జిల్లా ప్రతినిధి, జూన్ 13 (మెట్రో న్యూస్) : అగ్ని ప్రమాదానికి గురైన బాధిత కుటుంబానికి అండగా మాజీ మంత్రి జీవన్ రెడ్డి పరామర్శించారు. శనివారం జగిత్యాల పట్టణంలో మోచి బజార్ లో నిన్న విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో అగ్నిప్రమాదానికి గురి కావడంతో, కాలిపోయిన ఇంటిని మాజీ మంత్రి, బి ఆర్ ఎస్ పార్టీ జనరల్ సెక్రెటరీ తాటిపర్తి జీవన్ రెడ్డిపరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో ఫోన్ మాట్లాడారు. స్వయం ఉపాధితో జీవనం పొందే గంగాధర్ కుట్టుమిషనుల మరమ్మతులు చేయడం బట్టలు కుడుతు ఉపాధి పొందే పేద కుటుంబం, పూర్తిగా ఇల్లు కాలిపోవడం, కుట్టు మిషన్స్ కాలిపోవడం జరిగిందన్నారు. రాజీవ్ యువ వికాస్ పథకం ద్వారా 10 లక్షల రూపాయలు అందించి, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలి అని అన్నారు. ఇల్లు పూర్తిగా కాలిపోయింది నివసించే పరిస్థితి లేదు, కావున ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలనీ, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన కోరారు.

## తెలంగాణ పబ్లిక్ స్కూల్ కోసం స్థల సర్వే




చిగురుమామిడి: మెట్రోన్యూస్)చిగురుమామిడి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను తెలంగాణ పబ్లిక్ స్కూల్ గా అప్ గ్రేడ్ చేస్తూ ఇటీవల ప్రభుత్వం ఎంపిక చేసింది. గతంలో రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇక్కడ స్థల పరిశీలన కూడా చేశారు. కాగా శనివారం ఈపాఠశాల ఆవరణతో పాటు తెలంగాణ క్రీడా ప్రాంగణం స్థలాన్ని పూర్తి స్థాయిలో అధికారులు సర్వే చేశారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ దాదాపు ముప్పై కోట్ల రూపాయల ఖర్చుతో ఆధునీకరిస్తూ అదునాతన విద్యా పరికరాలు, అదనపు తరగతి గదులు, స్విమ్మింగ్ పూల్, క్రీడా సామాగ్రి, ప్రత్యేక అధ్యాపకులతో పాటు అన్ని రకాల మౌలిక సదుపాయాలతో కార్పొరేట్ పాఠశాలకు దీటుగా విద్యార్థుల సమగ్రాభివృద్ధికి తోడ్పడే విధంగా ఏర్పాటు చేస్తారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడం పట్ల ప్రజా ప్రతినిధులు, మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆకవరం భవాని, మాజీ జడ్పీటీసీ సభ్యులు, డీసీసీ వైస్ ప్రెసిడెంట్ గీకురు రవీందర్, కాంగ్రెస్ నాయకులు బుర్ర శ్రీనివాస్ గౌడ్, బెజ్జంకి అంజయ్య, పాఠశాల పీడీ సమ్మయ్య, సర్వేయర్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు

# రాబోయే ఐదు రోజులు జిల్లాలో భారీ వర్షాలు

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: రాబోయే ఐదు రోజుల పాటు సూర్యాపేట జిల్లాలో వర్షాలు, పిడుగులు పడే అవకాశాలు ఉన్నాయని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా జిల్లాల్లో భారీ వర్షాలు, బలమైన ఈదురు గాలులతో కూడిన ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అంతేకాకుండా గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడవచ్చని పొలాల్లో పనిచేసే రైతులు, కూలీలు ఉరుములు వస్తున్నప్పుడు చెట్ల కింద, విద్యుత్ స్తంభాల కింద ఉండొద్దని సూచించారు. శిథిలావస్థ ఇళ్లలో ఉండేవారు అప్రమత్తంగా ఉండాలని వీలైతే పక్కా భవనాలలో ఆశ్రయం పొందాలని తెలిపారు. వర్షం పడే సమయంలో అత్యవసరమైతే తప్ప ప్రయాణాలు చేయవద్దన్నారు. అధికారులందరూ క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంటూ పరిస్థితిని సమీక్షించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## అంబరాన్నంటిన బడుగు లింగయ్య యాదవ్ జన్మదిన వేడుకలు:

### కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన నేతలు!



మెట్రో న్యూస్,( జూన్ 13 ), గరిడేపల్లి: మాజీ రాజ్యసభ సభ్యుడు బడుగు లింగయ్య యాదవ్ జన్మదిన వేడుకలను గరిడేపల్లి మండల కేంద్రంలో శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. హుజూర్‌నగర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కడియం వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో పలువురు ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకుంటూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కడియం వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. బడుగు లింగయ్య యాదవ్ సామాజిక న్యాయం, బీసీ వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం శ్రమించిన ఆదర్శప్రాయుడైన నాయకుడని కొనియాడారు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు ఎన్నటికీ మరువరని, రాబోయే రోజుల్లో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజకీయాల్లో కీలక మార్పులు రావడం ఖాయమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. లింగయ్య యాదవ్ మరెన్నో ఏళ్లు ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో కొనసాగాలని కాంక్షించిన ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కడియం స్వప్న వెంకటరెడ్డి తో పాటు మాజీ ఎంపిటిసి పెండెం వీరయ్య గౌడ్, మాజీ మండల ప్రధాన కార్యదర్శి మన్సూర్ అలీ, పెండెం దానయ్య గౌడ్, వెంకట రాములు, షేక్ రాజమహమ్మద్, బండ్ల గోపాల్, మామిడి కాశి అంజయ్య, పెండెం వినోద్, పెండెం శంకర్, రెబ్బ శివ, పిట్ట నరసయ్య తదితరులు పాల్గొని ఈ వేడుకలను విజయవంతం చేశారు.

## ఘనంగా బడుగుల లింగయ్య యాదవ్ జన్మదిన వేడుకలు



మెట్రో న్యూస్, సూర్యాపేట ప్రతినిధి: మాజీ రాజ్యసభ సభ్యులు, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ జన్మదిన వేడుకలను శనివారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. ఉదయం పట్టణంలోని పలు కూడళ్లలో అల్పాహారం అందజేశారు. అనంతరం ఆయన నివాసంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసి స్థానిక కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ వద్ద అన్నదాన నిర్వహించారు. పలుచోట్ల జరిగిన ఆయా కార్యక్రమాలలో ప్రజా ప్రతినిధులు, ఆయా సంఘాల నాయకులు, బిఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా హాజరైన వారందరూ మాజీ ఎంపీ, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ కుమారుడు డాక్టర్ బడుగుల యశ్వంత్, సోదరుడు బడుగుల శ్రీనివాస్ ల ద్వారా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, రాష్ట్ర కార్యదర్శి,మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, పార్టీ పట్టణ అధ్యక్షుడు సవరాల సత్యనారాయణ,ఆకుల లవకుశ,బండారు రాజా, బొమ్మగాని శ్రీనివాస్ గౌడ్, కాస శ్రీనివాస్ యాదవ్, బడుగుల శ్రీనివాస్ యాదవ్, బెల్లంకొండ యాదగిరి గౌడ్,41వ వార్డు ఇంచార్జ్ ఢిల్లీ పావనిఉపేందర్, రేణు బాబు,బిఆర్ ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## పేరుకుపోయిన గుర్రపు డెక్కను తొలగించాలి



వలిగొండ మెట్రో న్యూస్ :వలిగొండ నుండి తుర్కపల్లి మీదుగా పాలడుగు వరకు నీరు పారుతున్న భీమలింగం కాల్వలో విపరీతంగా పేరుకుపోయిన గుర్రపుడెక్క ఆకు, చెత్తాచెదారాన్ని వెంటనే అధికారులు తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి అన్నారు. శనివారం సీపీఎం ఆధ్వర్యంలో నాయకులు కాల్వలో నీరు ప్రవహించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కాల్వ గుర్రపుడెక్క మొక్కలతో నిండిపోయి, నీటి ప్రవాహానికి తీవ్ర అంతరాయం కలిగిస్తున్న దుస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భీమ లింగం కాల్వలో పేరుకుపోయిన గుర్రపు డెక్క ఆకు వల్ల నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడుతున్నాయని, కాల్వ పొడవునా గుర్రపుడెక్క ఆకు దట్టంగా పేరుకుపోవడం వల్ల సాగునీరు ముందుకు సాగకుండా నిలిచిపోతోందని, దీనివల్ల రైతులకు సకాలంలో నీరందక తీవ్ర ఇబ్బందులు పడే ప్రమాదం ఉందని, వెంటనే అధికారులు స్పందించి గుర్రపు డెక్క ఆకును తొలగించాలని డిమాండ్ చేశారు. మరోవైపున వలిగొండ పట్టణంలో గుర్రపు డెక్క ఆకు పేరుకు పోవడంతో నీరు కలుషితమవుతు దోమల వ్యాప్తి చెంది విష జ్వరాలు ప్రభలే అవకాశం ఉందని, సంబంధిత నీటిపారుదల శాఖ అధికారులు, స్థానిక యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన స్పందించి యంత్రాల ద్వారా ఆకును తొలగించి కాల్వను శుభ్రం చేయించాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కూర శ్రీనివాస్, మెరుగు వెంకటేశం, దుబ్బ లింగం, గర్దాసు నరసింహ, కొండూరు సత్తయ్య, రాధారపు మల్లేశం,శీలం ఇందిర, వేముల లక్ష్మయ్య, ద్యాన బోయిన యాదగిరి, అలకుంట్ల నరసింహ,బొడ్డు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## తీవ్ర విషాదంలో ఉన్న బాధిత కుటుంబాలకు నేనావత్ కిషన్ నాయక్ ఆర్థిక సహాయం మరియు భరోసా



దేవరకొండ. మెట్రో న్యూస్... మండలంలోని జర్పుల తండ గ్రామంలో ఇటీవల చోటుచేసుకున్న ఘోర ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు బావిలో పడి మరణించిన సంఘటన తీవ్ర కలచివేసింది. గ్రామానికి చెందిన జర్పుల శివ నాయక్ కుమారుడు జర్పుల రిత్విక్, అలాగే జర్పుల చంటి కుమారుడు హర్షవర్ధన్ అకాల మరణం చెందారనే విషయం తెలుసుకున్న బి ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఈ రోజు ఉదయం బాధిత చిన్నారుల స్వగృహాలకు వెళ్ళిన కిషన్ నాయక్ , వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. పుత్రశోకంతో ఉన్న ఆ తల్లిదండ్రులను ఓదార్చి, వారికి ధైర్యాన్ని మరియు భరోసాను కల్పించారు. అనంతరం బాధిత రెండు కుటుంబాలకు తన వంతుగా ఆర్థిక సహాయాన్ని అందజేశారు. బాధిత కుటుంబాల పరామర్శలో కిషన్ నాయక్ వ సర్పంచ్ గోపాల్ నాయక్, మాజీ సర్పంచ్ జైహిందూ రెడ్డి, మాజీ ఎంపీటీసీ రవీందర్,మాజీ సర్పంచ్ ఇద్దయ్య,జర్పుల వాగ్య, సత్తి రెడ్డి, అల్వాల్ రెడ్డి, రమేష్ నాయక్, ఆంగోత్ సంతోష్, నరసింహ, రవి, ఖాజా, రమేష్ మరియు స్థానిక యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## తెలుగును సరళతరం చేస్తే తెలుగు కలకాలం నిలుస్తుంది

### తెలుగు సులభతరం "లిపి" సృష్టికర్త

### చంద్రగిరి వెంకటేశ్వర్లు ఎంపిపిఎస్ బస్వాపురం




ఖమ్మం మెట్రో ఈవినింగ్ జూన్ 13 : తెలుగును సరళతరం చేస్తే తెలుగు కలకాలం నిలుస్తుందని, అటువంటి తెలుగును మరింత అర్థవంతంగా సులభతరంగా చేసి ప్రపంచానికి తెలియజేసేందుకు తన వంతు పాత్రగా తెలుగును సరళతరం చేసేందుకు "లిపి" ని కనుగొన్నట్లు ఖమ్మం జిల్లా కొనిజర్ల మండలం ఎంపిపిఎస్ బస్వాపురం కు చెందిన ఉపాధ్యాయుడు చంద్రగిరి వెంకటేశ్వర్లు వెల్లడించారు. ఖమ్మం ప్రెస్ క్లబ్ లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఇసుక దిబ్బలపైన, తాళపత్ర గ్రంథములపై, శిల్పాలపైన చెక్కిన ప్రతి సందర్భంలోనూ మన పూర్వీకులు "లిపి" సరళతకు చోటు కల్పిస్తూ వచ్చారు. అలా రేపటి డిజిటల్ యుగపు అవసరాలకు అనుగుణంగా అక్షరాలను సంస్కరిస్తే అనే ఆలోచనతో తెలుగు భాషను తరళతరం చేయడం ద్వారా ఇప్పటి తరం తెలుగును నేర్చుకునేలా చేస్తే తెలుగు వెలుగు ఎప్పటికీ బ్రతికి ఉంటుందని అన్నారు. ప్రస్తుతం విద్యార్థి దశలో ఉన్న వారు తెలుగును నేర్చుకోవడంలో ఎన్ని ఇబ్బందులు పడుచున్నారో మనం గమనిస్తున్నామని, ఇంగ్లీషు భాషను నేర్చుకున్నంత త్వరగా తెలుగును నేర్చుకోవడంలో విఫలం చెందుతున్నారని, దీనికి అతి పెద్ద కారణం ఒత్తులు. ఒత్తులకు ఎటువంటి ప్రాధాన్యత లేకున్నా, ఆ ఒత్తులను గుర్తు పెట్టుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దశలో ఒత్తులను ఉపాక్షర సహిత, హంసగీత ఆధారంగా సంస్కరిస్తే మన తెలుగు మరింత వికసిస్తుందని, శ్రీశ్రీ స్ఫూర్తిగా ముత్యాల్లాంటి తెలుగక్షరాలంటూ లిపి మీద లేనిపోని సెంటిమెంట్ పెట్టుకోవడం మాని, దాన్ని సంస్కరించినట్లయితే తన నిశ్చిత అభిప్రాయంగా ఆయన ప్రపంచ తెలుగు మహాసభ వారు ఈ విషయమై ఆలోచించడం మంచిదని "అనంతం" (1975 సం||లో) అనే పుస్తకంలో 196వ పేజీలో ఉటంకించారని గుర్తు చేశారు. దీనిని బట్టి మనం అర్థం చేసుకోవలసింది తెలుగు లిపిని సంస్కరిస్తే కలకాలం తెలుగును భావతరాల వారు సైతం ఆస్వాదిస్తారని, ప్రస్తుతం ఎవ్వరూ తెలుగంకెలను రాసే పరిస్థితిలో లేరాని ,వాటి జాడ దాదాపుగా కనుమరుగై పోయింది. ఈ దుస్థితి తెలుగు లిపికి రాకుండా ఉండాలన్నదే మన అభిప్రాయం అన్నారు.

ఒత్తులను ఎలా సంస్కరించవచ్చు అనే దానిపై వివిధ కోణాల్లో తెలుగు లిపిపై దాదాపు 11 సంవత్సరాలుగా కృషి చేసి కొన్ని సవరణలను ప్రతిపాదించడం జరిగింది. దీనిపై ఉస్మానియా యూనివర్సిటీ, రవీంద్రభారతి, శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, ఆంధ్రా యూనివర్సిటీలలో జరిగిన పలు చర్చా కార్యక్రమాలలో పాల్గొని చర్చించడం జరిగింది. దీనికి పలువురు విద్యావేత్తలు, భాషాపండితులు, మేధావులు నన్ను ప్రశంసించడం జరిగింది. కానీ తెలుగు లిపి సంస్కరణకు మరింత ప్రచారం కల్పించాలని, భావితరాలు తెలుగు లిపికి ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ముందుకు వచ్చానని తెలిపారు. తెలుగు ను బతికించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

## వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటు

### నమ్మకమైన సీనియర్ నాయకుడిని కోల్పోయాం

### పొన్నబోయిన కుటుంబం పార్టీకి అందిస్తున్న సేవలు అభినందనీయం

### బాధిత కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు



కొత్తగూడెం ఆర్ సి (మెట్రో న్యూస్) : సిపిఐ సీనియర్ నాయకులు పొన్నబోయిన వెంకటయ్య మృతి పార్టీకి తీరని లోటని, ఆయన మరణం అత్యంత బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెం మేదరబస్తీ ప్రాంతానికి చెందిన సీనియర్ నేత పొన్నబోయిన వెంకటయ్య (65) ఇటీవల మృతిచెందగా, శనివారం ఆయన గృహాన్ని కూనంనేని సాంబశివరావు సందర్శించారు. ఈ సందర్భంగా వెంకటయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఆయన ఘనంగా నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి తన గాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దశాబ్దాలుగా పొన్నబోయిన కుటుంబం పార్టీ బలోపేతానికి, సిద్ధాంతాల వ్యాప్తికి అందిస్తున్న సేవలను కొనియాడారు. వెంకటయ్య లాంటి నిబద్ధత గల నాయకుడిని కోల్పోవడం విచారకరమన్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, శోకసంద్రంలో ఉన్న కుటుంబానికి పార్టీ అన్ని విధాలా ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, కార్పొరేటర్ బండి నర్సింహా, సిపిఐ నాయకులు, వెంకటయ్య కుమారుడు పొన్నబోయిన కుమార్, స్థానిక నాయకులు లింగయ్య, ఆరూరి వెంకటేశ్వర్లు తదితరులు వున్నారు.

## సామ్య తండాలో ఘనంగా బోనాల సంబరాలు

### అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు...

### భక్తిశ్రద్ధలతో మొక్కులు చెల్లించుకున్న గ్రామస్తులు...



కారేపల్లి , మెట్రో ఈవివెనింగ్ జూన్ 13:సింగరేణి మండల పరిధిలోని సామ్య తండా గ్రామంలో శ్రీ నాబీశీల బొడ్రాయి ముత్యాలమ్మ తల్లి వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బోనాల పండుగను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకలను శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం ఆలయ చైర్మన్ ధరావత్ కళ్యాణ్ ఆధ్వర్యంలో ఘనంగా చేపట్టారు. ఉదయం నుంచే గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. సంప్రదాయ వస్త్రధారణలో మహిళలు బోనాలు ఎత్తుకొని అమ్మవారి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. డప్పు చప్పుళ్లు, భక్తి గీతాల నడుమ మహిళలు అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి తమ కుటుంబాల శ్రేయస్సు కోసం మొక్కులు చెల్లించుకున్నారు.

అలాగే గ్రామ పెద్దలు, భక్తులు ముత్యాలమ్మ తల్లి మరియు పోతురాజులకు మేకపోతులను బలిచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు అమ్మవారి కటాక్షంతో సమృద్ధిగా వర్షాలు కురిసి, పంటలు బాగా పండాలని, రైతులు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. పంటల సాగు ప్రారంభమయ్యే ఈ కీలక సమయంలో నిర్వహించే బోనాల పండుగ గ్రామీణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని, గ్రామంపై అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ హిరాలాల్, ఉపసర్పంచ్ గుగులోత్ భీక్కులాల్, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు గూగులోత్ భీముడు నాయక్ , బానోతు రాందాస్,రామచందర్ ,లావుడియా ఈర్యా నాయక్ ,రాజేష్ ,నాగేష్ ,యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పండుగను విజయవంతం చేశారు. భక్తి, సంప్రదాయం, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలిచిన ఈ బోనాల సంబరాలు సామ్య తండా గ్రామంలో ఆధ్యాత్మిక ఉత్సాహాన్ని నింపాయి.

## మహిళా సంఘాలకు ఆర్థిక బలం.. దేవరకద్రలో సోలార్ పవర్ ప్లాంట్‌కు శంకుస్థాపన



దేవరకద్ర, మెట్రో న్యూస్:దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణ పనులకు దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, మహిళలను చిన్నచిన్న వ్యాపారాలకే పరిమితం చేయకుండా వారిని పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులను మహిళా సంఘాలకు కేటాయించిందన్నారు. ఈ ప్రాజెక్టుల ఏర్పాటుకు అవసరమైన స్థలాలు, అనుమతులు, పెట్టుబడుల విషయంలో ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు.సోలార్ పవర్ ప్లాంట్ల ద్వారా వచ్చే ఆదాయం నేరుగా మహిళా సంఘాల సభ్యులకు చేరుతుందని, తద్వారా వారి ఆర్థిక స్థితి మరింత బలోపేతం అవుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం మహిళా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహాలక్ష్మి పథకాన్ని అమలు చేసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించిందని గుర్తుచేశారు.అదేవిధంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలు అందించడం, సభ్యులకు రూ.10 లక్షల బీమా సౌకర్యం కల్పించడం వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం ఇందిరమ్మ ఇళ్లు, సన్న బియ్యం, మహాలక్ష్మి పథకం, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ వంటి పలు అవకాశాలను మహిళలకే కేటాయిస్తున్నామని చెప్పారు.ఈ కార్యక్రమాల ద్వారా మహిళల ఆదాయం పెరిగి, కుటుంబాల ఆర్థిక పరిస్థితి మెరుగుపడటంతో పాటు వారు స్వయం సమృద్ధిని సాధిస్తారని ఎమ్మెల్యే అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో దేవరకద్ర మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్,కౌన్సిలర్లు, సర్పంచులు,అధికారులు,ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు ప్రతి ఒక్కరికి అందేలా

# కృషి చేయడం కాంగ్రెస్ ధ్యేయం

### నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి



మెట్రో న్యూస్ వనపర్తినాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధి వనపర్తి జిల్లా కేంద్రంలో విజయవంతంగా కొనసాగుతున్న జ్ఞాన చైతన్య బస్సు యాత్రతెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం రాష్ట్ర కన్వీనర్, నాగర్ కర్నూల్ పార్లమెంటు సభ్యులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవి. ఆయన చేపట్టిన జ్ఞాన చైతన్య బస్సు యాత్ర వనపర్తి నియోజకవర్గంలో జెండా ఊపి ప్రారంభించిరు .మున్సిపల్ చైర్మన్ మాదవి రమేష్ శెట్టి మల్లు రవి వెంట ఉండగా, మల్లు రవి మాట్లాడుతూ,ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు, ఈడబ్ల్యూఎస్ వర్గాలు మరియు ఇతర బడుగు, బలహీన వర్గాల ప్రజలకు భారత రాజ్యాంగం కల్పించిన హక్కులు, అవకాశాలు పూర్తిస్థాయిలో అందేలా కృషి చేయడం కాంగ్రెస్ పార్టీ యొక్క ప్రధాన లక్ష్యమని తెలిపారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, విద్య, ఉపాధి, ఆర్థిక సాధికారత మరియు సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ఈ జ్ఞాన చైతన్య బస్సు యాత్రను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమాజంలోని వెనుకబడిన వర్గాలు తమ హక్కుల పట్ల చైతన్యవంతులై ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాజ్యాంగ విలువల పరిరక్షణ, సామాజిక సమానత్వం సాధన, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం కృషి చేస్తోందని, ప్రజల హక్కుల సాధనలో ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని స్పష్టం చేశారు. ఈ జ్ఞాన చైతన్య బస్సు యాత్ర ద్వారా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లోని ప్రజలకు రాజ్యాంగ హక్కులు, విద్యా అవకాశాలు, ఉపాధి పథకాలు, సామాజిక సంక్షేమ కార్యక్రమాలపై విస్తృత అవగాహన కల్పించడం జరుగుతోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి గారు,వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు, మహిళా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని యాత్రకు తమ మద్దతు తెలిపారు.

## జిల్లా కేంద్రంలో డాగ్ స్క్వాడ్‌తో ప్రత్యేక తనిఖీలు





నాగర్ కర్నూల్ బ్యూరో:----(మెట్రో న్యూస్:జూన్ 13)నాగర్ కర్నూలు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో డాగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో నార్కోటిక్ (మాదకద్రవ్యాల) గుర్తింపు పరీక్షలు నిర్వహించారు.మాదకద్రవ్యాల నియంత్రణ లక్ష్యంగా పోలీసులు పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా అనుమానాస్పద వస్తువులు మాదకద్రవ్యాల గుర్తింపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు అధికారులు తెలిపారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని పోలీసులు స్పష్టం చేశారు.తనిఖీల్లో పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొనగా, జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు కట్టుదిట్టమైన చర్యలు కొనసాగుతున్నాయని వెల్లడించారు.అలాగే, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

## మీ పిల్లలను ఉచిత ప్రీ-ప్రైమరీ పాఠశాలలో చేర్పించండి: టీచర్ మౌనిక.



మహమ్మదాబాద్, మెట్రో న్యూస్:రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత ప్రీ-ప్రైమరీ పాఠశాలల్లో గ్రామంలోని 3, 4, 5 సంవత్సరాల వయస్సు గల చిన్నారులను చేర్పించాలని గాధిర్యాల్ ప్రీ-ప్రైమరీ పాఠశాల ఉపాధ్యాయురాలు బి. మౌనిక కోరారు.శనివారం మీడియాతో మాట్లాడిన ఆమె, ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన పుస్తకాలు, విద్యా సామగ్రి, రెండు పూటల భోజన సదుపాయాలను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని పాఠశాలలో కల్పిస్తున్నామని చెప్పారు.ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు, ఇతర ఖర్చులతో తల్లిదండ్రులు ఆర్థిక భారాన్ని ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. పేద మరియు మధ్యతరగతి కుటుంబాల పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఉచిత ప్రీ-ప్రైమరీ పాఠశాలలను ఏర్పాటు చేసిందని వివరించారు.అందువల్ల గ్రామంలో అందుబాటులో ఉన్న ఉచిత పీ-ప్రైమరీ పాఠశాలలో తమ పిల్లలను చేర్పించి, వారి విద్యా భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని తల్లిదండ్రులకు మౌనిక విజ్ఞప్తి చేశారు.

## సర్పంచుల పెండింగ్ వేతనాలు విడుదల చేయాలి.బండమీదిపల్లి సర్పంచ్ పాండు డిమాండ్



మెట్రో న్యూస్ (జడ్చర్లటౌన్) జూన్ 13తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సర్పంచులకు నెలకు రూ. 6,500 చొప్పున 5 నెలల వేతన బకాయిలు రూ. 32,500 చెల్లిస్తామని 10-06-2026 నాడు హామీ ఇచ్చినప్పటికీ ఇంతవరకు జమ కాకపోవడం దారుణమని బండమీదిపల్లి గ్రామ సర్పంచ్ సత్యమోల పాండు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రాష్ట్రంలో మొత్తం 12,769 గ్రామ పంచాయతీలు ఉండగా, ఒక్కో సర్పంచ్‌కు రూ. 32,500 చొప్పున లెక్కిస్తే మొత్తం రూ. 41.49 కోట్ల వేతన బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం సర్పంచుల ఖాతాల్లో వెంటనే వేతనాలు జమ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సర్పంచులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని, వేతనాలు లేకపోవడంతో వారి కుటుంబాల పోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క.స్పందించి సర్పంచుల పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా సర్పంచులు ఆందోళన బాట పట్టక తప్పదని హెచ్చరించారు.

## విద్యుత్ షాక్‌తో అసిస్టెంట్ లైన్‌మెన్ మృతి



మెట్రో న్యూస్ సంగారెడ్డి బ్యూరో:సంగారెడ్డి మండలం ఇరిగిపల్లి గ్రామానికి చెందిన తలారి రంజిత్ కుమార్ (34), విద్యుత్ శాఖలో అసిస్టెంట్ లైన్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శనివారం ఉదయం 9:20 గంటల సమయంలో గ్రామానికి చెందిన గౌండ్ల భర్తయ్య పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజ్ పోయిందని సమాచారం అందడంతో దానిని అమర్చేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో ఫ్యూజ్ ఏర్పాటు చేస్తుండగా ప్రమాదవశాత్తు కాలు జారి 11 కేవీ విద్యుత్ లైన్‌కు కుడి చేయి తగలడంతో తీవ్ర విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. వెంటనే సహచరులు, స్థానికులు అతడిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా... అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విధి నిర్వహణలో ఉండగానే జరిగిన ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు, సహోద్యోగులు, గ్రామస్థులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. ఘటనపై సంబంధిత అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం.

### హరిహరాద్వైతం అయ్యప్ప తత్వం

మెట్రో న్యూస్ మెదక్ ప్రతినిధి. భక్తుల కల్పతరువుగా... కోరిన కోర్కెలు తీర్చే దేవుడుగా... మెదక్ అయ్యప్ప స్వామి ఆలయం విరాజిల్లుతోంది. భక్తి శ్రద్ధలకు ప్రతి రూపకంగా ఉన్న ఆలయం రజతోత్సవ వేడుకలకు సిద్ధమైంది. స్థానిక బ్రాహ్మణ వీధిలో ఉన్న ఆలయం... 2001 మే 27న అనంతసాగర్ సరస్వతీ క్షేత్ర నిర్మాత, సరస్వతీ తత్వ ప్రచారాకులు ప్రత్యక్ష పర్యవేక్షణలో అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన అత్యంత వైభవంగా జరిగింది. ఆలయం ఏర్పాటై 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రజతోత్సవ వార్షికోత్సవం, కుంభాబిషేకం నిర్వహణకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈనెల 14 నుంచి 20 వరకు విశిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సదానంద మఠాధిపతి బసవకళ్యాణ్, మదనానందపీఠాధీశ్వరులు (రంగంపేట) శ్రీశ్రీశ్రీ మాధవా నంద సరస్వతీ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణ, అష్టకాల విద్యా మనోహర్ శర్మ నిర్వహణలో మహారుద్ర పారాయణం, యజుర్వేద పారాయణం, దేవతా కళ్యాణం, పుష్పార్చన, హవనం, మహా కుంభాభిషేకం, రథోత్సవం, మహాపడి పూజ, దీపోత్సవం కార్యక్రమాలను నిర్వహించనున్నారు.ఆలయ ప్రత్యేకతలు...మెదక్ అయ్యప్ప దేవాలయంలో పంచ లోహ విగ్రహాన్ని ప్రతిష్టించారు. ఏకశిలా పదునెట్టంబడి (18 మెట్లు) కలదు. జిల్లాలో ఎక్కడ లేని విధంగా గణపతి ఆలయంలో గణపతి పంచాయతనం (శివుడు,సూర్యుడు, అంబిక, విష్ణు) విగ్రహాలను ప్రతిష్టించారు.కార్తీక మాసంలో అయ్యప్ప మాల ధరించే భక్తులు... ప్రమాణం చేసే మాల వేసుకోవాలి. మండలకాలం పాటు దీక్షను కొనసాగించాలి.ఆలయం 12వ వార్షికోత్సవం సందర్భంగా మొదటి కుంభాభిషేకం, 18వ వార్షికోత్సవం పురస్కరించుకొని రెండవ కుంభాభిషేకం వైభవంగా జరిగింది.

## మేళ్లచెరువు బఫర్ జోన్ ఆక్రమణలపై

# స్పందించిన ఇరిగేషన్ అధికారులు



(మెట్రో న్యూస్)రామచంద్రపురం:తెల్లాపూర్‌లోని మేళ్లచెరువు కట్టకు ఆనుకుని ఉన్న బఫర్ జోన్ ప్రాంతంలో మొరం మట్టి పోసి పూడ్చివేస్తున్నారనే అంశంపై మెట్రో న్యూస్ కథనానికి వివిధ పత్రికల్లో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. సంగారెడ్డి జిల్లా ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జై భీమ్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బాల గణేష్ శనివారం మేళ్లచెరువు కట్ట ప్రాంతాన్ని ప్రత్యక్షంగా సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. బఫర్ జోన్ పరిధిలో జరుగుతున్న మట్టి పూడిక పనులను గమనించిన అధికారులు సంబంధిత వ్యక్తులను పిలిపించి వివరణ కోరారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ చెరువుల బఫర్ జోన్ ప్రాంతాల్లో ఎలాంటి ఆక్రమణలు, మట్టి పూడికలు లేదా చట్ట విరుద్ధంగా నిర్మాణ కార్యకలాపాలను సహించబోమని స్పష్టం చేశారు. రెండు రోజుల్లోగా బఫర్ జోన్‌లో వేసిన మొరం మట్టి, పూడికలను పూర్తిగా తొలగించాలని ఆదేశించారు. నిర్ణీత గడువులోపు చర్యలు తీసుకోకపోతే సంబంధిత వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.చెరువుల రక్షణ, భవిష్యత్ తరాలకు నీటి వనరుల పరిరక్షణ కోసం ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని అధికారులు సూచించారు. పత్రికల ద్వారా వెలుగులోకి తీసుకువచ్చిన అంశంపై అధికారులు స్పందించి క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టడం స్థానిక ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది.ఇక అధికారులు ఇచ్చిన గడువులోపు బఫర్ జోన్ ప్రాంతం నుంచి మట్టి తొలగిస్తారా? లేక చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుంది అని అధికారులు హెచ్చరించారు.“వేచి చూద్దాం... అధికారులు ఇచ్చిన హెచ్చరిక ఎంతవరకు అమలవుతుందో!“అని సాగునీటి సంఘం మాజీ చైర్మన్ వడ్డే నరసింహులు తెలిపారు.

# రోడ్డు వెడల్పుతో మారనున్న ఖేడ్ రూపురేఖలు



మెట్రో న్యూస్,నారాయణఖేడ్: నారాయణఖేడ్ పట్టణం నుండి 50 ఫీట్ల రోడ్డు వెడల్పుతో రహదారి ఏర్పాటు వల్ల ఖేడ్ రూపురేఖలు మారనున్నాయి.నిజాంపేట్ -నారాయణఖేడ్ - బీదర్ మీదుగా సాగే జాతీయ రహదారి-161(బి)కు అనుసంధానంగా ఖేడ్ పట్టణంలో రోడ్డు విస్తరణ పనులకు రంగం సిద్ధమైంది. జహీరాబాద్ పార్లమెంటు సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్,ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ నగేష్ శెట్కార్ ల కృషితో కేంద్ర ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక విస్తరణ ప్రాజెక్టు కోసం ఏకంగా రూ.47 కోట్ల భారీ నిధులను మంజూరు చేసింది.దీంతో ఖేడ్ పట్టణంలో శాశ్వత సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు, అంతర్రాష్ట్ర రవాణాకు సుగమం కానుంది.కేంద్రం నుంచి నిధులు రావడంతో భారత జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అధికారులు క్షేత్రస్థాయిలో వేగంగా చర్యలు చేపట్టారు.రహదారి విస్తరణ కోసం ప్రణాళికలు సిద్ధం చేసిన అధికారులు, రోడ్డుకిరువైపులా 50 అడుగుల (50 ఫీట్లు) మేర స్థలాన్ని జాతీయ రహదారి ప్రమాణాలకు అనుగుణంగా గుర్తించి మార్కింగ్ వేశారు. ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ విస్తరణను చేపట్టారు.రోడ్డు విస్తరణ ప్రక్రియలో భాగంగా తమ నివాసాలు, దుకాణాలు కోల్పోతున్న స్థానికులకు ప్రభుత్వం అండగా నిలవనుంది. అధికారులు ప్రస్తుతం కోల్పోతున్న ఇండ్లు మరియు ఇతర నిర్మాణాలకు నంబర్లను కూడ వేసి ప్రక్రియను ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. నంబరింగ్ పూర్తయిన తర్వాత సమగ్ర నివేదికను రూపొందించి, బాధితులకు తగిన నష్టపరిహారం అందజేసేందుకు అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.నారాయణఖేడ్ ప్రాంతం కర్ణాటక, మహారాష్ట్ర సరిహద్దులకు అత్యంత సమీపంలో ఉండటంతో నిత్యం రద్దీగా ఉంటుంది.నియోజకవర్గానికి సుమారు పది మండలాల నుంచి ప్రజలు అనునిత్యం వేలాదిగా తరలివస్తుంటారు. దీంతో వ్యాపార, వాణిజ్య పరంగా పట్టణం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. దీంతోపాటు రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నారాయణఖేడ్ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. సంగారెడ్డి జిల్లాలో నారాయణఖేడ్ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారానికి అత్యంత ప్రాధాన్యత చోటుచేసుకుంది. జిల్లాలో ఎక్కడా లేని విధంగా నారాయణఖేడ్ పట్టణంలో వ్యాపార, వాణిజ్య సముదాయాలకు అత్యధిక అద్దె వస్తుందని స్థానికులు చెబున్నారు.సూపర్ మార్కెట్లు,షాపింగ్ కాంప్లెక్స్ లు,వ్యాపార సంస్థలు,పరిశ్రమలు నెలకొల్పేందుకు అత్యధిక అవకాశాలు ఉన్నాయి.జాతీయ రహదారి విస్తరణ పనులు పూర్తయితే పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు పూర్తిగా తీరనున్నాయి. ప్రస్తుతం నారాయణఖేడ్ పట్టణంలో ప్రతిరోజు 50 వేల వరకు ప్రయాణికులు వస్తుండడం విశేషం. కాగా సంగారెడ్డి జిల్లాలోనే అత్యధిక వేగంగా అభివృద్ధి చెందుతున్న నారాయణఖేడ్ మున్సిపల్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులు విశేషంగా కృషి చేస్తున్నారు.స్థానిక నేత అయిన జహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శెట్కార్ సొంత ప్రాంతంపై ముందుచూపుతో పనులు చేపడుతున్నారు. అదేవిధంగా నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి భవిష్యత్తు తరాలకు ఇబ్బందులు లేకుండా అభివృద్ధి పనులు చేపడుతూ ముందుకు వెళ్తున్నారు.పట్టణం చుట్టూ రింగు రోడ్డు పనులు,రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నారు. ప్రజలందరూ అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్నారని, రోడ్డు విస్తరణ పూర్తయితే నారాయణఖేడ్ వాణిజ్య పరంగా మరింత అభివృద్ధి చెందుతుందని స్థానికులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.త్వరలోనే టెండర్ల ప్రక్రియ పూర్తయి పనులు గ్రౌండ్ లెవల్‌లోకి రానున్నట్లు తెలుస్తోంది.

మెట్రో METRO EVENINGS
ఆదిలాబాద్-నిజామాబాద్
మంచిర్యాల | కామారెడ్డి
ఆసిఫాబాద్
నిర్మల్
epaper.metroevenings.com
తేది : ఆదివారం జూన్ 14 2026


# ఇసుక ట్రిప్స్ సీజ్ చేసిన ఎస్ఐ ఆవుల తిరుపతి.

వీణవంక మెట్రో న్యూస్ : జూన్ 13మండలం లోని కొండపాక గ్రామంలో 50 ఇసుక ట్రిప్పులను గుర్తించిన ఎస్ఐ ఆవుల తిరుపతి బ్లూ కోర్ట్ కానిస్టేబుల్ ఆంజనేయులు, వినీత్ లు, ఎస్ఏటీ కానిస్టేబుళ్ల సహాయం తో దాడి చేసి వాటిని సిజ్ చేశారు.సల్పుల సమ్మయ్య, అవాల గిరిబాబు నల్లగాశ శ్రీనివాస్, మేడుదుల రాజు, నాగుల రాజు ల వద్ద 50, ట్రిప్ ల ఇసుకను సీజ్ చేసి తహసీల్దార్ కు అప్పగించారు. అలాగే మానేరు వాగునుండి అక్రమంగా ఇసుక లిఫ్ట్ చేస్తున్న సల్పుల అశోక్ గోద రాజేందర్ లకు చెందిన రెండు (02) ఎస్కేవేటర్స్ ను అలాగే నాగుల సదయ్య కు చెందిన ట్రాక్టర్ ను సీజ్ చేయడం జరిగింది. అని ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

## షబ్బీర్ అలీ వ్యాఖ్యలపై

# కాంగ్రెస్ సీరియస్

కామారెడ్డి జూన్ 13 (మెట్రో న్యూస్) ఇటీవల ప్రచారంలోకి వచ్చిన ఓ ఆడియో క్లిప్ రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. మాజీ మంత్రి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ చేసినట్లుగా వైరల్ అవుతున్న వ్యాఖ్యలపై తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీరియస్ గా స్పందించింది. పార్టీ పదవులు డబ్బులకు అమ్ముడు అవుతున్నాయశీ టు కాంగ్రెస్పై విమర్శలు చేసినట్లు ప్రచారంలోకి వచ్చిన వ్యాఖ్యలతో పాటు మహిళలను కించపరిచే అంశాలు ఉన్నాయని ఆరోపణలు రావడంతో పార్టీ అధిష్టానం వివరణ కోరుతూ షబ్బీర్ అలీ కి నోటీసులు జారీ చేసినట్లు సమాచారం. ఈ వ్యవహారం పై స్పందించిన టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ షబ్బీర్ అలీ ఆరోపణలపై తొందరపడి



స్పందించవలసిన అవసరం లేదన్నారు. తన ఆస్తులు వ్యక్తిత్వం గురించి నిజామాబాద్ ప్రజలకు బాగా తెలుసు అని వ్యాఖ్యానించారు. గడ్డం చంద్రశేఖర్ రెడ్డిని స్వయంగా షబ్బీర్ అలీ ముఖ్యమంత్రి సమక్షంలో పార్టీలో చేర్పించారని గుర్తు చేశారు. ఇన్నేళ్లు రాజకీయ అనుభవం ఉన్న నాయకుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మంచిది కాదన్నారు. మహిళలను కించపరిచేలా మాట్లాడడం బాధాకరమని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా మాజీ మంత్రి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ మధ్య విభేదాలు ఉన్నాయనే ప్రచారం నేపథ్యంలో ఈ వ్యవహారం కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందని ఆసక్తికరంగా మారింది

# సర్ పై బీఎల్ఏ లకు ప్రత్యేక అవగాహన సదస్సు..

హుజూరాబాద్ ప్రతినిధి (మెట్రో న్యూస్): హుజురాబాద్ పట్టణంలో ప్రతాప సాయి గార్డెన్ లో శనివారం సర్ పై బిఎల్ఏ లకు అవగాహన సదస్సు ను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అధ్యక్షతన ముఖ్య సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే శ్రీశైలం,సుడా ఛైర్మెన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి హాజరయ్యారు.అనంతరం వారు మాట్లాడుతూ సర్ పై జాగ్రత్తగా ఉండాలని,ఓటరు నమోదు జాబితా తొలగించే,జతచేర్చే క్రమంలో అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచించారు.హుజురాబాద్ ఇకపై కాంగ్రెస్ అడ్డా అని దానికి ఉదాహరణ హుజురాబాద్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగిరిందని,సర్పంచుల స్థానంలో మొదటి స్థానం,ఎంపీలో,ఎమ్మెల్సీ లో ముందు స్థానంలో ఉన్నామని ఇకపై హుజురాబాద్ లో ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని అన్నారు.బిఆర్ఎస్ పార్టీ నాయకులు రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని,వడ్ల,మక్కల కొనుగోలుపై అబద్ధాలు చెప్పారని జమ్మికుంట మార్కెట్ లో సుమారు లక్ష క్వింటాళ్ల పై చిలుకు మక్కలు కొనుగోలు చేశామని,చివరి గింజ వరకూ కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేశామని ఇది మా ప్రభుత్వ పనితీరు అని అన్నారు.కౌశిక్ రెడ్డి ఎమ్మెల్సీగా ఏం పని చేశాడో,ఎన్ని నిధులు తీసుకొచ్చావో చెప్పే దమ్ము ఉందా అని ప్రశ్నించారు.కనీసం ఉప ఎన్నికల్లో ఇచ్చిన పనులు,ప్రొసీడింగ్స్ కూడా పూర్తి చేయలేదని ఉప ఎన్నిక తర్వాత 2న్నర సంవత్సరాల్లో వారి ప్రభుత్వమే ఉంది అయిన వారు ఇక్కడ అభివృద్ధికి నిధులు మంజూరు చేపించలేదని,ఎమ్మెల్సీగా,విప్ గా,ఎమ్మెల్యేగా హుజురాబాద్ అభివృద్ధికి తట్టెడు మట్టి కౌశిక్ రెడ్డి తీయలేదని మండిపడ్డారు.బిఆర్ఎస్ ప్రభుత్వం కంటే




కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులను ఆదుకున్నామని 10 సంవత్సరంలో చేసిన రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఒకే సంవత్సరంలో చేశామని అన్నారు.పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నీళ్లు మాయం,నిధులు మాయం,అప్పుల కుప్పగా చేశారని 2 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో రైతు సంక్షేమం,అభివృద్ధి కాంక్షించినదని అన్నారు.ఉనికి కాపాడుకోవడం కోసమే మాట్లాడుతున్నారు తప్ప ప్రజల్లో ప్రజాబలం బిఆర్ఎస్ కి లేదని అన్నారు.రైతులకు ఉచిత కరెంట్ ఇచ్చిందే కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు.రాజకీయాల కోసమే దళిత సోదరులను వాడుకున్నారని గత ప్రభుత్వం 2 ఏళ్లు అధికారంలో ఉన్నా ఎందుకు పూర్తి స్థాయిలో దళిత బంధు నిధులు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు.కౌశిక్ రెడ్డినీ ప్రజలు తిరస్కరిస్తున్నారని కాంగ్రెస్ పార్టీని ఆదరిస్తున్నారని అన్నారు.ఈ కార్యక్రమంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ సుహాసిని, వైస్ చైర్ పర్సన్ అంజలి,కౌన్సిలర్లు,వ్యవసాయ మార్కెట్ చైర్మెన్ లు,డైరెక్టర్లు,వివిధ గ్రామాల సర్పంచులు,దేవాలయ చైర్మెన్ లు,అన్ని మండలాల అధ్యక్షులు,ఉపాధ్యక్షులు,మహిళా అధ్యకురాల్లు,జిల్లా ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు,మైనారిటీ నాయకులు,సేవాదళ్, బ్లాక్ కాంగ్రెస్,అనుబంధ సంఘాలు,యువజన కాంగ్రెస్ నాయకులు,యూత్ కాంగ్రెస్ నాయకులు,సోషల్ మీడియా ఇంచార్జీలు,సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హుజూరాబాద్ కు ఎందుకు ప్రత్యేక ప్యాకేజ్ ఇవ్వలేదు?**

బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు హరీష్ రావు ఆర్థిక మంత్రిగా ఉన్న సమయంలో హుజురాబాద్ కు ఎందుకు ప్రత్యేక ప్యాకేజ్ ఇవ్వలేదని ప్రశ్నించారు ప్రణవ్.కనీసం ఉప ఎన్నికల సమయంలో స్వయంగా హరీష్ రావు ఇచ్చిన ప్రొసీడింగ్స్ వెనక్కి మళ్ళాయనీ,ఆనాడు పదేళ్లు ఉండి చేయలేదు ఇప్పుడు గెలిపిస్తే చేస్తామని ప్రజలను మభ్యపెట్టే మాటలు మానుకోవాలని హరీష్ రావుకు సూచించారు.కౌశిక్ రెడ్డి మాయలో పడి హరీష్ రావు కూడా అబద్ధాలు మాట్లాడారని,హుజురాబాద్ ప్రజలు చైతన్యవంతులనీ అన్ని గమనిస్తున్నారని అన్నారు.

## టీజీఎస్ ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం తాజా పురోగతిపై స్పష్టత

-నిజామాబాద్ రిజినల్ మేనేజర్ ఎస్ వి,జి, కె. మూర్తి



నిజామాబాద్, జూన్ 13( మెట్రోన్యూస్ )ఆర్టిసి సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలనేది కార్మికుల అందరి చిరకాల స్వప్నం అని నిజామాబాద్ రిజినల్ మేనేజర్ ఎస్ వి,జి, కె. మూర్తి అన్నారు. శనివారం నిజామాబాద్ ఆర్టిసి రీజినల్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ విలీన ప్రక్రియ అనే చారిత్రాత్మక నిర్ణయానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత సానుకూలంగా ఉందనే విషయాన్ని అందరికీ తెలియజేయడానికి ఎంతో సంతోషంగా ఉందన్నారు.గత ఏప్రిల్ సమ్మె సమయంలో ముఖ్యమైన మూడు అంశాలను ప్రభుత్వం ఏర్పాటు చేసిన క్యాబినెట్ సబ్ కమిటీ పరిశీలించి సానుకూలంగా పరిగణించిందన్నారు.ఇందులో 2021 వేతన సవరణ యూనియన్ల పునరుద్ధరణ, ఆర్టీసీ సంస్థను ప్రభుత్వం లో విలీనం చేసే అంశంపై నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు.అనంతరం ఈ ప్రక్రియను క్యాబినెట్ సబ్ కమిటీ పరిధిలోకి తెచ్చి విలీన ప్రక్రియ అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశంగా ప్రభుత్వం పరిగణిస్తోందన్నారు. ఆర్టీసీ విలీన అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసిందన్నారు.ఈ కమిటీ ఇప్పటికే ప్రత్యేకంగా సమావేశమై, విలీనానికి సంబంధించిన అన్ని సాంకేతిక, ఆర్థిక, పరిపాలనాపరమైన అంశాలపై లోతైన సమీక్ష నిర్వహించిందన్నారు.అదేవిధంగా సమ్మెకాలంలో మిగిలిన డిమాండ్లపై ఆర్టీసీ ఈడీ ల కమిటీ కార్మిక సంఘాల తో చర్చలు జరుపుతోందన్నారు.విలీన ప్రక్రియలో ప్రతి ఒక్క కార్మికుడి స్వరం వినిపించాలనేది క్యాబినెట్ సబ్ కమిటీ, యాజమాన్యం ఉద్దేశ్యమన్నారు.త్వరలో రాష్ట్రంలోని అన్ని డిపోలలో కార్మిక శాఖ పర్యవేక్షణ లో అత్యంత పారదర్శక పద్ధతిలో యూనియన్ వెరిఫికేషన్ ప్రక్రియను నిర్వహించడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు.ఈ ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా మెజార్టీ సాధించిన కార్మిక సంఘాల ప్రతినిధులను విలీన ప్రక్రియలో ప్రత్యక్ష భాగస్వాములను చేస్తామన్నారు.వారి నుంచి వచ్చే విలువైన సూచనలు, సలహాలను క్యాబినెట్ సబ్ కమిటీ పరిశీలనకు పంపి... అందరికీ ఆమోదయోగ్యం గా, నూటికి నూరు శాతం పారదర్శకంగా విలీన తుది ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. కార్మికుల భవిష్యత్తుకు భద్రత కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమన్నారు.ఎప్పటిలాగే విధులను అంకితభావంతో నిర్వహిస్తూ సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నామన్నారు.

## దేశాయిపల్లెలో స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం

### ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రజల సహకారం కోరిన ప్రజాప్రతినిధులు





తంగళ్ళపల్లి,మెట్రో న్యూస్ : ప్రధాని నరేంద్ర మోదీ 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు బండి సంజయ్ కుమార్ పిలుపుమేరకు తంగళ్ళపల్లి మండలం దేశాయిపల్లె గ్రామంలో "స్వచ్ఛ పాఠశాల" కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామ ప్రాథమిక పాఠశాలలో సర్పంచ్ కంకణాల రజిత రమేష్, వార్డు సభ్యులు మేకల సురేష్, కంకణాల చామంతి పాల్గొని విద్యార్థులు కూర్చునే టేబుళ్లు, బ్లాక్‌బోర్డు, పాఠశాల ఆవరణను శుభ్రం చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, "ప్రభుత్వ పాఠశాల ముద్దు ఉ ప్రైవేట్ పాఠశాల వద్దు" అనే నినాదంతో గ్రామ ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు అనేక సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు.స్వచ్ఛ పాఠశాల కార్యక్రమం ద్వారా పాఠశాలల్లో పరిశుభ్రత పెంపొందడంతో పాటు ప్రభుత్వ విద్యాసంస్థల పట్ల ప్రజల్లో విశ్వాసం మరింత బలపడుతుందని వారు అభిప్రాయపడ్డారు.

## వసతి గృహాలు, విద్యా సంస్థల నిర్వహణలో

# నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

-కలెక్టర్ ఇలా త్రిపాఠి

-అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండాలి

-విద్యార్థులను సొంత బిడ్డలుగా భావించాలి

-వారి భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని హితవు

-మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి










నిజామాబాద్, జూన్ 13 ( మెట్రోన్యూస్ )జిల్లాలోని అన్ని ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా విద్యార్థులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖలు, విద్యాశాఖ ఆధ్వర్యంలోని వసతి గృహాలు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల పనితీరుపై అదనపు కలెక్టర్ వి.భుజంగరావుతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆరోగ్యకరమైన, ఆహ్లాదకర వాతావరణంలో విద్యార్థులు నాణ్యతతో కూడిన విద్యను అభ్యసించేలా నిర్వాహకులు కృషి చేయాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని వసతి గృహాలు, పాఠశాలలు, కళాశాలలలో పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు దోమలు, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు జరిపించాలని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన, పౌష్టికాహారం అందించడంతో పాటు ఆహార పదార్థాల నాణ్యతపై నిరంతర పర్యవేక్షణ నిర్వహించాలని తెలిపారు. ప్రతి పాఠశాల, వసతి గృహంలో డైట్ మెనూ పట్టికను విధిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ఫుడ్ సేఫ్టీ కమిటీలు చురుకుగా పని చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.ప్రతి విద్యా సంస్థలో స్వచ్ఛమైన, రక్షిత తాగునీటి సరఫరా ఉండేలా చూడాలని, విద్యార్థుల ఆరోగ్య రక్షణ విషయంలో రాజీ పడకూదని కలెక్టర్ స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యా బోధన జరిగేలా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల్లో వంద శాతం విద్యార్థుల నమోదు జరిగేలా కృషి చేయాలని హితవు పలికారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు.

విద్యార్థులను సొంత పిల్లలుగా భావిస్తూ, వారి భద్రత, ఆరోగ్యం, సంక్షేమం, అభ్యున్నతి కోసం అంకిత భావంతో పని చేయాలని సూచించారు. ఆంగ్ల భాషలో విద్యార్థులు ప్రావీణ్యం సాధించేలా చూడాలన్నారు.బాలికల వసతి గృహాలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, మూత్రశాలలు అవసరం ఉన్నట్లయితే, ఈ నెల 20వ తేదీ లోపు వివరాలు సమర్పించాలని, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు వెంటనే నిధులు మంజూరు చేస్తామని కలెక్టర్ తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని, విద్యా సంస్థల నిర్వహణలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఆయా ప్రభుత్వ విద్యా సంస్థలలో పెండింగ్ లో ఉన్న నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని అన్నారు. ఎవరినీ ఇబ్బంది పెట్టాలన్నది తమ అభిమతం కాదని, అయితే విద్యార్థుల భద్రత, సంక్షేమం విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే మాత్రం బాధ్యులను ఉపేక్షించబోమని కలెక్టర్ స్పష్టం చేశారు. తాను ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తానని, నిర్వహణాపరమైన లోపాలు దృష్టికి వస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని అన్నారు.సమీక్షా సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, డీ.ఎస్.సీ.డీ.ఓ రజిత, జిల్లా విద్యా శాఖ అధికారి పి.అశోక్, ఆర్.సీ.ఓ కు, సంబంధిత సంక్షేమ శాఖల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, విద్యాశాఖ అధికారులు, రెసిడెన్షియల్ విద్యా సంస్థల ప్రిన్సిపాల్స్, స్పెషలాఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు

హైదరాబాద్,
ఆదివారం
జూన్ 14 , 2026

మెట్రో
గ్రేటర్ హైదరాబాద్

జిల్లాలు
హైదరాబాద్
రంగారెడ్డి
మేడ్చల్



# సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశం

**- ఆర్జీకే సమస్యలపై ఎమ్మెల్యే వివేకానంద, మాజీ కార్పొరేటర్ జగన్ పర్యటన**





**కుత్బుల్లాపూర్, జూన్ 13 (మెట్రో న్యూస్ ప్రతినిధి):**జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప (ఆర్జీకే) సదాయంలో నెలకొన్న పలు సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద, స్థానిక మాజీ కార్పొరేటర్ కొలుకుల జగన్ శనివారం కాలనీలో పర్యటించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ధర్మారపు అంజయ్య, ప్రధాన కార్యదర్శి భూపతి రెడ్డి, కాలనీ నాయకులు, స్థానిక ప్రజలతో కలిసి సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు ప్రధానంగా త్రాగునీటి సరఫరాలో ఎదురవుతున్న ఇబ్బందులు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల ఏర్పడుతున్న సమస్యలు, అలాగే జీవనోపాధి కోసం ఏర్పాటు చేసుకున్న చిరు వ్యాపారుల షాపుల తొలగింపు, సంక్షేమ సంఘం భవన నిర్మాణం,రోడ్లు తదితర అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి వివరాలు తెలుసుకున్న ఎమ్మెల్యే, మాజీ కార్పొరేటర్ సంబంధిత అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ ప్రజలకు మౌలిక వసతుల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. త్రాగునీటి కొరత, డ్రైనేజీ సమస్యలను అత్యవసరంగా పరిష్కరించి కాలనీ ప్రజలకు ఉపశమనం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సంక్షేమం విషయంలో నిర్లక్ష్యం సహించబోమని స్పష్టం చేశారు. చిరు వ్యాపారుల సమస్యపై స్పందించిన ఎమ్మెల్యే, ఉపాధి కోసం చిన్న చిన్న షాపులు నిర్వహిస్తున్న వ్యాపారులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా వారి జీవనోపాధి దెబ్బతినకుండా పరిష్కారం చూపాలని కోరారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ త్రాగునీరు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపడతామని, అలాగే చిరు వ్యాపారుల సమస్యను సానుకూలంగా పరిశీలించి వారికి ఇబ్బందులు కలగకుండా చూడటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, మహిళలు, చిరు వ్యాపారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## యువత చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరచాలి : ఎమ్మెల్యే



**మెట్రో న్యూస్, కేపీహెచ్‌బీ కాలనీ :** యువత చదువుతోపాటు క్రీడలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నియోజకవర్గం పరిధి కేపీహెచ్‌బీ కాలనీలోని అల్లూరి సీతారామరాజు స్పోర్ట్స్ గ్రౌండ్ లో క్షత్రియ క్రీడోత్సవం కమిటీ వారు డి.వి.ఎస్ వర్మ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వాలీబాల్, టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్ ను ఎమ్మెల్యే కృష్ణారావు శనివారం ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడా పోటీలు ఏర్పాటు చేసిన క్షత్రియ క్రీడోత్సవ కమిటీని అభినందించారు. యువత చదువుతోపాటు క్రీడలపై ఆసక్తిని కనబరచాలని, అలాగే తల్లితండ్రులు పిల్లల అభిరుచికి తగ్గట్లుగా ప్రతి రోజు గంట సమయం క్రీడలలో పాల్గొనే విధంగా చూడాలని సూచించారు. మానసిక ఉల్లాసంతోపాటు శరీర ధారుడ్యానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని చెప్పారు. ప్రతిఒక్కరూ వయసుతో సంబంధం లేకుండా వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, పి.బాబురావు, ఎస్.శ్యామలరాజు, మైనర్ రాజు, డిఎస్ రాజు, భీమరాజు, వెంకటేశ్వరరాజు, ఎస్.ఆర్.స్పోర్ట్స్ సభ్యులు, క్షత్రియ యూత్ ఫెడరేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**మెట్రో న్యూస్,గడ్డిఅన్నారం:** భారతీయ జనతా పార్టీ చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలోని బూత్ నంబర్లు 531, 532, 533లలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు దాసరి జయప్రకాశ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బీజేపీ నాయకుడు బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా కీలక పాత్ర పోషిస్తుందని, ప్రతి అర్హ పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడం అత్యంత అవసరమని అన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ద్వారా ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించే అవకాశం లభిస్తోందని పేర్కొన్నారు. పార్టీ కార్యకర్తలు ఎస్ ఐఆర్ కార్యక్రమాన్ని కేవలం ఎన్నికల సంఘం కార్యక్రమంగా కాకుండా ప్రజా చైతన్య కార్యక్రమంగా భావించి ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్‌లో సమగ్ర సమీక్ష నిర్వహించి, ఒక్క అర్హ ఓటరు కూడా జాబితా వెలుపల ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. గడ్డిఅన్నారం డివిజన్‌లోని అన్ని బూత్‌లలో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బీజేపీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజలకు అందుబాటులో ఉంటూ అవసరమైన సహకారం అందించాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు లోకేష్, సతీష్, వంశీ యాదవ్, సాయి, కార్తీక్, కౌశిక్, టీంకు, గిరీష్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధిని అడ్డుకోవడం తప్ప సర్కార్ చేసిందేమీ లేదు : ఎమ్మెల్యే



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** అభివృద్ధికి నిలయమైన కూకట్‌పల్లిని మూడు ముక్కలు చేయడం తప్ప రెండున్నరేళ్లలో కాంగ్రెస్ సర్కార్ చేసిందేమీ లేదని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. అల్లాపూర్ డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో శనివారం పర్యటించి పలు సమస్యలు తెలుసుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. గతంలో ఎక్కడికక్కడ రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, పార్కులు వంటి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామని చెప్పారు. సున్నం చెరువు నుంచి మైసమ్మ చెరువు అభివృద్ధికై రూ.69 కోట్ల నిధులు మంజూరు చేసి మూడు మూడేళ్లైన అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. భరత్ నగర్ వరకు రూ.31 కోట్లతో నాలా అభివృద్ధి పనులను అటకెక్కించారని ఆవేదన వ్యక్తం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకై మళ్ళీ అప్లికేషన్ పెట్టుకోవాలని, గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు 31 వేలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ప్రతి నిరుపేదకు డబుల్ బెడ్ రూమ్ అందేలా చర్యలు తీసుకుంటానని, ఎస్ఐఆర్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటును కాపాడుకోవాలన్నారు. ఓటు ప్రతి పౌరుని హక్కు అని, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్న ఓటు పోయే అవకాశం ఉందని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సబిహా గౌసుద్దీన్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మొహమ్మద్ గౌసుద్దీన్, డివిజన్ అధ్యక్షులు లింగాల ఐలయ్య, తిరుపతి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

## నిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**- సమాచార హక్కు చట్టం కమిషనర్ నుంచి ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కార్యాలయానికి నోటీసు**



**మెట్రోన్యూస్,ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా జిల్లాలోని ఆదిభట్ల మున్సిపాలిటీలో ఏర్పాటుచేసిన సమావేశంలో సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్ ముదిరాజ్ పాల్గొని మాట్లాడుతూ... ఆర్టిఏ సమాచారం కింద గత సంవత్సరం ఆగస్టు 13న ఉస్మానియా జనరల్ హాస్పిటల్ నందు ఎమర్జెన్సీ విభాగంలో ఒక నెలకు సంబంధించిన రోజువారి క్యూ రిజిస్టర్ పూర్తి వివరాల గూర్చి,అలాగే మెడికో లీగల్ రిజిస్టర్ వివరాలు కూడా కావాలని,5 అంశాల గురించి సమాచారం కోసం దరఖాస్తు చేశాగ,ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. 11-11-2025 నాడు మొదటి అప్పీల్ చేశాను. తర్వాత ఉస్మానియా జనరల్ హాస్పిటల్‌నుంచి ఎలాంటి పూర్తి సమాచారం ఇవ్వకుండా కొంతమేరసమాచారంమాత్రమే అందించారన్నారు. దింతో రెండవ అప్పీల్ చేశాను. సమాచార హక్కు చట్టం కమిషనర్ నుంచి ఉస్మానియా జనరల్ హాస్పిటల్ కార్యాలయ పౌర సమాచార అధికారికి,అప్పీలేట్ అధికారికి సమాచార హక్కు చట్టం కమిషనర్ ముందర హాజరుకావాలని నోటీస్ అందింది. కేసు నెంబర్ : 3533/-/2026 సమాచారహక్కుచట్టాన్నినిర్లక్ష్యం చేస్తున్న అధికారులపై చట్ట ప్రకారంగా చర్యలుతీసుకోవాలనిడిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సురేందర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కాకి లక్ష్మణ్, నల్గొండ జిల్లా అధ్యక్షులు మనోహర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## అక్రమ అబార్షన్ కేంద్రంపై పోలీసుల దాడి

**- ఇద్దరి అరెస్ట్ కోర్టులో హాజరు**




**మెట్రో న్యూస్, నాగోల్:** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని జైపురి కాలనీలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న ఓ ఫస్ట్ ఎయిడ్ సెంటర్‌లో అక్రమంగా గర్భస్రావాలు (అబార్షన్లు) నిర్వహిస్తున్నారనే సమాచారంపై పోలీసులు నిర్వహించిన డెకాయ్ ఆపరేషన్‌లో ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన నిందితులను న్యాయమూర్తి ముందు హాజరుపరిచినట్లు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మక్బుల్ జానీ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం, జైపురి కాలనీ రోడ్ నెంబర్-2లోని ఓ భవనంలో బండారు వెంకట లక్ష్మి కేసరి ఫస్ట్ ఎయిడ్ సెంటర్ పేరిట కేంద్రాన్ని నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. విశ్వసనీయ సమాచారం మేరకు అక్కడ అనుమతులు లేకుండా గర్భస్రావాలు నిర్వహిస్తున్నారనే అనుమానంతో ఎస్వోటీ ఎల్బీనగర్ బృందం, నాగోల్ పోలీసులు సంయుక్తంగా డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు. దర్యాప్తులో భాగంగా గర్భిణీ మహిళగా ఓ మహిళా కానిస్టేబుల్‌ను కేంద్రానికి పంపగా, అక్కడ ఉన్న వీర రేవతి అనే మహిళ వైద్య అర్హతలు మరియు సంబంధిత అనుమతులు లేకుండానే గర్భస్రావం నిర్వహించేందుకు సిద్ధమైనట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిపారు. గర్భిణీలను స్కానింగ్ కేంద్రాలకు పంపించి నివేదికల ఆధారంగా గర్భస్రావాలు చేస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు సమాచారం. డెకాయ్ ఆపరేషన్ సందర్భంగా మహిళా కానిస్టేబుల్ వద్ద నుంచి రూ.10 వేల నగదు తీసుకుని, కొన్ని ప్రాథమిక పరీక్షల అనంతరం గర్భస్రావం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్న సమయంలో పోలీసు బృందం అక్కడికి చేరుకుని తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా వైద్య పరికరాలు, మందులు, రికార్డులు మరియు ఇతర ఆధారాలను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. అనుమతులు లేకుండా వైద్య సేవలు అందించడం, అక్రమ గర్భస్రావాల నిర్వహణ, సంబంధిత చట్టాల ఉల్లంఘన తదితర అంశాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు వైద్య సేవల కోసం ప్రభుత్వం గుర్తింపు పొందిన ఆసుపత్రులు, అర్హత కలిగిన వైద్యులను మాత్రమే సంప్రదించాలని, అనధికారిక వైద్య కేంద్రాలను ఆశ్రయించడం వల్ల ఆరోగ్యపరమైన ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉందని పోలీసులు సూచించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారగా, అక్రమ వైద్య కేంద్రాలపై మరింత కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ఉపాధి హామీ కూలీలతో మంత్రి పొన్నం మాట ముచ్చట



**హుస్నాబాద్,(మెట్రో న్యూస్ ):** ఉపాధి హామీ కూలీలతో బీసీ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముచ్చటించారు. శనివారం హుస్నాబాద్ నుండి కరీంనగర్‌కు వెళ్తున్న సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మార్గమధ్యంలో ఉపాధి హామీ పథకం కింద పనులు నిర్వహిస్తున్న కూలీలను కలిసి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల పురోగతి, పనుల నిర్వహణ విధానం, వేతనాల చెల్లింపులు, పని పరిస్థితులు తదితర అంశాలపై కూలీలతో మాట్లాడారు. పనులు చేస్తున్న ప్రదేశాలనుపరిశీలించినమంత్రి,కూలీలుఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందులను తెలుసుకుని వాటి పరిష్కారానికి సం బంధిత అధికారులకు తగిన సూచనలు చేశారు. ఉపాధి హామీ పథకం గ్రామీణ పేద కుటుంబాలకు ఉపాధి కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వం కూలీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా పథకం అమలుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

## జేఎన్టీయూహెచ్ నూతన రిజిస్టర్‌గా డాక్టర్ ఏ.జయలక్ష్మి నియామకం



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** కూకట్‌పల్లిలోని జేఎన్టీయూహెచ్ నూతన రిజిస్టర్‌గా డాక్టర్ ఏ.జయలక్ష్మి నియమితులయ్యారు. యూసీఈఎస్ టీహెచ్ లోని ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ (ఈఈఈ) విభాగం యొక్క ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ ఎ.జయలక్ష్మి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరా బాద్‌కు రిజిస్ట్రార్‌గా నియమితులయ్యారు. గత 54 సంవత్సరాల జెఎన్టియుహెచ్ చరిత్రలో మొట్టమొదటిసారిగా మహిళా రిజిస్టర్ గా డాక్టర్ ఏ.జయలక్ష్మి నియమితులు కావడం విశేషం. గతంలో ఇదే జేఎన్టీయూ క్యాంపస్‌లో ఆమె ప్రిన్సిపల్‌గా, తదనంతరం డైరెక్టర్‌గా పని చేసి విధులను సమర్థవంతంగా నిర్వహించి పలువురి ప్రశంసలు అందుకున్నారు. కాగా యూసీఈఎస్‌టీహెచ్ లోని సెంటర్ ఫర్ నానో సైన్స్ అండ్ టెక్నాలజీ యొక్క నానో టెక్నాలజీ ప్రొఫెసర్ డా.కె.వెంకటేశ్వరరావు నుండి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జెఎన్టియు అధ్యాపక బృందం, పలువురు విద్యా ప్రముఖులు డాక్టర్ జయలక్ష్మికి శుభాకాంక్షలు తెలిపారు.

## మహిళ మెడలోని బంగారు గొలుసు అపహరణ

**- ఘటనకు పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తి**




**మెట్రో న్యూస్, నాగోల్:** నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సాయినగర్ కాలనీలో ఓ వృద్ధ మహిళ మెడలోని బంగారు గొలుసును గుర్తు తెలియని వ్యక్తి అపహరించిన ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, సాయినగర్ కాలనీ రోడ్ నంబర్-2లో నివాసముంటున్న పాశం శ్యామల (65) శుక్రవారం తెల్లవారుజామున తన ఇంటిలో నిద్రిస్తుండగా ఉదయం సుమారు 4 గంటల సమయంలో ఓ వ్యక్తి ఇంటి తలుపు తట్టిన ట్లు తెలుస్తోంది. నిందితుడిని గుర్తించి పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రజలు అపరిచిత వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ము ఖ్యంగా తెల్లవారుజామున లేదా రాత్రి వేళల్లో తలుపులు తెరవడా నికి ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు.

## ట్రాఫిక్ రహిత సమాజం కోసం కృషి : అరెకపూడి గాంధీ



**మెట్రో న్యూస్, కూకట్‌పల్లి :** ఉషా ముళ్ళపూడి కమాన్ నుంచి గాజులరామారం వరకు ఎల్లమ్మబండ ప్రధాన రహదారి 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనుల్లో వేగం పెంచాలని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. ఎల్లమ్మబండ ప్రధాన రహదారిలో జరుగుతున్న 100 ఫీట్ రోడ్డు విస్తరణ పనులను తాజా మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తో కలిసి గాంధీ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిత్యం ట్రాఫిక్ సమస్యలతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నందున ట్రాఫిక్ సమస్య పరిష్కారానికై 100 ఫీట్ రోడ్డు విస్తరణ చేపట్టామన్నారు. రోడ్డు విస్తరణలో అడ్డంకులను అధిగమించి పనులు కొనసాగిస్తామని చెప్పారు.

ఆంధ్ర వార్తలు మెట్రో
ఆదివారం,
14 జూన్ 2026

- 15, 16వ తేదీల్లో రెండు రోజుల పాటు పర్యటన
- 2026 సీఐఐ పెట్టుబడుల సన్నాహక రోడ్ షోలో పాల్గొననున్న సీఎం
- సింగపూర్ ప్రధాని, మంత్రులు, పారిశ్రామికవేత్తలతో సీఎం బృందం వరుస భేటీలు

# సింగపూర్‌లో పర్యటించనున్న చంద్రబాబు

అమరావతి, జూన్ 13: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల పాటు సింగపూర్‌లో పర్యటించనున్నారు. 14 తేదీ ఉదయం 11.35 గంటలకు బెంగళూర్ నుంచి సీఎం సింగపూర్ బయల్దేరి వెళ్లనున్నారు. సింగపూర్ చేరుకున్న అనంతరం 15వ తేదీన సింగపూర్ కాలమానం ప్రకారం ఉదయం 10.30 గంటలకు ఆ దేశంలోని భారత హై కమిషనర్ శిల్పక్ అంబులేతో మొదటగా సీఎం సమావేశం అవుతారు. పర్యటనలో తొలిరోజు స్టార్టప్ వెంచర్ కాపిటలిస్టులతో జరిగే రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుకు సీఎం హాజరవుతారు. అనంతరం యూఎన్ హాబిటాట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనాక్లాడియా రాస్ బాచ్ తో విందు సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. సింగపూర్ సీనియర్ మంత్రి లో యెన్ లింగ్‌తో సమావేశం అవుతారు. తర్వాత గూగుల్ క్లౌడ్ ఏపీఏపీ అధ్యక్షుడు కరణ్ భజ్వా, జీఐసీ ఎగ్జిక్యూటివ్ కమిటీ అడ్వైజర్ లిమ్ సియాంగ్ గౌన్‌తో చర్చిస్తారు. వైసీహెచ్ లాజిస్టిక్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ రాబర్ట్ యాప్‌తోనూ, నేషనల్ యూనివర్శిటీ ఆఫ్ సింగపూర్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ టాన్ యెంగ్ చెయ్‌తో భేటీ అవుతారు. సింగపూర్ ప్రధానమంత్రి లారెన్స్ వాంగ్‌తోనూ పలు అంశాలపై చర్చిస్తారు. సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తోనూ భేటీ అవుతారు. సీఐఐ ఆంధ్రప్రదేశ్ ప్రతినిధి బృందంతోనూ సమావేశం అవుతారు. హోం మంత్రి కె షణ్ముగమ్, మానవ వనరుల శాఖ మంత్రి టాన్ సీ లెంగ్‌తో చివరిగా భేటీ అవుతారు. రెండవ రోజు పర్యటనలో భాగంగా 16వ తేదీ ఉదయం కాకతీయ కల్చరల్ అసోసియేషన్ సీబీఎన్ 361ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు. ఏపీఏసీ సెమికండక్టర్ రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొంటారు. సుర్బానా జురాంగ్-అమరావతి ప్లానింగ్ సమావేశానికి హాజరవుతారు. అనంతరం సింగపూర్ ఉప ప్రధానమంత్రి, వాణిజ్య మంత్రి గాన్ కిమ్ యాంగ్ బృందంతో సమావేశం అవుతారు. తర్వాత 'వరల్డ్ సిటీస్ సమ్మిట్' లీడర్షిప్ ప్లీనరీలో పాల్గొని ప్రసంగిస్తారు. తర్వాత వరల్డ్ సిటీస్ సమ్మిట్ ఎగ్జిబిషన్ సందర్శిస్తారు. సింగపూర్ పెవిలియన్, ఇన్నోవేటర్ల అలయ్, గూగుల్ టెక్నాలజీస్ స్టాల్స్ ప్రధానంగా పరిశీలిస్తారు. సీట్రియమ్ సమావేశంలోనూ పాల్గొంటారు. పర్యటనలో చివరిగా సీఐఐ పార్టనర్షిప్ సమ్మిట్ 2026 బిజినెస్ రోడ్ షోలో పాల్గొంటారు. సింగపూర్ పర్యటనకు ముఖ్యమంత్రి వెంట పురపాలక శాఖ మంత్రి నారాయణ, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి సురేశ్ కుమార్, ఈడీబీ సీఈఓ షన్మోహన్, సీఆర్డీఏ అధికారుల బృందం కూడా వెళ్లనుంది. రాజధాని అమరావతి నిర్మాణ ప్రాజెక్టులు సహా రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించేందుకు సీఎం బృందం సింగపూర్ లో పర్యటించనుంది. 16 తేదీ రాత్రి 10 గంటలకు ముఖ్యమంత్రి స్వదేశానికి తిరిగి రానున్నారు.

# విశాఖలో సీఎం చంద్రబాబు, లోకేశ్ పేర్లతో సైబర్ మోసాలు!



ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో ఒక షాకింగ్ సైబర్ మోసం వెలుగులోకి వచ్చింది. ఏకంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్లను వాడుకుంటూ సైబర్ నేరగాళ్లు ఈ ఘరానా మోసానికి తెరలేపారు. సాంకేతికతను డీప్‌ఫేక్ ఉపయోగించి, వారు మాట్లాడుతున్నట్లే నకిలీ వీడియో కాల్స్ సృష్టించి ఒక అమాయక వ్యక్తిని బురిడీ కొట్టించారు.

నగరంలోని సీతంపేట ప్రాంతానికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి కొంతకాలంగా ఒక భూ వివాదంతో ఇబ్బంది పడుతున్నాడు. దీనిని ఆసరాగా చేసుకున్న సైబర్ కేటుగాళ్లు.. తాము ప్రభుత్వ పెద్దలమంటూ అతడిని సంప్రదించారు. సాంకేతికత సాయంతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ తరహాలోనే హావభావాలు ఉండేలా వీడియో కాల్స్ చేసి, సదరు భూ వివాదాన్ని తామే స్వయంగా పరిష్కరిస్తామని బాధితుడికి పక్కాగా నమ్మబలికారు. వారి మాటలను నిజమని నమ్మిన శ్రీనివాస్‌రెడ్డి, వారు అడిగినట్లుగా విడతల వారీగా దాదాపు రూ.80 వేల వరకు డబ్బులు చెల్లించాడు.

డబ్బులు తీసుకున్న తర్వాత కూడా పని కాకపోవడం, అవతలి వారి ప్రవర్తనపై అనుమానం రావడంతో బాధితుడు తాను దారుణంగా మోసపోయానని గ్రహించాడు. ఏఐ టెక్నాలజీతో తనను నమ్మించి సైబర్ దొంగలు డబ్బులు గుంజారని తెలుసుకుని విశాఖపట్నం సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. ఈ హైటెక్ నేరానికి పాల్పడిన నిందితులను పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశారు.



# తప్పుడు ప్రచారాలు మానుకోవాలి



అమరావతి, జూన్ 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ రాజధాని అమరావతి నిర్మాణాలపై వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి మంత్రి నారాయణ (ఞూ వీఅఅఅరవతీ ఛీుతీుఋుఋు) (స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. అమరావతి హ్యాపీనెస్ట్ గృహాల నిర్మాణ వ్యయం కేంద్ర ప్రాజెక్టుల కంటే తక్కువని స్పష్టం చేశారు. హ్యాపీనెస్ట్ గృహాల నిర్మాణ వ్యయం చదరపు అడుగుకు రూ.3,393 మాత్రమే ఖర్చు అవుతోందని వివరించారు. అమరావతిలో మంత్రి ఈరోజు (శనివారం) పర్యటించారు. అమరావతిలో కొండవీటి వాగు.. పాల వాగులపై నిర్మిస్తున్న వంతెన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడారు. కేంద్ర నివాస సముదాయాల వ్యయం చదరపు అడుగుకు రూ.3,945 ఖర్చు చేస్తున్నట్లు మంత్రి నారాయణ వివరించారు. గెజిటెడ్ అధికారుల నివాసాల కోసం రూ.1003 కోట్లతో టెండర్ వేయగా చదరపు అడుగుకు రూ.3,684 మాత్రమే ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. సెంట్రల్ గవర్నమెంట్ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌కి రూ.1234 కోట్లతో టెండర్ వేయగా, చదరపు అడుగుకు రూ3,945 ఖర్చు చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. రాజధాని అభివృద్ధిలో భాగంగా సీఆర్డీఏ ఆధ్వర్యంలో వాగులపై 43 వంతెనలు, ఎల్పీఎస్ లేఅవుట్లలో మరో 26 వంతెనలు నిర్మాణంలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ వివరాలు తెలుసుకున్న తర్వాత అయినా ప్రతిపక్ష నేత అమరావతి నిర్మాణాలపై అసత్య ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు.

అమరావతిలో 69 వంతెనల నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని మంత్రి నారాయణ తెలిపారు. వర్షాకాలం దృష్ట్యా నీటి ప్రవాహానికి ఆటంకాలు తొలగించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వంతెనల వద్ద మట్టి, తాత్కాలిక కట్టలు తొలగించాలని అధికారులకు సూచించారు. కొండవీటి వాగు, పాలవాగు, గ్రావిటీ కాలువల పనులపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని దిశానిర్దేశం చేశారు. అవసరమైతే జేసీబీలతో వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వచ్చే ఏడాది నాటికి ఎక్కువశాతం వంతెనల పనులు పూర్తి కానున్నాయని మంత్రి నారాయణ వివరించారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాదం 15 మందిపై వేటు



విశాఖపట్నం (వైజాగ్) స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల జరిగిన వరుస ప్రమాదాలను తీవ్రంగా పరిగణించిన యాజమాన్యం, బాధ్యులపై కఠిన చర్యలు చేపట్టింది. ఈ నిర్లక్ష్యానికి కారణమైన 15 మంది ఉద్యోగులు, అధికారులను తక్షణమే సస్పెండ్ చేస్తూ సంచలన నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా, అంతర్గత విచారణలో భాగంగా మరో 19 మందిని ఇతర విభాగాలకు బదిలీ (ట్రాన్స్‌ఫర్) చేసింది. ప్లాంట్‌లో వరుసగా జరుగుతున్న ఈ ప్రమాదాలపై కార్మిక సంఘాలు, స్థానికుల నుంచి పెద్ద ఎత్తున నిరసనలు వ్యక్తమవడంతో స్పందించిన యాజమాన్యం, భద్రతా లోపాలకు తావులేకుండా ఉండేందుకు ఈ దిశగా కఠినమైన చర్యలకు పూనుకుంది.


# కేసు నమోదు..



అమరావతి, జూన్13: మాజీ ఎంపీ కేశినేని నానిపై పోలీసు కేసు నమోదైంది. తనపై సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారం చేస్తున్నారని ఎంపీ కేశినేని చిన్ని పోలీసులకు ఫిర్యాదు చేశారు. గత ఏడాది ఉర్సా క్లస్టర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో అక్రమంగా తాను లబ్ధి పొందుతున్నట్లు నాని బహిరంగ లేఖ విడుదల చేశారని చిన్ని తన ఫిర్యాదులో పేర్కొన్నారు. బినామీ పేర్లతో ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నట్లు నాని చేసిన ఆరోపణలపై గతంలో చిన్ని లీగల్ నోటీసులు పంపారు.

ఆ లీగల్ నోటీసులకు నాని రిప్లై ఇవ్వకపోగా తనపై దుష్ప్రచారం చేస్తున్నారంటూ కేశినేని చిన్ని పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు పటమట పోలీసులు U/s 204, 351, 352, 353, 356, 61 దీఘీ అండ్ 66, 66(C ),66(D),67,72 IT యాక్ట్ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోంది.

# యూరియా పంపిణీలో తారతమ్యాలు చూడం అందరూ సమానమే



వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి

నెల్లూరు, జూన్ 13: ఏపీలో యూరియా కొరత ఉందంటూ రైతుల్లో అపోహలు సృష్టిస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. యాప్ ద్వారా సప్లై చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని తెలిపారు. యూరియా సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎకరాకి 3.5 బస్తాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని వెల్లడించారు. రైతులు ఆందోళన చెందవద్దని.. యూరియా కొరత లేదని స్పష్టం చేశారు. ఇప్పటికే 4500 మెట్రిక్ టన్నుల యూరియా సప్లై చేశామని.. 2500 టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు.

మొన్న పెట్రోల్, డీజిల్ కొరత అని ప్రచారం చేశారని.. ఇప్పుడు యూరియా కొరత అంటూ జాబ్ లేని ప్రతిపక్ష నేతలు ప్రచారం చేస్తున్నారంటూ ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. యూరియా పంపిణీలో తారతమ్యాలు చూడమని.. అందరూ సమానమే అని చెప్పుకొచ్చారు. ఆరుసార్లు ఎమ్మెల్యే అయిన నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డిని కోవూరు ప్రజలు తరిమికొట్టారన్నారు. ప్రజల తీర్పు మరోసారి స్థానిక ఎన్నికల్లో తేలుతుందని తెలిపారు. డీఎస్సీ గురించి వైసీపీకి ఏమీ తెలీదని.. అందుకే టీచర్లు టీడీపీని గెలిపించారని అన్నారు. తాము రాజకీయాల్లోకి దోచుకోవడానికి రాలేదన్నారు. అసలు ప్రసన్నకు వైసీపీలో టికెట్ దొరుకుతుందో లేదో చూసుకోవాలని వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి వ్యాఖ్యానించారు.

# సూపర్ సిక్స్... అట్టర్ ఫ్లాప్



అమరావతి, జూన్ 13: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అట్టర్ ఫ్లాప్‌గా మిగిలాయని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యానించారు. కూటమి రెండేళ్ల పాలనపై శుక్రవారం ఎక్స్ వేదికగా ఆమె తన అభిప్రాయాన్ని వెల్లడించారు. "రెండేళ్ల కూటమి పాలనంతా 'అప్పులు ఫుల్లు... అభివృద్ధి నిల్'... 'ప్రచారం పీక్స్... పాలన వీక్' అన్నట్లుగా ఉంది. పాలనంతా మాయాబజార్‌లా ఉంది. రాష్ట్ర పునర్నిర్మాణం జరగలేదు. పునరంకితానికీ దిక్కులేదు. ఉద్ధరిస్తారని అధికారమిస్తే రాష్ట్ర ప్రజలకు పెద్ద పంగనామాలు పెట్టింది. గంపెడు హామీలు ఇచ్చి చిటికెడు అమలు చేసింది. విజయోత్సవ సభలు పెట్టడానికి కూటమి నేతలకు సిగ్గుండాలి' అని షర్మిల విమర్శించారు.

# రాష్ట్రంలో కార్మికుల కోసం లేబర్ అడ్డాలు



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అసంఘటిత రంగ కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సరికొత్త నిర్ణయం తీసుకుంది. ప్రతిరోజూ ఉపాధి కోసం కూడళ్ల వద్ద వేచి చూసే రోజువారీ కూలీలు, కార్మికుల కోసం ప్రత్యేకంగా 'లేబర్ అడ్డాలను' (కార్మిక కేంద్రాలు) ఏర్పాటు చేయనున్నట్లు కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రకటించారు. ఉపాధి వేటలో ఎండ, వాన అనక రోడ్లపై నిలబడే కార్మికులకు ఒక నిర్దిష్టమైన, సురక్షితమైన స్థానాన్ని కల్పించడమే ఈ ప్రాజెక్ట్ యొక్క ముఖ్య ఉద్దేశం. ఇందులో భాగంగా ప్రాథమిక దశలో (పైలట్ ప్రాజెక్ట్) రాష్ట్రవ్యాప్తంగా 25 ప్రధాన కేంద్రాలను ఎంపిక చేసి ఈ లేబర్ అడ్డాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.

ఈ కార్మిక కేంద్రాలను మరింత ప్రయోజనకరంగా మార్చేందుకు ప్రభుత్వం వీటిని ప్రతిష్టాత్మక 'అన్న క్యాంటీన్లతో' అనుసంధానం (లింక్) చేయనుంది. దీనివల్ల ఉదయాన్నే పనుల కోసం వచ్చే పేద కార్మికులకు అతి తక్కువ ధరకే నాణ్యమైన, పౌష్టికాహారం లభిస్తుంది. అంతేకాకుండా, ఈ లేబర్ అడ్డాల పరిధిలో కార్మికులకు అవసరమైన తాగునీరు, శుభ్రమైన వాష్‌రూమ్స్ (మరుగుదొడ్లు) వంటి కనీస ప్రాథమిక వసతులను ప్రభుత్వం కల్పించనుంది. కేవలం వసతులే కాకుండా, కార్మికుల్లో వృత్తి నైపుణ్యాలను పెంచేందుకు వీలుగా శిక్షణ కార్యక్రమాలను, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన సదస్సులను కూడా ఇక్కడే నిర్వహించనున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

# యువతకు భారీ ఉద్యోగ అవకాశాలు



మంత్రి భరత్

కర్నూలు, జూన్ 13 : ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని ఏపీ మంత్రి టీజీ భరత్ గుప్తా వ్యాఖ్యానించారు. ఈ పార్కుల ద్వారా వేలాదిమందికి ఉద్యోగాలు దక్కుతాయని పేర్కొన్నారు. ఈరోజు(శనివారం) మంత్రి భరత్ కర్నూల్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. 19 కంపెనీల్లో 1460 ఉద్యోగాలకు జాబ్‌మేళా నిర్వహించామని తెలిపారు. ఒక్కరికి ఉద్యోగం వస్తే ఆ కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళా నిర్వహిస్తామని వివరించారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

# నాణ్యమైన వైద్య సేవలు



మంత్రి సత్యకుమార్

విజయవాడ, జూన్ 13: అన్ని ప్రాంతాల్లో అభివృద్ధి, అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను కూటమి ప్రభుత్వం అందిస్తోందని మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. నిన్న(శుక్రవారం) తిరుపతిలో జరిగిన బహిరంగ సభలో ఇదే విషయాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చెప్పారన్నారు. రెండేళ్లలో ఆరోగ్య శాఖ పరంగా చేసిన అభివృద్ధి, ప్రణాళికలను ప్రజలకు చెబుతున్నామని తెలిపారు. అన్ని వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ఓపీ సేవల నుంచి వైద్య సేవల వరకు అన్నింటిలో సరికొత్త మార్పులు తెచ్చామని తెలిపారు. ఎవరు ఆస్పత్రికి వచ్చినా ఆ రికార్డును డిజిటల్ చేశామన్నారు.

రెండేళ్లలో హెల్త్ సెక్టార్‌లో గణనీయమైన మార్పులు తెచ్చామని మంత్రి తెలిపారు. ప్రజలు ఈ సేవల ద్వారా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని గొప్పగా చెబుతున్నామన్నారు. ఇందుకు సహకారం అందజేసిన అధికారులందిరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఆరోగ్య శాఖలో కిందిస్థాయి నుంచి పై స్థాయి వరకు పని చేస్తున్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. నేడు ప్రజల్లో సంతృప్తికరమైన వాతావరణం నెలకొల్పామన్నారు.







# మెరిసిపోయే తీగల నెక్లెస్!

నగలంటే మెచ్చని మగువలు ఎవరుంటారు? అయితే, కాలంతో పాటు వాళ్ల అభిరుచులూ మారుతుంటాయి. అలా నేటి ఆధునిక మహిళలు క్లాసిక్ డిజైన్తో పాటు కాంటెపరరీ లుక్ని తెచ్చే రకాల్నే ఎక్కువగా ఇష్టపడుతున్నారు.నగలంటే మెచ్చని మగువలు ఎవరుంటారు? అయితే, కాలంతో పాటు వాళ్ల అభిరుచులూ మారుతుంటాయి. అలా నేటి ఆధునిక మహిళలు క్లాసిక్ డిజైన్తో పాటు కాంటెపరరీ లుక్ని తెచ్చే రకాల్నే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అందుకే, తయారీదారులు కూడా ఆభరణాల డిజైన్లలో ఎన్నెన్నో ప్రయోగాలు చేస్తున్నారు. అలా సరిగ్గా వాళ్ల అభిరుచికి అద్దం పట్టేలా ఇప్పుడో ట్రెండ్ సందడి చేస్తోంది. అదే ‘ఇన్విజబుల్ మల్టీ(స్టాండ్స్ హస్లీ, నాలుగైదు వరుసల్లో సన్నటి బంగారు తీగలు కనీకనిపించకుండా ఉంటే.. పెండెంట్ మాత్రం కుందన్లు, రాళ్లు, రత్నాలతో ధగధగలాడిపోతుంది. డ్రెస్ల మీదకైనా, చీరలకు మ్యాచింగ్గా అయినా సరే భలేగా నప్పేస్తున్నాయి ఇవి. హెవీగా ఉండే పాత నెక్లెస్లకు ప్రత్యామ్నాయంగా ఫ్యూజన్ లుక్ని తెచ్చిపెడుతున్నాయి. వాటినోసారి మీరూ చూసేయండి.

# చర్మ సంరక్షణ కోసం...



పంచదారతో..

గిన్నెలో రెండు కప్పుల పంచదార, పావుకప్పు బాదం నూనె, టీ స్పూన్ పెప్పర్మింట్ నూనె వేసి బాగా కలుపుకోవాలి. ఒకవేళ ఈ మిశ్రమం మరీ జారుడుగా ఉన్నట్లు కనిపిస్తే ఇంకాస్త పంచదార వేసి కలుపుకోవచ్చు. ఈ మిశ్రమాన్ని గాజు సీసాలో భద్రపరచుకొని నెల రోజుల పాటు ఉపయోగించుకోవచ్చు. రోజూ స్నానం చేయడానికి ముందు ఈ మిశ్రమంతో శరీరాన్ని మర్దన చేసుకున్నట్లయితే చక్కటి ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు.

ఆలివ్ నూనెతో..

గిన్నెలో మూడు టేబుల్స్పూన్ల ఉప్పు, రెండు చెంచాల ఆలివ్ నూనె, నాలుగు చుక్కల పెప్పర్మింట్ ఆయిల్ వేసి బాగా కలుపుకోవాలి. దీంతో ముఖం, మెడను మృదువుగా, గుండ్రంగా రుద్దుకొని శుభ్రం చేసుకోవాలి. ఈ మిశ్రమం స్క్రబ్లా పనిచేసి చర్మంపై చేరిన మురికి, మృత కణాలను తొలగిస్తుందట. ఫలితంగా చర్మం ప్రకాశవంతంగా కనిపిస్తుందట.








జోజోబా ఆయిల్తో..

విటమిన్ ఇ నూనె, జొజోబా ఆయిల్ను సమపాళ్లలో తీసుకొని మిశ్రమంగా చేసుకోవాలి. దీనికి కొన్ని చుక్కల పెప్పర్మ్మట్ నూనెను కూడా కలపాలి. మొటిమలు ఎక్కువగా ఉన్న వారు ఈ మిశ్రమాన్ని రోజూ రాత్రి నిద్రపోయే ముందు రాయడం ద్వారా.. అవి తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందంటున్నారు నిపుణులు.

కీరాదోసతో..

రెండు చెంచాల కీరాదోస తురుము, టీస్పూన్ పెప్పర్మెంట్ ఆయిల్ తీసుకొని మిశ్రమంగా చేసుకోవాలి. దీనిలో రెండు టీస్పూన్ల గ్రీన్ క్లే (ఇది సూపర్ మార్కెట్లలో, ఆన్లైన్ స్టోర్స్లో లభిస్తుంది)ను కూడా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి మాస్క్ వేసుకొని పూర్తిగా ఆరనివ్వాలి. ఆ తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేసుకుంటే చర్మం తాజాగా మారుతుందని చెబుతున్నారు నిపుణులు.

మెట్రో




# చింతగింజలు తింటున్నారా?

చింతపండు బాగుచేస్తున్నారా... ఆ గింజలన్నీ ఏం చేస్తున్నారు... ‘ఇంకేం చేస్తాం... వెనకటి రోజుల్లో అంటే పిల్లలు ఆడుకునేవాళ్లు కాబట్టి ఓ డబ్బాలో వేసి ఉంచేవాళ్లం. ఇప్పుడు వాటితో ఏం పని అనుకుంటూ చెత్తబుట్టలో వేస్తున్నాం’ అంటారా. అయితే ఓ క్షణం ఆగండి... చింతగింజలు నేటి మానవాళి చింతను తీర్చే గొప్ప పరికరాలే కాదు, మహిళల ఆరోగ్యానికి మేలు చేసే ఔషధ భాండాగారాలు కూడా!చింతగింజల్ని చూస్తే... చిన్ననాటి చింతపిక్కల ఆటలో, నిప్పులమీద కాల్చుకుని తిన్న రోజులో గుర్తుకొస్తాయే తప్ప, వాటి గొప్పతనం పెద్దగా తెలియదనే చెప్పాలి. కానీ ఆ చింతగింజలే వ్యర్థాల్ని నిర్మూలించే శాక్ష్మయ పరికరాలుగా మారాయిప్పుడు.

నెలసరి నొప్పులకీ!

చింతగింజలు ఆరోగ్యానికి మేలు అని సంప్రదాయ వైద్యమూ చెబుతోంది. వీటిల్లో కాల్షియం, పొటాషియం... వంటి ఖనిజాలు, శక్తిమంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలం. ఈ పొడిని క్రమం తప్పక తీసుకోవడం వల్ల ఎముకల సాంద్రత పెరుగుతుందనీ, మహిళల్లో వయసుతోపాటు వచ్చే ఆస్టియోపొరోసిస్, కీళ్లనొప్పుల నివారణకు తోడ్పడతాయనీ చెబుతుంటారు. మెగ్నీషియం నెలసరిలో వచ్చే నొప్పుల్ని తగ్గిస్తే, ఇతర పోషకాలు హార్మోన్ల అసమతౌల్యం వల్ల కలిగే ఇన్ఫ్లమేషను నివారించి రుతుస్రావాన్ని క్రమబద్ధీకరిస్తాయట.






# బాన పొట్ట తగ్గాలంటే..

ఈ రోజుల్లో మారుతున్న జీవనశైలి, జంక్ ఫుడ్స్ అలవాటు, వ్యాయామం లేకపోవడం వల్ల చాలామంది ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అధిక బరువు. ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయిన కొవ్వు వల్ల ఎంతోమంది ఇబ్బంది పడుతుంటారు. అయితే, ఖరీదైన డైట్లు, జిమ్ల అవసరం లేకుండానే.. మన వంటగదిలో దొరికే జీలకర్రతో ఈ సమస్యకు చెక్ పెట్టవచ్చు.పొట్ట కొవ్వును కరిగించే జీలకర్ర నీరు ఎలా తయారు చేయాలి?

బరువు తగ్గడానికి జీలకర్ర ఒక అద్భుతమైన ఔషధం. ఇది కేవలం బరువును తగ్గించడమే కాకుండా, శరీరాన్ని లోపల నుంచి శుభ్రం చేస్తుంది.తయారీ విధానం: రాత్రి పడుకునే ముందు ఒక గ్లాసు నీటిలో ఒక స్పూన్ జీలకర్ర వేసి, మూత పెట్టి నానబెట్టాలి.

మరిగించే పద్ధతి: మరుసటి రోజు ఉదయం, ఈ నీటిని గిన్నెలో పోసి 5 నిమిషాల పాటు బాగా మరిగించాలి. ఆ నీటిని వడగట్టి, అందులో అర చెక్క నిమ్మరసం కలుపుకుని ప్రతిరోజూ ఉదయం పరగడుపున తాగాలి. ఇలా 15 రోజుల పాటు క్రమం తప్పకుండా చేస్తే మీ శరీరంలో మార్పును మీరే గమనిస్తారు.

జీలకర్ర - నిమ్మకాయ వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు:

కొవ్వు కరుగుదల: జీలకర్రలో ఉండే మెగ్నీషియం, ఐరన్ మరియు ఫైబర్ శరీరంలోని అదనపు కొవ్వును కరిగించడానికి సహాయపడతాయి. నిమ్మకాయలోని విటమిన్-సి, సిట్రిక్ యాసిడ్ కొలెస్ట్రాల్ను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి.

జీర్ణక్రియ మెరుగు: ఈ డ్రింక్ తాగడం వల్ల జీర్ణాశయం శుభ్రపడుతుంది. మలబద్ధకం, గ్యాస్, అసిడిటీ వంటి సమస్యలు దూరం అవుతాయి.

కిడ్నీ ఆరోగ్యం: శరీరంలోని మలినాలను బయటకు పంపి, కిడ్నీల పనితీరును మెరుగుపరుస్తుంది.

షుగర్ నియంత్రణ: డయాబెటిస్ ఉన్నవారిలో రక్తంలోని చక్కెర స్థాయిలను అదుపులో ఉంచడానికి ఇది సహకరిస్తుంది.

ఎముకల బలం: బరువు తగ్గే క్రమంలో ఎముకలు బలహీనపడకుండా ఉండటానికి, జీలకర్రలో ఉండే కాల్షియం ఎంతగానో దోహదపడుతుంది.

# పౌడర్లు, మాంసాహారంతో పనిలేకుండా కేవలం

## శాకాహారంతో ప్రతిరోజూ 120 గ్రాముల ప్రోటీన్

కేవలం శాకాహారంతో శరీరానికి అవసరమైన ప్రోటీన్ అందదని జిమ్కు వెళ్లేవారు, ఫిట్నెస్ ప్రియుల్లో ఒక అపోహ ఉంది. దీని ఫలితంగా,సప్లిమెంట్లపై చాలా డబ్బు ఖర్చు చేస్తారు. కానీ ఎలాంటి దుష్ప్రభావాలు లేకుండా మన కండరాల్ని బలోపేతం చేయగల అనేక సూపర్ఫుడ్స్ను ప్రకృతి మనకు ప్రసాదించిందని మీకు తెలుసా? మీ ఆహారంలో ఎలాంటి పౌడర్లు లేదా మాంసాహారం చేర్చకుండా, సాధారణ శాకాహార భోజనం చేయడం ద్వారా, శరీరంలో 120 గ్రాముల ప్రోటీన్ను తగినంతగా సమతుల్యంగా నిర్వహించుకోవచ్చు. సీనియర్ డైటీషియన్ గ్రేస్ అబ్రహం 120 గ్రాముల ప్రోటీన్ లక్ష్యాన్ని సులభంగా సాధించగల కొన్ని శాకాహార ఎంపికలను సూచిస్తున్నారు.గుడ్లు, చికెన్ లేదా ఖరీదైన ప్రోటీన్ పౌడర్లు లేకుండా రోజువారీ 120 గ్రాముల ప్రోటీన్ లక్ష్యాన్ని సాధించడం అసాధ్యమని ప్రజలు తరచుగా నమ్ముతారు. శాకాహారులకు రోజువారీ ఆహారంలో 120 గ్రాముల ప్రోటీన్ సాధించడం కొంచెం కష్టమైనప్పటికీ, సరైన ప్రణాళిక ఉంటే ఇది ఖచ్చితంగా సాధ్యమే అంటున్నారు సీనియర్ డైటీషియన్ గ్రేస్ అబ్రహం (స్పర్ష్ హాస్పిటల్, హెన్నూర్ రోడ్, బెంగళూరు). అది ఎలాగో పూర్తి వివరాలు ఇప్పుడు చుద్దాం.

డైటీషియన్ ఏమంటున్నారు?

మాంసాహారులతో పోలీస్తే వెజ్ తినే వారికి ఆహారంలో 120 గ్రాముల ప్రోటీన్ సాధించడం చాలా కష్టంగా ఉంటుంది. అయితే, సరైన ప్రణాళిక ఉంటే ఇది ఖచ్చితంగా సాధ్యమే. మన రెగ్యులర్ శాకాహార





భోజనంలో ఉండే చపాతీలు లేదా రోటీలు, అన్నం, పండ్లు, కూరగాయల్లో ప్రోటీన్ పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. అందుకే ప్రోటీన్ ఎక్కువగా లభించే ఆహారాల్ని ఎంచుకోవాలి.

సీనియర్ డైటీషియన్ గ్రేస్ అబ్రహం

ఉదాహరణ డైట్ ప్లాన్ (రోజూ 120 గ్రాముల ప్రోటీన్ కోసం)

ఉదాహరణ డైట్ ప్లాన్ (రోజూ 120 గ్రాముల ప్రోటీన్ కోసం)

500 మి.లీ పాలు: 16 గ్రాముల ప్రోటీన్

200 గ్రా గ్రీక్ యోగర్ట్ / గట్టి పెరుగు (ఎబఅస్త్ర జబతీస): 20 గ్రాముల ప్రోటీన్

100 గ్రా పనీర్: 18 నుంచి 20 గ్రాముల ప్రోటీన్

100 గ్రా సోయా చంక్స్ (ఎండబెట్టినవి): 50 నుంచి 52 గ్రాముల ప్రోటీన్2 కప్పుల పప్పు : 8 గ్రాముల ప్రోటీన్

మొత్తం ప్రోటీన్: 122 నుంచి 128 గ్రాములు.

ఒకవేళ మీరు సోయా తినకపోతే పరిస్థితి ఏంటి?

సోయాను పక్కన పెడితే 120 గ్రాముల లక్ష్యాన్ని చేరుకోవడం కొంచెం కష్టమవుతుంది. అప్పుడు డైట్ ఇలా మార్చుకోవాలి:

మెట్రో ఈవినింగ్స్ సినిమా

# అలాంటి పాత్ర కోసమే నా ఎదురుచూపు

కొత్తదనం నిండిన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటుంది కథానాయిక కీర్తి సురేశ్. ఆమె గతేడాది రివాల్వర్ రీటా, ఉప్పుకప్పురంబు లాంటి చిత్రాలతో సందడి చేసినా.. అవి సినీప్రియుల్ని అంతగా ఆకట్టుకోలేదు. ప్రస్తుతం పలు భాషలలో వరుస చిత్రాలతో బిజీగా గడుపుతున్న ఈ తార మహానటి లాంటి పాత్రలు కావాలని అంటోంది. ఇటీవలే ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న కీర్తి.. భవిష్యత్ పాత్రలు, మహానటి చిత్రం గురించి గుర్తు చేసుకుంది. మహానటి నా జీవితాన్నే మార్చేసిన సినిమా. కెరీర్ ప్రారంభంలోనే ప్రముఖ నటి సావిత్రి పాత్రను పోషించడానికి ఎంతో భయపడ్డాను. ఆ సమయంలో నేను సాధారణ పాత్ర చేయట్లేదని నాకు తెలుసు. కానీ ఈ చిత్రం నన్ను అంతర్జాతీయ స్థాయిలో నిలబెట్టింది. ఇటీవలి కాలంలో నాకు మళ్లీ అలాంటి విజయం దక్కలేదు. ప్రస్తుతం నేను మహానటి లాంటి శక్తిమంతమైన పాత్రల కోసమే ఎదురుచూస్తున్నా అని తన మనసులోని మాటల్ని బయటపెట్టింది కీర్తి.


కీర్తి సురేశ్


సయీ మంజ్రేకర్

# నా కంఫర్ట్ జోన్ దాటేలా చేసిన సినిమా

హృదయమా.. వినవే హృదయమా.. ప్రాణమా.. నువు నా ప్రాణమా.. అనే పాటతో కుర్రకారుని అలరించి మేజర్ చిత్రంతో ప్రేక్షకులను ఆకట్టుకుందీ కథానాయిక సయీ మంజ్రేకర్. వినోదాత్మక, ప్రేమకథా చిత్రాలతో అలరించిన ఈ భామ మొదటిసారిగా ఇకాయ్ అనే హారర్ చిత్రంతో సినీప్రియుల ముందుకు రాబోతుంది. ఈ నేపథ్యంలో ఈ చిత్రం గురించి పలు ఆసక్తికర విషయాల్ని పంచుకుంది. నేను ఇప్పటి వరకు నటించిన చిత్రాలలో ఇకాయ్ అత్యంత సవాలుతో కూడిన చిత్రం. చిత్రీకరణ సమయంలో నా కంఫర్ట్ జోన్ దాటి నన్ను నేను ముందుకు నెట్టుకోవలసిన సందర్భాలు ఎదురయ్యాయి. కొన్ని సన్నివేశాలకు అవసరమైన భావోద్వేగాలు సహజంగా నటించవలసి వచ్చింది. కొన్నిసార్లు ఇబ్బంది కలిగించినప్పటికీ ఇలాంటి అనుభవాలే గొప్ప నటి అయ్యేందుకు సహాయపడతాయి. కొత్త పాత్రలలో నటించేటప్పుడు ఒక కథానాయికగా నన్ను నేను సవాలు చేసుకుంటూనే ఉంటాను. ఈ చిత్రంలో ప్రేక్షకులు నాలో పూర్తిగా భిన్నమైన కోణాన్ని చూస్తారని తెలిపింది కథానాయిక సయీ మంజ్రేకర్.




స్టార్ హీరోయిన్ సమంత ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మా ఇంటి బంగారం' జూన్ 19న గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధంగా ఉంది. ఈ సినిమాకు టాలెంటెడ్ లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి దర్శకత్వం వహించడం విశేషం. ఈ చిత్ర ప్రమోషన్లలో భాగంగా దర్శకురాలు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన ఎవర్‌గ్రీన్ బ్లాక్ బస్టర్ 'బాషా' తెలుగు ప్రేక్షకులకు ఎంతటి కల్ట్ క్లాసిక్‌గా మిగిలిపోయిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఫస్టాఫ్‌లో ఆటో డ్రైవర్‌గా, సెకండాఫ్‌లో మాఫియా డాన్‌గా రజనీకాంత్ విశ్వరూపం ప్రదర్శించిన ప్రభంజనం జగమెరిగిన సత్యం. సరిగ్గా అలాంటి షేడ్స్‌లోనే ఈ సినిమాలో సమంత పాత్ర ఉండబోతోందని నందిని రెడ్డి ప్రకటించడం, సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది.




టాలీవుడ్ లో ఎంతోమంది స్టార్ కిడ్స్ ఎంట్రీ ఇచ్చారు, హిట్స్ కొట్టారు. కానీ, అక్కినేని ఫ్యాన్స్ ఎన్నో ఏళ్లుగా కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తున్న ఆ ఒక్క క్షణం.. అఖిల్ ఖాతాలో ఒక సాలిడ్, పక్కా కమర్షియల్ బ్లాక్ బస్టర్ పడటం. మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ తో డీసెంట్ హిట్ ఉన్నా అంతకు మించి కమర్షియల్ మూవీ కోసం అక్కినేని అభిమానులు ఈగర్‌గా వెయిట్ చేస్తున్నారు. మోస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్ తర్వాత భారీ అంచనాల మధ్య వచ్చిన ఏజెంట్ మూవీ భారీ డిజాస్టర్ కావడంతో అఖిల్ ఒక్కసారిగా స్లో అయ్యాడు. దాదాపు మూడేళ్ల పాటు ఇండస్ట్రీకి, సోషల్ మీడియాకు పూర్తిగా దూరంగా ఉన్న మన అయ్యగారు.. ఇప్పుడు లెనిన్ అనే పవర్ ఫుల్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ మూవీతో బిగ్గెస్ట్ కంబ్యాక్ ఇవ్వడానికి రెడీ అవుతున్నాడు.

# ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్






ఐసీసీ మహిళల టీ20 ప్రపంచకప్ 2026 ఇంగ్లాండ్ వేదికగా అట్టహాసంగా ప్రారంభమైంది. మొత్తం 12 జట్లు ఈ మెగా టోర్నీలో పోటీపడుతున్నాయి. హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని భారత మహిళల జట్టు తన తొలి మ్యాచ్‌లో జూన్ 14న పాకిస్థాన్‌తో తలపడనుంది. ప్రారంభం: టోర్నీ జూన్ 12న మొదలైంది. తొలి మ్యాచ్‌లో ఆతిథ్య ఇంగ్లాండ్ జట్టు శ్రీలంకపై 87 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. భారత షెడ్యూల్: టీమిండియా గ్రూప్‌లో ఉంది. జూన్ 14న పాకిస్థాన్‌తో, జూన్ 17న నెదర్లాండ్స్‌తో, జూన్ 25న బంగ్లాదేశ్‌తో, జూన్ 28న ఆస్ట్రేలియాతో భారత్ మ్యాచ్‌లు జరగనున్నాయి. రికార్డు ప్రైజ్ మనీ: ఐసీసీ ఈసారి రికార్డు స్థాయిలో ప్రైజ్ మనీని ప్రకటించింది. టోర్నీ విజేతకు దాదాపు రూ. 19.55 కోట్ల భారీ నజరానా దక్కనుంది






# ఫిఫా ప్రపంచకప్ 2026

అమెరికా, కెనడా, మెక్సికో దేశాలు సంయుక్తంగా ఆతిథ్యమిస్తున్న ఫిఫా ప్రపంచకప్ 2026 అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. చరిత్రలో తొలిసారిగా 32 జట్లకు బదులుగా 48 జట్లు ఈ మెగా టోర్నీలో పాల్గొంటున్నాయి. ఈ సుదీర్ఘ సాకర్ సమరం జూలై 19 వరకు కొనసాగనుంది. తాజా అప్‌డేట్‌లు మరియు ముఖ్యాంశాలు: ఆరంభ మ్యాచ్: మెక్సికో సిటీలోని ఎస్టాడియో అజ్టెకా వేదికగా ప్రారంభ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ తర్వాత జరిగిన తొలి మ్యాచ్‌లో మెక్సికో జట్టు సౌత్ ఆఫ్రికాపై 2-0 తేడాతో ఘన విజయం సాధించి టోర్నీని విజయవంతంగా ప్రారంభించింది. కొత్త ఫార్మాట్ మొత్తం 48 జట్లను 12 గ్రూపులుగా విభజించారు. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లతో పాటు, మూడో స్థానంలో నిలిచిన ఉత్తమ 8 జట్లు రౌండ్ ఆఫ్ 32 నాకౌట్ దశకు అర్హత సాధిస్తాయి. మొత్తంగా 104 మ్యాచ్‌లు జరగనున్నాయి. భారీ ప్రైజ్ మనీ ఈ టోర్నీ విజేతలకు ఫిఫా భారీగా నజరానాలు ప్రకటించింది. ఛాంపియన్‌గా నిలిచే జట్టుకు రూ. 478 కోట్లు (50 మిలియన్ డాలర్లు) అందనున్నాయి. భారత్‌లో ప్రసారాలు భారతదేశంలో ఈ మెగా టోర్నమెంట్ మ్యాచ్‌లను ప్రముఖ మీడియా సంస్థ జీ ఎంటర్‌టైన్‌మెంట్ ప్రసార హక్కులను సొంతం చేసుకుంది. మ్యాచ్‌లను యునైట్8 స్పోర్ట్స్ ఛానెల్‌లో మరియు కొన్ని యాప్స్‌లో ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నారు.

స్పోర్ట్స్ మెట్రో




టీమిండియా టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ కుటుంబం నుంచి మరో డైనమైట్ బయటకు వచ్చాడు. వైభవ్ సూర్యవంశీ తమ్ముడు ఆశీర్వాద్ సూర్యవంశీ సెంచరీతో చెలరేగాడు. 10 ఏళ్ల వయసులోనే బిహార్‌లో జరిగిన లోకల్ ప్రాక్టీస్ మ్యాచ్‌లో ఆశీర్వాద్ ఈ ఫీట్ సాధించాడు. తాజ్‌పూర్ క్రికెట్ అకాడమీ తరఫున 87 బంతుల్లో ఓ సిక్సర్, 20 ఫోర్లతో 103 రన్స్ చేశాడు. తన అన్నలా దూకుడుగా కాకుండా 118.39 స్ట్రైక్‌రేట్‌తో ఓపికగా బ్యాటింగ్ చేశాడు.

ఈ విషయాన్ని వైభవ్ అన్న ఉజ్వల్ సూర్యవంశీ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నారు. ఆశీర్వాద్ కూడా త్వరలో ఐపీఎల్‌లో ఛాన్స్ కొట్టేస్తాడేమోనని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. ఫ్యామిలీ ఫ్యామిలీ ప్రతిభావంతులే ఉన్నట్లున్నారు కదా? అని ప్రశంసిస్తున్నారు. తమ్ముడి సెంచరీపై వైభవ్ సూర్యవంశీ కూడా సోషల్ మీడియా వేదికగా స్పందించాడు. తమ్ముడి స్కోర్ కార్డ్‌ను ఇన్‌స్టాలో పంచుకున్న వైభవ్ సూర్యవంశీ.. కంగ్రాట్స్ ఆశీర్వాద్ అని క్యాప్షన్ ఇచ్చాడు. అయితే ఈ పోస్ట్‌లో తన చిన్ననాటి ఫొటోను జత చేయడం గమనార్హం.

వైభవ్ సూర్యవంశీకి ఇద్దరు సోదరులు కాగా.. ఉజ్వల్ సూర్యవంశీ పెద్దవాడు. ఆశీర్వాద్ సూర్యవంశీ చిన్నోడు. పెద్దోడు క్రికెట్‌కు దూరంగా ఉన్నా.. చిన్నోడు తన అన్న జాడాలో నడుస్తున్నాడు. ప్రస్తుతం వైభవ్ సూర్యవంశీ శ్రీలంక పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే. భారత్-ఏ తరఫున అఫ్గానిస్థాన్-ఏ, శ్రీలంక-ఏతో ముక్కోణపు సిరీస్ ఆడుతున్నాడు.

ఈ సిరీస్‌లో ఇప్పటికే రెండు మ్యాచ్‌లు ఆడిన వైభవ్ తొలి మ్యాచ్‌లో విఫలమైనా రెండో మ్యాచ్‌లో పర్వాలేదనిపించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్ అద్వితీయమైన ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. 16 మ్యాచ్‌ల్లో 776 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచి ఆరెంజ్ క్యాప్‌తో పాటు ఎమర్జింగ్ ప్లేయర్ ఆఫ్‌ది సీజన్, మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్, సూపర్ స్ట్రైకర్ ఆఫ్ ది సీజన్, అత్యధిక సిక్స్‌ల అవార్డులను కైవసం చేసుకున్నాడు.

ఈ ప్రదర్శనతో టీమిండియాకు ఎంపికయ్యాడు. అప్‌కమింగ్ ఐర్లాండ్, ఇంగ్లండ్ పర్యటనలకు ఎంపిక చేసిన భారత టీ20 జట్టులో 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి చోటు దక్కింది. జూన్ 26న ఐర్లాండ్‌తో జరిగే టీ20 మ్యాచ్‌తో వైభవ్ సూర్యవంశీ అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేయనున్నాడు. ఇప్పటికే భారత జట్టుకు ఎంపికైన అత్యంత పిన్నవయస్కుడిగా సచిన్ రికార్డ్ బద్దలు కొట్టిన వైభవ్.. అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేస్తే ఈ ఘనత సాధించిన యంగెస్ట్ ప్లేయర్‌గా మరో రికార్డ్‌ను కైవసం చేసుకుంటాడు.

Published, Printed, Edited and Owned by **DEVARAKONDA KALIDAS** Printed at DK Publications, 2-3-691/1/A, CPL Main Road, Amberpet, Hyderabad and Published at D.No.1-9-628/4, J.P.Residency, Vidyangar, Hyderabad - 44, **Editor: D.Kalidas, RNI.NO.68319/98, Post Regd.No. HSE/953/2014-16** Phone: 99126 14007, 040-27421007